# అతను ఎవరు?

## (వింధియా కథలు)



అనువాదం: ఏండి సుందరేశన్

# అతను ఎవరు?

## (వింధియా కథలు)

### మూలం: తమిళం

### అనువాదం: ఏండి సుందరేశన్

**ATANU EVARU? (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya's Tamil Short Stories)
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 6

**First Edition, 2020**
© KNS Family/Surviving Members

***Cover Design:***
Front Cover:

The cover illustration is from the ***Swadesamitran*** issue dated February 11, 1947. Used with permission.

The translator acknowledges with thanks the permission to use the illustrations from the various magazines that originally published these short stories.

***Photo Credits:***

Back Cover:
Thota Photo Studio, Berhampur, (Odisha)

**Printed at:**

The Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone: 1-800-690-2679(Toll Free)

# అతను ఎవరు?

## (వింధియా కధలు)

### మూలం: తమిళం

### అనువాదం:

### ఏండి సుందరేశన్

## Published By

**Kurinji Publications**
**El Cerrito, CA 94530, USA**
**10944 San Pablo Avenue # 610**
**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో

## ముందు మాట


1. ఛాయా చిత్రం
2. శారద మనస్సు
3. అతను ఎవరు?
4. ఒక మాట చాలు!
5. ఇద్దరి తప్పు
6. ఒక చిన్న పిలుపు
7. ఆశాగ్ని కిరణాలలో . . .
8. దాగిన పుష్పం
9. ఉత్సవ వైభవం
10. పక్కబలం

# ముందు మాట

ఈ సంపుటంలోని కథలన్నీ దాదాపుగా 1947 నుండి 1956 వరకూ ప్రచురితమైనవి. **'దాగిన పుష్పం'** తప్పిస్తే తక్కినవన్నీ స్వదేశమిత్రన్ పత్రికలో వచ్చాయి.

ఇందులో పొడుగాటి కథ **అతను ఎవరు?** ఇది నాలుగు సంచికలలో ధారావాహికగా వెలుబడింది.

ఇది రెండు పాత్రల - రెహమాన్, అల్లి - కథ. కణ్ణన్ అనే వేరొక పాత్ర సమస్యగా ఎదురైనప్పుడు దానివలన ఏర్పడే పరిమాణాలని వివరించే కథ; ఆ సమస్యకి పరిష్కారం ఏమిటి? అదే ఈ కథ సారాంశం

మొట్టమొదట ఈ కథ చదివినప్పుడు నాకు వెంటనే నచ్చింది. 'ఇది ఆదర్శభావంకి మంచి ఆనవాలు!' అనే భావనే నా మనసులో చోటు చేసుకుంది. మనకి స్వతంత్రం వచ్చిన కొత్తలో దేశంలో చెలరేగుతున్న హిందూ ముస్లీం ఆందోళనలమధ్య ఈ కథ ఒక శుభసూచకంగా కనిపించింది.

చదవగానే పాఠకుల మనసులో ఆశా, సంతోషమూ కలిగించే కథలు సాహిత్యంలో మామూలే అని నేను గుర్తు చేసుకున్నాను; వాటిని Feel-good stories అని అంటారు.

హైస్కూల్లో నేను చదివిన టాగూర్ కథ **కాబూలీవాల్లా** జ్ఞాపకం వచ్చింది. మతాలు వేరైనా పరస్పర స్నేహంతో ప్రజలు కలిసి మెలగాలి అని విశ్వకవి సందేశం అందులో సూటిగా కనిపించదు. తండ్రి - కూతురు మధ్య ఉన్న ప్రేమగురించే అందులో టాగూరు మనకు బోధించారు.

**అతను ఎవరు?** విందియా ఆదర్శభావంతో రాసిన కథ. అది ***స్వదేశమిత్రన్*** పత్రికలో ప్రచురించబడడం సముచితమైన ఒక సంఘటన అని బల్ల గుద్ది ఘోషించవచ్చు.

***స్వదేశమిత్రన్*** 1882లో తమిళ వార్తా పత్రికగా స్థాపించబడి 1928 లో వార పత్రికగా మారింది. స్థాపకుడు జి. సుబ్రహ్మణ్య అయ్యర్.[1] భారత స్వాతంత్రోద్యమంలో కృషి చేసి పేరు సంపాదించిన మహనీయులు ఆ పత్రిక సంపాదక వర్గంలో పాల్గొన్నారు. దేశంలోని ఆ వాతావరణంలో సామాజిక సామరస్యం ప్రేరేపించే కథలు కావాలని వాళ్ళు కోరడంలో ఆశ్చర్యమేముంది? **అతను ఎవరు?** ఆ కోవకి చెందినది.

'రెహమాన్ పాత్రకి ఆధారం ఎవరు?' అని నేను ఆలోచించేవాడిని.

బరుంపురంలో నేను Town Branch లో చదువుతున్న రోజుల్లో ఒక తురక జట్కా బండి తోలేవాడు నాకు తెలుసు; పేరు జ్ఞాపకం లేదు. మా వీధి చివరవున్న డాక్టరుగారు అతని జట్కాలో వ్యాధిగ్రస్తులను చూడడానికి వచ్చేవారు. ఆ సాయబు నన్ను చూసినప్పుడెల్లా "మీ అక్కయ్యగారు ఎలాగున్నారు?" అని నవ్వుతూ అడుగుతాడు. అతని బండిలోనే అక్కయ్య బడికి వెళ్ళిందని నా ఉద్దేశం. అతనే ఈ కథానాయకుడు అని నా నమ్మకం.

** ** ** **

ఇక తక్కిన కథలు చూద్దాం. అన్నింటిలోనూ ప్రధాన పాత్రలు స్త్రీలు - భార్యలుగా కనిపిస్తారు. భార్యల చిత్రీకరణలో వైవిధ్యం (variety) ఉంది. ఎన్నెన్ని రకాలు!

కొన్ని ఉదాహరణలు:

1. ఉత్సవ వైభవంకి భర్త చురుకుగా పని చేస్తున్నాడు; సులభంగా అందరినీ నమ్మే స్వభావం అతనిది. ఆంధ్ర సంగీత విద్వాంసులంటే చులకనగా చూసే ధోరణి. అతనికి కొన్ని సామాన్య విషయాలు, లోక జ్ఞానం నేర్పే భార్య **కమల;**

2. పొరుగింటి ఇల్లాలు శకుంతలిని చూసినప్పుడెల్లా "అయ్యో, పాపం, ఆ చెవులకి వజ్ర దుద్దులు లెవే!" అని వాపోయే **ముత్తైదువ;**

3. తన భర్తకి కర్ణాటక సంగీతంలో మంచి అభిరుచి ఉందని గర్వపడుతూ 'అతను కూడా ఈ పాటకచేరి తప్పక వినాలి!' అని తహతహలాడే **భామా;**

---

[1] అతనే 1878లో 'హిందు' వార్తా పత్రిక స్థాపించారు

4. తన అన్యోన్య స్నేహితురాలు లలిత ధోరణిలో కనిపించే మార్పు బోధపడక మనోవ్యధలో చిక్కుకొని అల్లాడుతున్న **జానకి.**

ఈ పాత్రలన్నీ రచయిత్రి ప్రతిబింబాలని అనవచ్చా?

ఈ కథల్లో విషయవస్తువు అని చూస్తే ఇవన్నీ చాలా సాధారణమైనవే; సన్నివేశాల వర్ణనలూ చాలా సహజంగానే కనిపిస్తాయి; వింధియా తన కల్పనలోనే ఈ పాత్రలు సృష్టించారు.

పాత్రల చిత్రీకరణ గురించి ఒక సూత్రం ఉంది.[2]

" ఒక గ్రంధకర్త రచనా విశేషం గురించి గర్వపడవలసినందుకు మూలకారణం ఇదే: తన్ను మించి, తన కావలిని మించి, పాత్రలు సృష్టించి ఇతరుల అత్యంతర భావనలు అతను మనకి పరిచయం చేస్తాడు."


ఈ తొమ్మిది కథల్లోనూ రచయిత్రి వింధియా ఛాయ ఆవరించుకొని ఉంది అని నా నమ్మకం. ఒక alter ego గా రచయిత్రి ఇందులో మెలుగుతున్నారు. కనిపిస్తున్నారు.

ఎప్పటిలాగే ఈ సంపుటంలోని కథలన్నీ ఉత్సుకతతో చదివి నాకు మంచి సలహాలిచ్చిన అక్కయ్య శెల్వీ విశ్వనాధన్కి నా కృతజ్ఞతలు.

ఏండీ సుందరేశన్

July 10, 2020

[2] " . . . the whole glory of writing lies in the fact that it forces us out of ourselves and into the lives of others." - Sherwood Anderson



# ఛాయా చిత్రం

పెళ్ళయి, కొత్తగా కాపురం ఆరంభించడానికి భార్య వచ్చి ఏడు మాసాలే అయ్యాయి. ఆమెతో ఒక మంచి ఫోటో తీసుకోవాలని రఘు ఆతురతో ఉన్నాడు.

"రాధే, ఇవాళ సాయంకాలం మనం ప్రభా స్టూడియోకి వెళ్దాం. నేను ఫోను చేసి ఏర్పాటు చేసేసాను.; రెడిగా ఉండు," అని రఘు భార్యకి చెప్పాడు.

"సరే, వెళ్దాం. కాని . . ."

తటపటాయించుతూ ఆమె సమ్మతించడం రఘు ఎదురుచూడలేదు. రాధకి ఫోటోలంటే వ్యామోహం అని అతనికి తెలుసుగా? రకరకాలుగా ఇంతవరకు ఎన్ని ఫోటోలు తీసుకుంది!

"ఏం, ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"నాకు మోమాటంగా ఉందండి."

"ఎందుకని? ఎగతెగకుండా నువ్వెన్నో ఫోటోల్లో . . . "

"అవును. ఆ ఫోటోల్లో . . . "

"ఓహో . . . ఇప్పుడు నేనుకూడా నీతో నిలబడడం . . . "

గభీమని రాధై ముఖంని చెమట కప్పేసింది. ఫోటో కెమెరా కటకం ఒక క్షణంలో స్వరూపాన్ని పదిలం చేస్తున్న విధంగా రాధైకూడా మెరిసే తన కన్నులతో తన గాబరా భర్తకి తెలియజేసింది.

"రాధే, నేను ఉత్తికే అన్నాను. నాకూ నీలాగ ఫోటో పిచ్చి వచ్చేసింది! సహవాసదోషం అంటే ఇదే!" అన్నాడు రఘు.

ఇంతలో అతని మాటలు విని రాధై మనసు కుదుటపడిందనే సూచనలు ఆమె మొహంలో కనిపించాయి. రఘు ఆమెను సముదాయించాడు: "మన పెళ్ళి ఫోటో చూసీ చూసీ నువ్వు మురిసిపోవడం నేను చూస్తున్నానుగా! ఇప్పుడు నువ్వు వెనకాడడం చూసి నాకు కొంచెం కోపం వచ్చేసింది. సరేలే, నీకు ఇష్టం లేదంటే ఈ ఫోటో వద్దు!"

"లేదు. మనం వెళ్దాం."

"నిజంగానా? ఏ తడబాటు లేదుకదా?"

"లేదు."

"సరే! ఆ పెళ్ళి ఫోటోలో మనిద్దరం - కొత్తకదా? - ఒకరినొకరు ఎఱుగనట్లు నిలబడ్డాం. ఈ ఫోటోలో మనం భార్యాభర్తలుగా - గంభీరంగా - నిలబడాలి! తెలిసిందా?"

"సరే," అని ఆమె జవాబు చెప్తూంటే వచ్చిన నవ్వుని అణచుకుంటూ రాధై పెదిమలు ముడుచుకున్నాయి; అది చూసి రఘు కళ్ళు తళతళ మెరిసాయి.

"ఏమే, మనం జగడమాడుతున్నట్టు నిలబడాలంటున్నావా?"

"ఛీ!" రాధై పరుగులెత్తింది. ఆ పరుగులో దాగివున్న ఆనందం ఎలా వర్ణించడం?

సంతోషంతో ఒక నిమిషం అలాగే స్తంభించిపోయిన రఘు భార్య వెనుక వెళ్ళాడు; ఫోటోలో ఎలా నిబడాలని రాధైకి కొన్ని జాడలు చూపవద్దూ?

"రాధే, దయచేసి నీ రూపం ఫోటోలో కొంచెం తక్కువగానే కనిపించాలి. అప్పుడే నేను నీకు కొంచెం సరిసమానంగా కనిపిస్తాను!" అని అంటూ రఘు ఆమె చెవిలో గుసగుసలాడాడు.

ఆ సాయంకాలం దంపతులు ఫోటో స్టూడియోకి బయలుదేరారు. దారిలో రాధై "ఇన్ని స్టూడియోలు ఉన్నాయే, మనం తప్పకుండా 'ప్రభా'కే వెళ్ళాలా?" అని అడిగింది.

"అవును! The Best ! పేరుమోసిన స్టూడియో! నాకు పరిచయమున్నవాళ్ళు చాలామంది అక్కడకి వెళ్ళడం నాకు తెలుసు! మనకేం తక్కువ?"

"పేరుగల స్టూడియో అంటే నాకు భయంగా ఉందండి! నేను తీసుకున్న ఫోటోలన్నీ ఇంట్లోనే!"

"ఈ ఊరులో ఫోటో అంటే స్టూడియోకే వెళ్ళాలి!" అని రఘు భార్యకి దృఢంగా తెలియజేసాడు. ఆ తరువాత ఉగ్రతని తగ్గించుకొని, "రాధే, నీకేం భయం వద్దు! నువ్వు ఎక్కడ ఫోటో తీసుకున్నా బాగా కనిపిస్తావ్! ఇక, సరైన Angle లో తీస్తే, నేనూ బాగానే కనిపిస్తాను!" అన్నాడు.

రాధైకి పరిస్థితి బోధపడింది. "బాగుంది, ఇవాళ మనం ఫోటోగురించే దెబ్బలాడుకుంటున్నాం!" అని అంటూ మెల్లగా నవ్వింది. కాని కళ్ళలో ఆమె మనసులోని ఆరాటం ఏమాత్రం తగ్గలేదనే సూచనలు నిలకడగా కనిపించాయి.



ప్రభా స్టూడియో చేరుకున్న తరువాత భయపడుతూ, ఆమె నాలుగుపక్కలా, ఇటూ అటూ  చూసుకుంటూనే లోపలకి వెళ్ళింది; అది చూసి రఘుకికూడా ఆమెపై జాలి కలిగింది.

"ఇదేం పిచ్చి! అసలు దీనికే మంచి photogenic face ఉంది! పాపం, ఆత్మవిశ్వాసం లేక బాధపడుతోంది!"అని తనలో అనుకున్నాడు.

ముందటే చేసిన ఏర్పాటువలన వెళ్ళిన  పని త్వరలో పూర్తి అయింది. 'నాయనా, ఒక గండం తప్పింది!' అని రాధై నిట్టూర్పు వదులుతూ, మెట్లు దిగింది. బయటకి రాగానే జంకుతూ కొంచెం సేపు అలాగే నిలబడింది; స్టూడియో ద్వారంలో వేలాడుతున్న బోర్డుని, అందులో రేచు కవచంలో ఉన్న పేరుని చూసింది.

"ఏమిటి చూస్తున్నావ్?" అని రఘు అడిగాడు.

"పేరుని చూసాను . . .  'ప్రభాత్', 'ప్రకాష్' అనే పేర్లతో వేరే స్టూడియోలు ఈ ఉరులో ఉన్నాయా?"

"లేవే! . . . ఎందుకు అడుగుతున్నావ్?"

"ఉత్తికే అడిగాను; ఎవరో చెప్పినట్టు జ్ఞాపకం; మొదటి అక్షరం 'ప్ర' అని గుర్తు."

"నాకు తెలీదు . . .  వేరే స్టూడియో ఏదైనా ఉందేమో?" అని రఘు గొణిగాడు.

"ఇంకోటి ఉందో, లేదో మనకేం బాధ! ఏ స్టూడియో ఐతేనేం, మనమున్న ఫోటో బాగా రావాలి! అదే నా బెంగ!"

రఘు నవ్వేసాడు; రాధైమీద సానుభూతి కలిగింది. "రాధే, విను! ఫోటో గురించి మనకెందుకు ఇంత ఆరాటం చెప్పు? ఫోటోలో మనం ఎలా కనిపిస్తున్నాం అనేది ఒక సర్వసాధారణ విషయం; కొన్నిసార్లు నీ రూపం పొరబాటనిపిస్తుంది; మరికొన్ని సార్లు, 'నేను బాగానే ఉన్నాను!', 'అందంగానే కనిపిస్తున్నాను!' అనే ఆలోచన చోటుచేసుకుంటుంది. అబ్బబ్బా, ఇవాళ నీకెంత భయం! విను, నాకేమో మనిద్దరం బ్రహ్మాండంగా కనిపిస్తాం అనే నమ్మకం ఉంది!" అని ధైర్యం చెప్పాడు.

రాధై మరేం అనలేదు. కాని ఆ తరువాత భర్తతో నవ్వుతూనే మాట్లాడింది. ఆ ఫోటో ఘటన తరువాత ఆమె మనసులోని భారం తగ్గిందేమో?

ఆ తరువాత వచ్చేవారంలో రఘు ప్రభాకి వెళ్ళి మచ్చుకని కొన్ని ఫోటోలు చూసివచ్చాడు. రెండు విధాలుగా ఫోటోలు తీయడంవలన రెండు నమూనాలు

అతనికి చూపారు. రెండూ బాగానే ఉన్నాయి. కాని ఖర్చులు తగ్గించాలని ఒకటిమాత్రం ఎంచుకొని, ఆరు ప్రతులకి రఘు ఆర్డరు ఇచ్చాడు. ఒక వారం తరువాత వెళ్లి వాటిని అందుకున్నాడు. “భలే!”, “భలే!” అని మనసు గంతులేసింది. ఆ సమయంలో అక్కడున్న ఒక యువకుడు “ఏమండీ, మీ ఫోటో మా షోరూములో ప్రదర్శించుతే మీకేం ఆక్షేపణ లేదుకదా?” అని అడిగాడు. అది విని రఘు కొంచెం గర్వపడుతూ “నాకెందుకు ఆక్షేపణ?” అని గుడ్డిపేటుగా అనేసాడు. ఇంటికి రాగానే ఆ వార్త రాధైకి చెప్పాడు. రాధై ఫోటో చూసి సంతోషించింది; కాని దాన్ని స్టూడియోలో ప్రదర్శించుతారు అని తెలిసి బాధపడింది. “సరేలేండి, దీనిగురించి మీరు గొప్పగా అందరిముందూ వల్లించవద్దు!” అని మాత్రం వేడుకుంది. ఆమె కోరిక విన్నతరువాత ఆమె పడుతున్న వేదన న్యాయమే అని రఘుపతికి అనిపించింది.

ఒక నెల తరువాత ఒక స్నేహితుడుతో రఘు వాహ్యాళి వెళ్తున్నప్పుడు ఆ స్నేహితుడు తన కెమెరాకి ఉపకరణాలు కావాలని ‘ప్రభా’లో ప్రవేశించాడు; రఘుకూడా అతనితో లోపలికి వెళ్ళాడు. స్నేహితుడు షాపింగ్ చేస్తూంటే రఘు షోరూముకి వెళ్ళాడు. అక్కడ అతను ఆతురుతగా చూడాలనుకున్న ఒక ఫోటో కనిపించింది. అక్కడున్న అన్ని ఛాయాచిత్రాల్లో అదే గొప్పగా రాణించడం చూసి రఘు గర్వపడ్డాడు.

‘ఎంత బాగుంది! ఒకరోజు రాధైనికూడా పిలుచుకొనివచ్చి దీన్ని చూపించాలి!’

అలా ఆలోచిస్తూనే, రఘు తన దృష్టి వేరేవేరే దిశల్లో మళ్ళించాడు. మరుక్షణం వాపోయాడు:

‘అయ్యో, అదేంటి? రాధైలాగ ఉందే? అవును, రాధై ఈ ఫోటోలో ఏకాంతంగా కనిపిస్తోందే! అదెలా సాధ్యం? రాధైని ప్రత్యకంగా ఎవరూ ఫోటో తీయలేదే? ఈ ఊరులో రాధై తీసుకున్న మొట్టమొదటి ఫోటో నాతో తీసుకున్న ఫోటో! ఇది నిజంగా రాధైయేనా? అవును, రాధైయే!’

ప్రదర్శనకని అక్కడున్న ఛాయాచిత్రాల్లో రాధై ఫోటోకూడా ఉంది; అది పెద్ద ప్రమాణంలో ఉంది. చాలా ఫోటోలు ప్రత్యేక ప్రక్రియ, నైపుణ్యత, రంగులతో

కనిపించాయి. కాని రఘు కళ్ళకి రాధై ఫోటోమాత్రం కనిపించింది - అగ్ని జ్వాలలాగ!

ఆ ఉల్లంఘున గురించి స్నేహితుడుకి చెప్పడానికి రఘు జంకాడు; స్టూడియోలో ఎవరినీ అడగడానికి అతనికి ధైర్యం లేదు. ఇంటికి వచ్చినతరువాత రాధైకీ చెప్పలేదు. ఆ కబురు వింటే ఆమె అదిరిపడుతుందని రఘుకి తెలుసు. ఆ రోజు రాధై మాటవరుసలో "రానూ రానూ నాకు ఈ ఫోటోలమీద విరక్తి వచ్చేస్తుందనిపిస్తోంది!" అని అన్న మాటలు అతను గుర్తుచేసుకున్నాడు.

ఆ ఆలోచన రాగానే రఘు నోరు పెగల్లేదు; కాని భూమిలో మనం పాతిన విత్తనం మొలకెత్తడానికి బాహ్యంగా దానికి నీరు, సూర్యరశ్మి సాయం చెయ్యాలికదా?

త్వరలో రఘు మనసులోని గూఢమైన కబురు బయటపడడం కృష్ణస్వామి అనే ఒకతని రాకవలన జరిగింది. అతనితో రఘుకి ఎక్కువగా పరిచయం లేదు. ఐనా, అతన్ని చూడగానే, 'ఇతను వయసు మరలినవారు, నన్ను చూడడానికి వచ్చారు,' అని రఘు సంతోషించాడు. కాని అతనితో మాటాడుతున్నప్పుడు కృష్ణస్వామి కన్నులు నాలుగు గోడలమీద వ్యాపించడం గమనించగానే రఘుని దిగులు బాగా పట్టుకుంది. దంపతుల పెళ్ళి ఫోటో చూడగానే కృష్ణస్వామి చూపు తీక్ష్ణంగా మారింది. కనుబొమలు నిక్కబొడుచుకున్నాయి. రఘు అదిరిపడ్డాడు. రెండురోజులుగా అతను పడుతున్న ఆరాటమంతా ఫోటో గురించేకదా?

గభీమని అతను "నాయనా రఘుపతి! మీరిద్దరూ కలిసి తీసుకున్న వేరే ఫోటో ఏదైనా ఉందా?" అని అడిగారు.

"హూం . . . ఉందే!"

"ఎక్కడ?"

"పక్క గదిలో ఉంది."

"ఏదీ, దాన్ని తీసుకురా . . . చూద్దాం."

రఘు దాన్ని తీసుకొని వచ్చే సమయంలో రాధై కాఫీతో కృష్ణస్వామిని చేరుకుంది.

‘ఇతనితో సంభాషణ వలన రాధైకి ఆ ఫోటో గురించి గుట్టు బయలపడుతుందేమో?’ అని రఘు తల్లడిల్లిపోయాడు.

‘ఐనా, అదీ ఇక్కడే ఉంది; అందువలనే ఫోటోగురించి అతను మర్యాదగా ఏమీ అనరేమో?” అని భ్రమతో ఆశించాడు.

ఆ క్షణం అతని మనసు ఫోటో నెగటివ్ లాగ - వెగటుగా, భయంకరంగా - మారిపోయింది.

కాఫీ తాగిన తరువాత రాధైకూడా కృష్ణస్వామితో ఏవో నాలుగు మాటలు మాట్లాడి, వంటగదికి వెళ్ళిపోయింది.

‘సరే, ఇక మన రహస్యం గతి ఏమౌతుందో?’ అని రఘు కాచుకొని ఉన్నాడు.

“భలే! ఫోటో చాలా బాగుంది! ఎక్కడ తీసారు? ప్రభాలోనా?”

“అవునండీ.”

“Radhai looks excellent!” అని కృష్ణస్వామి పొగడారు.

‘మంచి వేళ, గండం తప్పిందిరా!’ అని ఆనందిస్తూ రఘు కుర్చీలో వాలాడు; కాని అప్పుడే కృష్ణస్వామి వాడిని అడిగేసారు.

“రఘూ, నీకు ‘ప్రభా’ స్టూడియోలో ఎవరానా స్నేహితులున్నారా?”

“ఎవరూ లేరే?”

“అక్కడ షోరూములో మీ ఇద్దరి ఫోటో బ్రహ్మాండంగా ప్రకటన చేసారోయ్! అందుకే అడుగుతున్నాను!”

“హూం . . . ”

“అవును! ఇదే ఫోటో ఆ షోరూములో ఉంది! . . . అదైనా పోనీలే . . . కాని మీ ఆవిడ ఫోటోకూడా - పెద్ద సైజులో - అక్కడ పెట్టారు. అదిచూసి నేను ఉలికిపడ్డాను!”

“సార్, మీరెప్పుడు చూసారు?”

“నిన్న మా అమ్మాయి ఫోటో enlarge చెయ్యాలని ప్రభాకి వెళ్ళాను, అప్పుడు చూసాను. మీ అనుమతితోనే ఆ ఫోటో ఉంచారని ఏమీ అడక్క ఊరుకున్నాను. ఇప్పుడే నిన్నడుగుతున్నాను.”

“అంకుల్, నా ఫోటో అక్కడ మీరు చూసారా? నిజంగానా? నేనెప్పుడూ ఒంటరిగా ఫోటో తీసుకోలేదే?” అని అడుగుతూ రాధై అక్కడికి వచ్చేసింది.

కృష్ణస్వామి కొంచెం జంకారు; ఒక నిమిషం ఆగి, అతను మాటాడారు:

“లేదమ్మా. అది నీ ఫోటోపే! మీరిద్దరూ ఉన్న ఫోటోనుంచి దాన్ని విడదీసినట్టు కనిపించలేదు, కాని అది నీ ఫోటోపే! . . . నేనేం కారణం లేకుండా సందేహించడంలేదు . . . పాపం, అదీ చెప్తేనే నీకు నమ్మకం కలుగుతుంది . . . ”

“అదేంటి?”

“అవును. నీకు తెలుసునో లేదో? నారాయణన్ అనే అబ్బాయి . . . ఆ రోజుల్లో అతనికీ, నీకూ పెళ్ళి సంబంధం గురించి ఈ ఊరులో చెప్పుకొనేవారు . . . ”

ఆ మాటలు విని స్వభావంగా మనసులో లేచిన ఆతురత వలన రఘు రాధై ముఖం ఒక సారి చూసి కళ్ళు కిందకి జారవిడిచాడు; అదెలా మారుతుందనే కల్పనకూడా తనకి అసాధ్యమని గుర్తుచేసుకున్నాడు.

కృష్ణస్వామి మళ్ళీ మాటాడారు:

“ఆ నారాయణన్ నాకు దూర బంధువు, ప్రభాలో పనిచేస్తున్నాడు . . . వాడిలాంటి పని ఏదైనా చేసివుంటాడని నా ఉద్దేశం . . . ”

“ఇందుకేకదా నేను ముందే . . . ” అని రాధై వెక్కి వెక్కి ఏడవడం ఆరంభించింది.

రఘు, కృష్ణస్వామి ఆమెని ఓదార్చారు.

“ఏడవకమ్మా, పిల్లకాయలు కొందరు ఇలాంటి పిచ్చిపనులు చెయ్యడం గొప్పనుకుంటారు. నువ్వు మాత్రం తప్పకుండా ఈ ఫోటో ప్రదర్శించడానికి అనుమతి ఇచ్చివుండవు అని నాకు అనుమానం కలిగింది. అందుకే నిన్నడిగాలని వచ్చాను. ఇక నేను వెళ్ళి ఇదేదో కనుక్కుంటాను.”

కృష్ణస్వామి లేచారు. రఘుకూడా లేచి నిలబడి “సార్, ఇప్పుడే వెళ్దాం, నేనూ వస్తాను” అని అన్నాడు. “మేం చూసుకుంటాం, నీకేం బెంగ వద్దు!” అని రాధైకి ధైర్యం చెప్పి ఇద్దరూ బయలుదేరారు.

తను మరేం చెయ్యాలో తోచక రాధే ఇంట్లోనే అడుగులు వేసుకుంటూ కాలం గడిపింది. ఎవరో వచ్చినట్టు అడుగుజాడలు వినిపించగానే గుమ్మందగ్గర వచ్చి చూసింది. హక్కుతో ఒకతను లోపలికి వచ్చేసాడు. ఎవరు? నారాయణన్.

"ఓ, మీరా? . . . రండి," అని స్వాగతం చెప్పింది.

"అవును, నేనే! మీ ఆయన లేరా?"

"అతను . . . ఇప్పుడే వెళ్ళారు . . . మిమ్మల్ని చూడడానికే . . . "

"నన్ను చూడడానికా? . . . అతనికి నేనెవరో తెలియదే?"

"మీకు కృష్ణస్వామి అంకుల్ బంధువులని . . . "

"ఓ, అదా సంగతి? ఇద్దరూ కలిసి వెళ్ళడం చూసాను . . . నన్ను కలుసుకోవాలనా?"

"అవును."

"నన్ను చూసినా అతనికి తెలీదు! సరేలే . . . నీకోసమేగా అతను లేనప్పుడు నేను నిన్ను చూడాలని వచ్చాను?"

"అయ్యో, మరి 'అతను ఉన్నారా?' అని నన్ను ఎందుకు అడిగారు?"

"హూం, ఉత్తికే అడిగాను . . . "

"అయ్యయ్యో . . . "

"నీకేం ఏం భయం వద్దు! నేను నిన్ను మింగేయను . . . నీకొక కబురు చెప్పాలని వచ్చాను."

"ఫోటో గురించా?"

"నీకెలా తెలుసు?"

"నాకు తెలుసు."

"రాధే, ఇప్పుడుకూడా నీకు నా మనసులో ఏముందో తెలుసన్నమాట!"

"అయ్యో, అదేం కాదు! కృష్ణస్వామి అంకుల్ నాకు చెప్పారు."

"సరే, నీకు ఎలాగో తెలిసిందన్నమాట! నా కసి తీర్చుకోవాలని నీ ఫోటోని విడిగా తీసి షోరూములో పెట్టాను . . ."

"ఏ ఫోటోతో ఆ పని చేసారు?"

“మీరిద్దరూవున్న ఫోటోనుంచే! మీ ఆయన ఒక Proof కావాలని అడిగారు; అదే నాకు వసతిగా కుదిరింది. మీరిద్దరూవున్న ఫోటో మా షోరూములో చూపించడానికి తనకి ఆక్షేపణ లేదన్నారు. అంతే, నేను సాహసంకి పూనుకున్నాను!”

“అది అన్యాయం కాదా?”

“ఏది అన్యాయం? నీకు గుర్తుందా? ఒక మామిడి తోటలో మనిద్దరం ఒక group photo లో ఉన్నాం. నేను కష్టపడి మనిద్దరిని ఆ ఫోటోనుంచి విడదీసి, దాన్ని పెద్దదిగా చేసి, నీకు బహుమతిగా ఇచ్చాను. నువ్వేం చేసావ్? దాన్ని నిర్లక్ష్యంగా చించి పారేసావ్! అది అన్యాయం కాదా? నీకు అంత సాహసం అంటే, మరి నేను మాత్రం భయంతో ఏమీ చెయ్యక ఊరుకుంటానా?నాకు పట్టరాని కోపం వచ్చేసింది! నేను చమత్కారంగా సృష్టించిన మనిద్దరి ఫోటో పోయింది! ఇప్పుడు నీ గుట్టు బయలుపడిందని నాకు చాలా తృప్తి!”

“అది పనికిరాని పని! అతని ఫోటోతో మీరు వేరే ఒక అమ్మాయిని ముడిపెట్టివుంటే అదొక గడసరియైన పని అనవచ్చు . . . కాని ఇప్పుడు మా దాంపత్యంలో ఎటువంటి అల్లరికి చోటు లేదు.”

“ఓహో, అలాగా?”

“అవును, తప్పకూండా! ఐనాకూడా ఆ షోరూములోవున్న నా ఫోటోని తీసేయాలని షోరూమ్ మానేజర్కి చెప్పాలనుకుంటున్నాం.”

“అతను తీసేయవచ్చు. కాని నా మనసు ఎలాగో ఒక నెలవరకూ తృప్తిగా ఉందే, అది నాకు చాలు! ఇప్పుడూ నా మనసు అనిశ్చితగా ఉంది; కొంచెం సమయం తరువాతనే ఏం చెయ్యాలని దానికి అర్థమౌతుంది.”

“అదీ ఒక ఫోటో మూలంగానేనా?”

ఆయాసపడుతూ నారాయణన్ ఆమెను చురుగ్గా చూసాడు. ఇంతసేపూ తనగురించే ఆవేశంతో మాటాడినవాడు ఆమె మొహం నిలకడగా చూడలేదు.

“ఏమన్నావ్? ఫోటో మూలంగానా? బాగా చెప్పావ్!” అని నారాయణన్ కొంచెం బిగ్గరగానే అడిగాడు. ఆ తరువాత కంఠధ్వని తగ్గించి మాటాడాడు: “రాధే, పెద్దలు మన పెళ్ళిగురించి ఆలోచించినప్పుడు మనం దానిగురించి ఎక్కువగా

మాటాడలేదు. ఆ పెళ్ళిసంబంధం ఆగిన తరువాత దానిగురించి మాటాడాలని నాకు ఆశ. కాని నువ్వు నా మనసులో కనిపిస్తూ, కనిపిస్తూ, మాయమౌతున్నావ్. ఇన్ని సంవత్సరాలతరువాత ఇవాళే మనం చాలా చాలా మాటలు 'పంచుకున్నాం'."

రాధై ఏమీ అనలేదు, అతన్ని చూడలేదు, కాని నారాయణన్ అది గమనించలేదు. రాధై మనసు ఇప్పుడు జీవనదిలాగ మారింది: జీవనది ఎల్లప్పుడు ప్రవహిస్తూ ఉంటుంది. సామాన్యంగా అది హిమాలయా పర్వతంలో పుట్టి మైదానాల ద్వారా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. వేసవిలో మంచు కొండల్లో మంచు కరగడం వల్లనూ, వర్షా కాలంలో వర్షపు నీటితోనూ సంవత్సకాలమంతా అది ప్రవహిస్తుంది. ఆ విధంగా రాధై మనసులో పవిత్రత, దృఢత్వం, చోటుచేసుకున్నాయి.

కాని నారాయణన్ వాగుడు ఆగసేలేదు:

"నీకు పెళ్ళి సంబంధం కుదిరిందని తెలియగానే నేను ఎంత బాధపడ్డానో తెలుసా? మనకిద్దరికీ పెళ్ళి నిశ్చయమైతే నా కేమెరాని ఎవరికైనా అందించి రకరకాలుగా మన పెళ్ళి ఫోటోలు తీయాలని ఆలోచించాను. ఆ తరువాత నీ పెళ్ళిగురించి నాకు వార్త అందింది. ఆ సమయంలో పెళ్ళిపందిరికి వచ్చి, ముహూర్త సమయంలో పెండ్లికొడుకుని తటాలున పట్టుకొని, నేను నీ పక్కనే నిలబడి, అతని చెయిలో కేమెరా ఇచ్చి మనల్ని ఫోటో తీయమని ఘోషించాలని అనుకున్నాను."

"పాపం, ఆయనికి కేమెరా గరించి ఏమీ తెలియదు!" అని అంది రాధై, మెల్లగా.

"పాపం అంటున్నావా? ఎందుకు పాపం? నేను కష్టపడి జోడుకూర్చిన ఫోటోని చింపి పారేసావే, అది పాపం కాదా?"

"నేనే పాపం చెయ్యలేదు! అప్పుడు మా పెళ్ళి ఐపోయింది. అందరూ మా ఇద్దరినీ జోడుకూర్చి దీవించారు . . . ఇప్పుడు మీరు మా ఇద్దరిని ఎడబాటు చేస్తున్నారే? మీకెవరు ఆ హక్కు ఇచ్చారు?"

తెగువతో అతన్ని అదరగొట్టాలనే రాధై ఆ ప్రశ్న అడిగింది. ఆమాటల తాపం తాళలేక నారాయణన్ గిజగిజలాడాడు.

"ఆ హక్కు పోయిందనే నాకు రోత . . . సరే, రాధే, నేను వస్తాను!" అని అంటూ నారాయణన్ శెలవు తీసుకున్నాడు.

రాధై మరేం అనక, వొంగి, గోడమీద తల ఆనుకొని నిలబడింది.

అకస్మాత్తుగా గుమ్మందగ్గర ఏదో సందడి వినిపించింది; మెట్లు దిగుతున్న నారాయణన్ భుజాన్ని తాకుతూ రెండు చేతులు; రాధై తిరిగి చూసింది. ఎవరు? రఘు!

"రావయ్యా, ఇంటి లోపలికి!" అని అంటూ రఘు అతన్ని లోపలికి తీసుకొని వచ్చేసాడు.

"రాధే, ఇతన్ని చూడాలనే నేను వెళ్ళాను. కాని దారిలో అంకుల్ తనకేదో వేరే engagement ఉందని గుర్తు చేసుకున్నారు . . . అందువలన నేను ముందుగానే తిరిగివచ్చేసాను . . . ఇతను రావడం మంచిదైంది!" అని భార్యకి చెప్పాడు.

రాధై కలవరపడుతూనే "సరే, లోపలికి రండి," అని భర్తకి దారి వదిలింది.

"రాధే, ఆ మామిడితోట ఫోటోలో ఇతను ఉన్నారుకదూ?" అని ఏదో ఆలోచించినట్టు రఘు అడిగాడు. "ఏదీ, దాన్ని తీసుకొని రా, చూద్దాం!"

"ఇప్పుడది లేదే!"

"ఉంది. నీ ఆల్బంలో ఉంది; నీకు జ్ఞాపకం లేదా? ఆల్బంనే తీసుకొని రా! వెళ్ళు!"

ఆ సమయంలో భర్తతో ఏకీభవించడమే ఉచితమని రాధై గ్రహించి, లోపలికి వెళ్ళింది.

"నారాయణన్! మీరెప్పుడు ఆ ఫోటో చూసారో మీకు గుర్తుందా? మా ఆవిడకి ఫోటోలంటే పిచ్చి! నేను దానికి విరుద్ధం! కాని ఇటీవల మా ఇద్దరి మనసులూ అన్యోన్యంగా మారుతూ వస్తున్నాయి."

ఇంతలో రాధై ఆల్బంతో తిరిగివచ్చింది. రఘు దాన్ని తెరిచి, అందులోనుంచి ఒక ఫోటో చించాడు. " నారాయణన్ సార్, ఈ మామిడి తోట group ఫోటో మీరు తప్పకుండా తీసుకోవాలి! నా భార్య ఇంతకుముందు చింపేసిన ఫోటోలాగ మీరొక కాపీ చేసుకోవాలి. నాకొక కాపీ ఇవ్వదలచుకుంటే నాకేం ఆక్షేపణ లేదు! తెలివితక్కువగా మా ఆవిడ ఆ ఫోటో నాశనం చేసినందుకు నేను మీ దగ్గర క్షమాపణ కోరుతున్నాను!" అని అంటూ అతనికి అది అందించాడు.

"మీరేమంటున్నారు!" అని రాధై తన కనుబొమలు ముడుచుకొని భర్తని చూసింది; నారాయణన్ నివ్వెఱపోయి అలాగే నిలబడిపోయాడు.

"రాధే, నేనంటున్నది విను. నువ్వు ఇతని మనసులో ఉన్నప్పుడు ఆ ఫోటోలో అతనితో ఉండకూడదా? అతనేమో తన ఆత్మతృప్తికోసం ఆ ఫోటో ఉంచుకుంటే, ఉంచుకోనీ! తనకని పెళ్ళయితే అతనే ఆ ఫోటోని చింపి పారేస్తారు! అంతవరకూ అతనెందుకు బాధపడాలి, చెప్పు? ఈ ఫోటో అతని మనసుని ఊరడిస్తే మంచిదేకదా?"

ఇంతవరకూ ఆ ఫోటోకోసం కాచుకొనివున్న నారాయణన్ గభీమని లేచాడు.

"సార్, ఇక్కడ జరిగేది నాకొక నాటకంలాగ కనిపిస్తోంది! మీరిద్దరూ నటిస్తున్నారా? నాకేం అర్ధం కావడం లేదు! రాధై కూడా చెప్పింది: మీ ఫోటోతో వేరే యువతిని ముడిపెట్టివుంటే ఫలితం ఉండేదేమో అని; అప్పుడూ మీ దాంపత్యంకి హాని రాదని  నాకు రూఢిగా చెప్పింది. మీ ఇద్దరి మధ్య ఉన్న  ప్రేమ ఎలాంటిదని నాకు తెలీదు: అసలు అంతరంగీకంగా మీ మధ్య ప్రేమే లేదా, లేకపోతే బాహటంగా కనిపించేది మితిమీరిన మక్కువ అనాలా? నేను వస్తాను, సార్!"

ఆకులు రాలే ఋతువులో అకులు తమంతట తామే నేల రాలుతాయి; చెట్టు ఆశ్చర్యంతో, అపరాధ భావంతో ఉత్తికే నిలబడి ఉంటుంది. ఇప్పుడు నారాయణన్ అదే పరిస్థితిలో ఆ దంపతుల ఎదుట కనిపించాడు; అతనికీ భవిష్యత్తు ఉందని ఇద్దరికీ నమ్మకం కలిగింది.

నారాయణన్ వెళ్ళిపోయాడు. రాధై భ్రమతో కూర్చుండిపోయింది. మూడవ మనిషి అని ఎవరూ లేరు. భర్తనుంచి ఏ ఎత్తిపొడుపు వస్తుందో ఎవరికి తెలుసు?

"రాధే!", అని రఘు మెల్లగా ఆమెని తిరిగి చూసాడు.

"భలే, నువ్వు చమత్కారంగా మాటలాడి  వాడి నోరు మూసేసావ్!" అని మెచ్చుకున్నాడు.

"మీరూ, చాలా మర్యాదగా, త్యాగిలాగ, మాటాడారుగా? అలాగే నా ధోరణి కూడా," అని రాధై అంది. ఆమె మనసులో ప్రశాంతం చోటుచేసుకుంది.

"నేనన్నది నిజం. కొన్ని విషయాలు గ్రహించడం నాకు చేతకాదు!"

రాధై భర్తని రెప్పవాల్చకుండా చూసింది. 'నా మనసుకంటే మీదే మంచి మనసు!' అని అతనికి చెప్పాలని ఆమెలో ఆతురత లేచింది. కాని ఆమె చెప్పినది వేరే. "కొన్ని సమయాల్లో మీ మాటలు వింటే నాకు ఒకటే హడలు, కాని విన్న తరువాత ఆ భయం ఉండదు! మీ మనసుని అవగాహన చేసుకోడం ఎలాగ? అదొక ఫోటో నెగటివ్ గా, ఫోటో కాపీగా కనిపిస్తుందే?" అని నవ్వుతూ అంది.

"నా మనసులో ఏముందో నారాయణన్ గ్రహించాడో లేదో? పోనీలే . . . నువ్వుగాని వాడిని పెళ్ళిచేసుకొనివుంటే, నేను ఇప్పుడు నీదగ్గరకి పరుగెత్తుకొనివస్తే నా గతి ఏమైయుంటుంది? అమ్మయ్యో, ఆ ఆలోచనే నాకు భయంగా ఉంది!"

"అవును, తప్పకుండా!" అని అంటూ రాధై పరుగెత్తింది. ఇక్కడ రఘు కళ్ళముందు పరుగెత్తిన రాధై అక్కడ నారాయణన్ కళ్ళముందుకూడా పరుగెత్తింది. ఈ క్షణం భర్తతో ఏకమైన రాధై అక్కడ నిర్మలమైన నారాయణన్ అంతరాత్మలో రఘుతోనే కనిపించింది.

నారాయణన్ అంతరాత్మ బోధన అనుసరించి రాధై తన భర్తతో అతని హృదయంలోనూ చోటుచేసుకుంది.

రఘు, రాధై ఇద్దరూ ఉన్న ఛాయాచిత్రం ఒకటి తను భద్రపరచి, అప్యాయంగా కొనియాడాలని నారాయణన్ ఆకాంక్ష.

ఇంతలో, 'ఛాయాచిత్రం' గురించి నారాయణన్ వేరే విధంగా ఆలోచించాడు:

'ఛాయ అనే పదంకి అంధకారం అనే అర్థమూ ఉంది; ఐతే ఆత్మీయత ఆ అంధకారం అధిగమించాలి.'

అతని మనసులో ప్రశాంతి చోటుచేసుకుంది.

********

(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, ఏప్రల్, 30, 1950)



# శారద మనస్సు

అవును, తలచుకుంటే ఈ లోకం చాలా విచిత్రంగానే కనిపిస్తోంది! మనుషుల్లో ఎన్ని రకాలు! ఈ మనసు చేసే మాయం - రసవాదం - ఎలా వర్ణించడం?

అవాళ ఒక రోజు - కొన్ని సంవత్సరాలముందు - శారద తన కూతురుతో వచ్చింది. ఈ పట్నంలో ఒక విద్యాలయంలో అమ్మాయిని చేర్చాలని ఉత్తరదేశం నుంచి వచ్చింది.

విశాలికి పన్నెండేళ్ళు; ఎర్రని పగడంలాంటి ఆమె నోరు, నవీన పెంపకం చూడగానే, ఆ క్షణమే, నాకు ఆమెపై అభిమానం కలిగింది.

ఈ అమ్మాయిని, ఒక స్వర్ణభవనంలో వజ్రంలాగ శోభించే పడుచుని, శారద విద్యాలయంలో ప్రవేశపెట్టి వెళ్తానంటోంది! ఈ ఎడబాటు భరించడం తనకి సాధ్యం అని గాఢంగా నమ్ముతుందే! విశాలిని చూస్తున్నంతసేపూ నాకు శారదమీద అతృప్తి పెరిగింది; అమ్మాయిమీద జాలి కలిగింది.

చాలా రోజుల తరువాత శారద, నేనూ - బాల్య స్నేహితులం - కొంచెంసేపే కలుసుకున్నాం; కాని మా హృదయపూర్వకమైన తర్కంకి చాలాసేపు పట్టింది.

“శారదా, నువ్వు దాన్ని తప్పకుండా ఇక్కడ చేర్చాలంటున్నావా?” అని అడిగాను.

“అవును. అక్కడ మా ఊరులో మన భాషలో చదువు లేదు. తమిళ వాడుకలంటే అసలు ఏమీ రావు. ఇక్కడ, ఒంటరిగా, తన బాధ్యత తెలిసి మెలుగుతే, మంచిదేకదా? అందుకే దాని నాన్నగారుకూడా సరేన్నారు,” అని అంది శారద.

“సరేలే, దాన్ని నాతో ఉండనిస్తావా?”అని అడిగాను. శారద సమ్మతించలేదు. నేను ఎంతో చెప్పాను. ‘కూతురని వస్తే ఒక రోజు తల్లికి ఆమెతో ఎడబాటు తప్పనిసరికదా? అందుకని ఇప్పుడే ఎందుకు ఒప్పుకోవాలి’ అని మన స్త్రీలు చేసే వాదం అనుసరించి నేనూ ఉపదేశం చేసాను. కాని శారద జవాబు విని నా నోరు బందుకట్టుకుంది: “కమలా, నా ఈ ఏర్పాటుకి ముఖ్య కారణం విను. నేను కొందరు గుజరాతీల ఇళ్ళలో చూసివున్నాను. అమ్మాయికి వయసు రాగానే ఆమెయే వంట చెయ్యాలి. అది భవిష్యత్తులో ఆమె అలవరచుకునే బాధ్యతకి అభ్యాసం అన్నమాట!

మనం అలా చెయ్యకుండా మూసిపెట్టి, మూసిపెట్టి దాన్ని పెంచడంలో ఒక చిక్కు ఉంది. రాబోయే రోజుల్లో అమ్మాయికి 'నేనెందుకిలా కష్టపడాలి?' అనే ఆలోచన కలుగుతుంది! అందుకే విశాలిని ఇప్పుడే దూరం చేసి తగిన ట్రెయినింగు ఇవ్వాలని నేను నిశ్చయించాను," అని అంది.

నేనేం చెప్పగలను?

"సరేలే, నువ్వు సబ్ కలెక్టర్ గారి భార్యవి. నువ్వే ఇలాగ అంటే నేను నోరు మూసుకోవలసిందే!" అన్నాను అవును. శారద ధనవంతురాలు, ఆమె దృక్పథం మెచ్చుకోవలసిందే! సొంత కూతురిని, గారాబంగా పెంచిన కూతురుని, విద్యాలయంలో చేర్చి, దూరదేశంనుంచి డబ్బు పంపించుతూ చదివించడానికి ఆమెకీ, ఆమె భర్తకీ, ఎంత వైరాగ్యం ఉండాలి!

ఆఖరికి శారద విశాలిని విద్యాలయంలో చేర్చే వెళ్ళింది. నా బాధ్యతలో లేకపోయినా దాన్ని నేను అప్పుడప్పుడు వెళ్ళి చూడమంది; ఎప్పుడైనా మా ఇంటికి విశాలిని రమ్మని పిలవడానికి నాకు అనుమతి ఇచ్చింది.

వెన్నెలలో వెలిగే ముఖంతో విద్యాలయంలో చేరిన విశాలి కొన్నిరోజులతరువాత ఆ ప్రసన్నవదనంతో కనిపించనేలేదు: ఇది నేను సులభంగా గమనించాను. 'పాపం, అమ్మాయి ఒంటరిగా బాధపడుతోంది!' అని నాకు జాలి కలిగింది. 'సరేలే, స్వభావంగా చంద్రుడు ఒక పక్షం క్షణించి, తిరిగి వెలుగుతున్నట్టు విశాలి ముఖం కూడా క్రమేణ ప్రకాశించడం తప్పక చూస్తాను,' అని నేను ఆశించాను. కాని అలాగేం జరగలేదు.

శారదకి రాసాను. "అమ్మాయిని ఒకసారి వచ్చి చూడు. లేకపోతే దాని మనసు మారదు; ఆరోగ్యం చెడుతుంది; చదువు దెబ్బ తింటుంది!" అని హెచ్చరిక చేసాను. నాకు తెలుసు. చిన్నప్పుడు విశాలి గెంతులేస్తూ, ఆడుతూ పాడుతూ, పుస్తకాలు చదివి మహాభారతంలోని పిట్టకథలు నాకు వల్లించేది. ఆ విశాలిలాగ ఈ విశాలికూడా సమర్థురాలే! మరి, పరిపక్వత అన్న మాటకి వస్తే, కొంచెం తక్కువేమో? కాని, దానికీ ఒక కాలం, పరిమితి అని ఉన్నాయిగా?

శారద వచ్చింది. దానికీ కూతురు అవస్థ అర్థమైంది. తన ఎనిమిదేళ్ళ అబ్బాయితో వచ్చింది. అమ్మాయిని చూసి కలపరపడింది; ఓదార్చింది; చాలా బోధనలు చెప్పింది.

"అంటే అమ్మాయిని నీతో తీసుకొని వెళ్ళే ఉద్దేశం లేదా?" అని అడిగాను.

"లేదు!" అని శారద జవాబు విని విశాలిని నా దగ్గరైనా ఒప్పగించమని బతిమాలాను. కాని శారద అలా చెయ్యలేదు. తను ఏం చెయ్యాలని ఆమె ముందే నిశ్చయించుకుంది. తనతో వచ్చిన కొడుకుని స్థానిక కళాకేంద్రంలో ప్రవేశపెట్టింది. "ఇద్దరు పిల్లలు ఒకే ఊరులో ఉంటే అంతగా బాధపడరు, ఒకరితో ఒకరు అభిమానంతో మెలుగుతారు," అని ఆమె ఉద్దేశం.

శారద ఊరుకి తిరిగివెళ్ళి ఒక సంవత్సరమైంది. అమ్మాయి రెండు సంవత్సరాలు విద్యాలయంలో ఉంది; అబ్బాయి ఒక సంవత్సరం దూరంలో పెరిగాడు. ఆమెకున్న వైరాగ్యం చూసి నేనూ నా మనసుని దృఢపరచుకున్నాను. కాని కొన్ని సమయాల్లో ఆ పిల్లల అవస్థ చూసి నాకు ఆరాటం కలిగింది. ఆ పసి హృదయాల శోకం నన్ను చిందరవందర చేసేసింది. ఆ పరిస్థితి చూసి దేవుడే భరించలేకపోయాడేమో? ఒక మార్పు! శారద భర్తకి ఇదే పట్ణంకి బదిలీ అయింది!

కాని ఈ కబురు విని పిల్లలు సంతోషించారనే సూచనలేవీ కనిపించలేదు. విశాలి ముఖంలో నిశ్చలనం చోటుచేసుకుంది. తమ్ముడులోనూ నేను అనుభవించినంత ఆహ్లాదం కనిపించలేదు.

శారద ఇక్కడకి వచ్చేస్తుందని నేను అమితమైన ఆనందంలో మునిగితేలాను. కాని ఆమె వచ్చినతరువాత నా గుండె బద్దలైనట్టనిపించింది.

"మేం ఈ ఉరులో  ఉంటేనేం? పిల్లలు అక్కడే ఉండనీ!" అంది శారద. ఏదో నవ్వులాటగా ఆమె మాటాడతుందని ముందనిపించింది; ఆ తరువాతే నా అజ్ఞానం గుర్తుచేసుకొని వాపోయాను.

"అవునులే. నీకు పిల్లలూ, ప్రేమానురాగాల గురించి ఎటువంటి అజ్ఞానమూ లేదు!" అని నేను సూటిగా, ఎత్తిపొడిచాను; నాకు పట్టరాని కోపం. ఐనప్పటికీ, శారద మనసులోని విచిత్ర భావనలగురించి ఆలోచించగానే నా మనసు కొంచెం కుదుటబడింది.

"శారదా! 'విశాలి కాలేజీలో చదవాలి, హాస్టలులో ఉండాలి, దూరదేశాలకి ప్రయాణం చెయ్యాలి!' అని నీ ఉద్దేశమా? అందుకేనా ఈ  ప్రయత్నం?" అని అడిగాను. అవును, మరి. ప్రసిద్ధమైన, భాగ్యవంతులైన ఈ దంపతులకి ఇటువంటి ఆలోచనలు సహజమేకదా?

“నీ అమ్మాయిని కాపురంకి తయ్యారు చెయ్యాలంటే ఇంటిలోనేకదా దాన్ని పెంచాలి?” అని అడిగి నేను నవ్వాను. నా నవ్వు శారద మనసుని నొప్పించేదేమో? ఆమె కళ్ళు తడిసిపోయాయి.

“అవును, నిజం, కమలా! అదేంటో, ముందునించే విశాలిని ఇలాగ పెంచాలని నా మనసులో ఒక భావన చోటుచేసుకుంది. ఆ రోజుల్లోనే నేను దాని పెంపకం గురించి నిశ్చయించాను. ఇప్పుడు దాన్ని చూస్తే నాకు జాలిగానే ఉంది. నాకు దగ్గరగా ఉండివుంటే ఈ వసంతఋతువులో విశాలి అప్సరసలాగ కనిపస్తుంది . . . కాని, మన చెయిలో ఏముంది, చెప్పు? ఆడపిల్లలకి పుట్టిల్లుమీద అభిమానం కూడదు. త్వరలో విశాలికి పెళ్ళి చేసి దీని లేత మనసుని భర్తమీద, అతని బంధువులమీద మళ్ళించాలని నా ఉద్దేశం. అనుబంధం కావాలని తొందరపడుతున్న మనసుని మళ్ళించుతే వాళ్ళతో చనువు ఇంకా బాగా దృఢమవుతుంది; పుట్టిల్లు అభిమానం అడ్డురాదుకదా?” అని అంది.

‘మగువుల మనసు ఒక మర్మం!’ అని ఎవరో అన్నారు. అది నిజమే కాబోలు! శారద మనసులోని భావనలు ఎంత విచిత్రంగా కనిపిస్తున్నాయి! అందుకు కారణం గతించిన కాలంలో జరిగిన ఏదో ఒక ఘటన అని నేను వెంటనే ఊహించాను. కాని ఆమె దానిగురించి ఏమీ చెప్పనప్పుడు నేనూ ఏమీ అడగలేదు; కాని నాకు ఆమెపై జాలి కలిగింది.

“బాగుందిలే, నువ్వూ, నీ ఆలోచన! అమ్మాయి పెళ్ళిముందు కొన్నిరోజులైనా దాన్ని నీతో ఉండనిస్తావా, లేదా?” అని అడిగాను.

నవ్వుతూ, “అవును, తప్పకుండా! ముందు మంచి వరుడు దొరకనీ! ఆరు నెలలు నా దగ్గర ఉంచుకొని అత్తవారింటికి పంపుతాను!” అంది శారద.

ఆమె మాటలు విని నాకు ఆశ్చర్యం, విభ్రాంతి కలిగాయి. ఆఖరికి ఎవేవో ఆలోచనల తరువాత, తను అనుకున్నట్టే శారద తనకీ, కూతురుకీ మధ్య ఎడబాటు కలగజేసింది! ఈ రోజుల్లో పుట్టిల్లు, అత్తవారిల్లు అనే గురుతులకి లెక్కలేదే! భర్తకి ఉద్యోగం అని తెలియగానే యౌవనా స్త్రీలు ఏ ఏ ఊర్లకో ప్రయాణం చేస్తున్నారే? ఇది పెద్ద పెద్ద నగరాల్లోకూడా సహజంగా జరుగుతోందే?

ఇక, నాకేమైనా బాధ్యత ఉందా? లేదు. ఇంతవరకూ శారద దూరదేశంలో ఉందని నేను చెయ్యవలసింది చేసాను; చెప్పవలసింది చెప్పాను; వినవలసింది

విన్నాను. ఇప్పుడు ఆమె ఈ ఊరుకే వచ్చేసింది. ఇక, తన విచిత్రమైన మనసు ఏమంటుందో అవన్నీ శారదే చూసుకోనీ!

అలాగనే నా పైఖరి అని నిశ్చయించుకున్నాను; కాని త్వరలోనే శారద వ్యవహారంలో నేను మళ్ళీ జోరపడడానికి అగత్యం వచ్చేసింది!

నాకు పరిచయమైన ఒక ధనవంతుల కుటుంబం ఉంది. వాళ్ళని ఇటీవల నేను మళ్ళీ కలుసుకున్నాను; విధినిర్ణయం అంటే ఇదే కాబోలు!

వాళ్ళకి ఇద్దరే అబ్బాయిలు. చిన్నవాడ్ని వాడి బాల్యంలోనే చుదువుకోసం అన్యోన్యమైన బంధువుల దగ్గర వదిలేసారు; వాడెప్పుడూ తల్లిదండ్రులతో ఉండలేదు; ఆ తరువాత కాలేజీ చదువు, ఉద్యోగం అనే కారణాలవల్ల అసలు తల్లిదండ్రులతో ఎటువంటి పరిచయమూ లేదు.

ఈ కబుర్లన్నీ నా మనసుని గల్లంతుచేసాయి; శారదని కలుసుకున్న తరువాత జరిగిన ఘటనలు, వాటి మూలంగా నాలో లేచిన భావనలు వీటితో అల్లుకున్నాయి. శారద నాకిచ్చిన హక్కు నేను గుర్తు చేసుకున్నాను.

కన్నతల్లికున్న బాధ్యతో "వరుడు కనబడితే చెప్పు!" అని శారద నాకు చెప్పిందిగా? ఇదొక మంచి వరుడు. విశాలి ఈ అబ్బాయిని పెళ్ళి చేసుకుంటే శారదకి ఏ బాధా ఉండదు. అసలు అత్తాకోడళ్ళ మధ్య సంఘర్షణలకి ఏ అవకాశం లేదే? పిల్లల్ని కన్న ప్రేమ, పెంచి పోషించిన శిక్షణ వలనేకదా తల్లిదండ్రులకి వాళ్ళమీద మితిమీరిన మమకారం కలుగుతుంది? ఇప్పుడు విశాలి ఆత్మీయత, దగ్గరి పరిచయం కోసం తపించిపోతోంది; ఈ పెళ్ళి అవగానే వధూవరులు మనసులు కలిసి ఆదర్శ దంపతులవుతారు; విశాలి భర్తతో సంతోషంగా ఉంటుంది; నేనిలాంటి ఆలోచనలతో నా  చర్చలు ఆరంభించాను; అన్నీ కచ్చితంగా కొనసాగాయి. ఇదే పెళ్ళి నిశ్చయమైంది. శారద విశాలిని పిలిచి తనతో ఉంచుకుంది. పెళ్ళికి ఆరుమాసాలముందు పదిహేనేళ్ళ విశాలి తల్లి ఇంటికి వచ్చింది. ఆ సమయం ఆమె తమ్ముడికీ స్వతంత్రత దొరికింది!

ఆ ఆరుమాసాలలో నేను తరచుగా శారదని, విశాలితో చూసాను. నాకు తృప్తి కలిగింది. ఐనా ఒక ఇక్కట్టు లేకపోలేదు: ఈ పదిహేనేళ్ళ అమ్మాయి తన తల్లితో ఎలా మెలుగుతోంది? శారద తన కూతురుతో ఎలా మెలుగుతోంది? స్వభావంగా

తల్లి కూతురు మధ్య ఉండవలసిన చనువు, సౌజన్యం కనిపించడం లేదే? కాని నా ఏర్పాటు వలన జరిగిన విశాలి పెళ్ళి ఆ లోపంని ఊరడించేసింది.

విశాలి ఒక సంవత్సరం తరువాత తమ ఇంటికి రావాలని ఆమె అత్తమామలు సూచించారు; మేం వాళ్ళతో ఏకీభవించాం.

"ఇదీ మంచిదే! నువ్వు నీ కూతురుతో ఇంకా ఒక సంవత్సరం గడపవచ్చు!" అని నేను శారదకి చెప్పాను.

"అవును, నిజం! ఆరు మాసాల్లో దాని శరీరం ఇంకా బాగా మెరుగుపడుతుంది!" అని శారద ఒప్పుకుంది. ఆమె భర్తకి చాలా తృప్తి అని చెప్పింది. నాకు తెలుసు; ఇన్ని రోజులూ కూతురు అందుబాటులో లేకపోయినా పెళ్ళిలో కూతురుని ధారపోసినప్పుడు అతను ఎలా ఆవేశపడ్డారు, కన్నీరు కార్చారు!

ఒక సంవత్సరం గడిచిపోయింది. దానికి మించి ఒక నెలకూడా ఐంది. ఈ మధ్య దీపావళి లాంటి పండుగలకి అల్లుడు అత్తగారింటికి రావడం జరిగినా విశాలి, ఆమె భర్త మధ్య ప్రేమానురాగాలు, మోహం చెలరేగిన గురుతులు కానరాలేదు. అతను భార్యని తనతో పిలుచుకొని వెళ్ళడానికి తొందరపడలేదు; విశాలికూడా అతనివెంట వెళ్ళడానికి ఆతరతగా ఉందని మాకు అనిపించలేదు.

'ప్రేమానురాగాలు అదుపులో ఉంచుకోవడానికి వీళ్ళు అలవాటు చేసుకున్నారు!' అనే మాలో మేమే చెప్పుకున్నాం.

కాని నాకు మాత్రం ఒక బెంగ; నా మనసు కలవరపడింది.

కూతురుమీదున్న వాత్సల్యం వలనే విశాలి ఇన్నిరోజులూ అత్తగారింటికి వెళ్ళాలని ఆమె తల్లిదండ్రులు తొందరపడలేదు. 'పిలుపు రానీ!' అనే రీతిలో ఉన్న వాళ్ళని నేనే ప్రేరేపించాను. అదేం స్వభావంగా కలిగిన ఆతురతా, లేక నా ఒత్తిడియా  అని తెలియదు: త్వరలోనే విశాలి తల్లిదండ్రులు వియ్యంకులని సంప్రదించారు.

"ఇంకో ఆరు మాసాలో, ఒక సంవత్సరం కానీయండి! ఆ తరువాత అమ్మాయి రావొచ్చుగా! మేమూ అబ్బాయితో ఇంతవరకూ ఉండలేదే? వాడికీ ఉద్యోగం కుదరనీ!" అని వాళ్ళ జవాబు వచ్చింది.

'అబ్బాయి మాతోనే ఉండనీ!' అని వాళ్ళ ఉద్దేశమా? 'మగపెళ్ళివారికని కొన్ని హక్కులున్నాయిగా, అందుకేనా ఇలా వాళ్లు మాటాడుతున్నారు?' అనికూడా నేను ఆలోచించాను; స్పష్టముగా చెప్పకపోయినా అదే వాళ్ళ ఉద్దేశం అని నాకనిపించింది.

నేనూ అనేక విధాలు ఆలోచించి నిజానిజాలు తెలుసుకుందామని ప్రయత్నించాను: 'వియ్యంకుల ఉద్దేశం తప్పని అనవచ్చా?శారదలాగే వాళ్ళకీ తమ అబ్బాయితో ఉండాలని అనిపించితే అది న్యాయమేకదా? 'అబ్బాయికి ఉద్యోగం కుదరనీ, అతను తన భార్యతో కాపురం చెయ్యనీ!' అని వాళ్ళంటున్నారు. శారద ఆశించినట్టే త్వరలో విశాలి భర్తతో హాయిగా కాపురం చెయ్యడం జరుగుతుంది!' అని నేను నాలో చెప్పుకున్నాను.

అంతవరకూ విశాలి తల్లిదండ్రులతోనే ఉండనీ; ఆ తరువాత ఈ ఎడబాటు తప్పనిసరికదా?

నేనిది చెప్పినప్పుడు శారద పకపకమని నవ్వింది; ఆరోజు మా సంభాషణ గుర్తుచేసుకుంది.

ఆ ఎడబాటుకి సమయం వచ్చింది. విశాలి భర్తకి ఉత్తరదేశంలో మంచి ఉద్యోగం దొరికింది. విశాలి వెంటనే రావాలని అతను రాసారు. శారదకి సంతోషంమధ్య ఎడబాటువలన దుఃఖం. నాకూ అలాగే అనిపించింది. ఇక విశాలి హాయిగా భర్తతో కాపురం చేస్తుందికదా?

కోడలిని అబ్బాయితో చేర్చడానికి విశాలి అత్తమామలు వెళ్ళారు. విశాలి మామగారికి పెద్ద ఉద్యోగం. అతనున్న ఊరులో అతనికి చాలా బాధ్యతలున్నాయి. కాని అత్యవసమైన అవన్నీ వదలేసి, శెలవు తీసుకొని, భార్యతో అతను వెళ్ళారు; వాళ్ళ చిన్న కాపురం నియమించాలనే ఉద్దేశంతో అతను వెళ్ళారు.

కాని . . . . ఏం జరిగింది?

కాని అతను అక్కడనుంచి తిరిగిరాలేదు;రావడానికి ఇష్టపడలేదు. భార్యతో అక్కడే స్థిరపడిపోయారు. తన ఉద్యోగం మార్చుకొని, తన ఊరునీ మార్చుకొని, మాకు దగా చేసి, అక్కడే తన బసకి ఏర్పాటు చేసుకున్నారు!

‘ఇన్నిరోజులవరకూ నేను మీ అబ్బాయిగా పెరిగాను; ఇక ఒక యువతికి నేను ఆదర్శ భర్తగా మెలగవద్దా?’ అని ఎటువంటి ఆలోచన లేని యువకుడుని విశాలి భర్తగా నిర్ణయించినది ఎవరు? నేను! నా కల్పన ఎలా తారుమారైంది!

దీర్ఘకాలం తల్లిదండ్రులకి ఎడబాటుగా ఉండి వాళ్ళని కలుసుకున్న తరువాత “ఆహా, తల్లిదండ్రుల ప్రేమకి సాటి లేదు!” అని ఘోషించే కొడుకు; తల్లిదండ్రులు ఎడబాటు భరించలేరు: ఈ అవగాహనతో భార్యని ఏలుకొనే మనసు అతనిది. యువతి యాచించే ఆత్మీయత అతనికి లేదు. భర్త అనే ఆశయమూ లేదు.

ఇవన్నీ ఊహించిన నా మానసిక వ్యధని ఎలా వర్ణించడం? కాని శారద నన్ను ఊరడించుతోంది. ఇంతకుముందు నన్ను వేదించిన ఆమె విచిత్ర మనసు నాకు సానుభూతి చూపుతోంది:

“కమలా, మనకేం తెలుసు, చెప్పు! విశాలి, ఆమె భర్త, బాల్యంలో ఒకే రీతిలో పెరిగారు. కాని, అతని చింతన ఎలాగుంది? విశాలి మనసు ఏమంటుందో చూసావా!” అని నన్ను అడుగుతోంది.

విశాలి మనసులో ఏముంది? పసితనంలోనే ‘బాలయోగి’ అని ఆమెని అందరూ పొగడారు. తల్లిదండ్రుల ప్రేమానురాగాలు తన్ను ముంచివేసినా ఇప్పుడు అత్తగారింట్లో తనకేర్పడిన నిరాశగురించి ఆమె లెక్కచెయ్యలేదు. ‘ఇంతకు ముందు నా అమ్మ ధోరణి ఎలా ఉండేది?’ అనే ప్రశ్న అడిగి, తన భర్తని, అతను తన తల్లిదండ్రులని పాలించే పైఖరిని ఆమె ఇప్పుడు సరిపోల్చుకుంది. కూతురు తన్ను చులకన చేస్తుందని శారద గ్రహించింది. పిల్లలపట్ల చూపించే ప్రేమ వడ్డీతో సహా తిరిగి మన దగ్గరకి వస్తుందని ఎవరో అన్నారు; అదేమోకాని, శారద ఉద్దేశం మెచ్చుకోవలిసిందే!

“విశాలి ఆడపిల్ల, అది చెప్పేది న్యాయం. ఆమె భర్త మగవాడు. అతను చెప్పేదీ న్యాయం. మనిద్దరం ఏది చెప్పినా తప్పే!” అని అంటోంది శారద.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, ఆగస్టు 28, 1948)**



# అతను ఎవరు?

"అల్లీ, నాకు తల నొప్పిగా ఉందమ్మా! కళ్ళు మూసుకొని కొంతసేపు నిద్రపోవాలని ఉంది. ఎవరైనా కుట్టిన దుస్తులకోసం వస్తే నన్ను లేపవద్దు! నువ్వే బట్టల జాబితా, , చీటీ చూసి వాళ్ళకి ఇచ్చేయ్! నన్ను లేపకు!" అని ఆజ్ఞ ఇచ్చి గడపకి ఇవతలవున్న నూలు మంచంని ఇంకా బాగా లోపలికి లాక్కొని అలసటతో దర్జీ రహ్మాన్ దానిమీద వాలాడు.

అతని అలసటకి, తలనొప్పికి మనసులోని భారం, ఆరాటమే కారణం. దృఢమైన దేహమూ, మొండిపట్టు సహజంగా కనిపించే అతను ఇంతవరకూ ఏ రోజు ఇంతగా కలవరపడలేదు. కాని అతనుకూడా ఆయాసంతో మంచమెక్కాడంటే అందుకు మంచి కారణముంది. ఇవాళ మధ్యాహ్నం అల్లి మనసులోని ఒక ముఖ్యమైన అభిలాష అతనికి తెలిసింది. అల్లి సౌజన్యంతో, నిదానంగా పలికిన కొన్ని వాక్యాలలోనే ఆమెకున్న పట్టుదల రహమాన్ బాగా ఊహించాడు. ఆ మాటల్లో అతను ఎదురుచూడని ఒక గాఢమైన సందేశం అతని మనసుని చెల్లాచెదరుచేసేసింది.

అప్పటినుంచి అతని మనసు నిశ్చలగా లేదు. అల్లిగురించే అన్ని రకాల ఆలోచనలు - ఒకటి తరువాత ఒకటి - గిరగిరమని, రాట్నం లాగ - గంటలకొలదీ అతని రెండు చెవుల్లోనూ మ్రోగుతుంటే, ఆ భ్రమ తగ్గనే లేదు; ఒళ్ళుకూడా వంగలేదు.

విస్తారమైన సముద్రంకి వంతెన కట్టడం ఎలా సాధ్యం? పాపం, అలాగే తన మనసులోని ఆందోళన అదుపులోకి రాకపోవడంతో రహమాన్ కంగారు పడ్డాడు. సముద్రంలో పడవని సొగసుగా ముందుకు నడిపిస్తూ సాగుతున్న మనిషి గభీమని నీళ్ళలో పడిపోయి, అనేక ప్రయత్నాల తరువాత, ఎలాగో ఒడ్డు చేరుకున్నప్పుడు అనుభవించే ఆయాసం ఇప్పుడు అతన్ని ఆకట్టుకుంది.

గతించిన పన్నెండు సంవత్సరాలలో జరిగిన ఘటనలు, ఒకటి తరువాత ఒకటి, సముద్ర కెరటాల్లాగ అతన్ని తరుముకొని వచ్చాయి.

అవును! పన్నెడు సంవత్సారలకి ముందు, ఒక రోజు . . .

** ** **

రహమాన్ ఒక కుట్రలో పాల్గొనడానికి తన సహచరులతో ఆ ఉదయమే ఆ గ్రామంకి వచ్చిచేరాడు. ఆ ఊరి ప్రాధమిక పాఠశాలకి కొంచెం దూరంలోవున్న ఒక మఱ్ఱిచెట్టుకింద కాచుకొనివున్నాడు. అతని తోడుదొంగలలో ఇద్దరు ఆ ఊరుకి పొరుగునవున్న సంతకీ, మరిద్దరు అగ్రహారంకీ, మరొకతను మురికిపేటకీ వెళ్ళారు; ఇంకొకడు కుమ్మరివీధికి వెళ్ళాడు. ఆ ఏడుగురూ తలా ఒక పిల్లతో ఆ సాయంకాలం ఆరుగంటలకి ఒక చోట కలుసుకోవాలని నిశ్చయించారు. ఆ తావు ఆ ఊరు రైలుస్టేషన్, ఆ ఉరుకి పొరుగునవున్న గ్రామంకి మధ్యనున్న రహదారికి ఆనుకొనివున్న ఒక తోట.

ఆ ఊరు పిల్లల పాఠశాల అగ్రహారంకి కొంచెం దూరంలో ఉంది. అగ్రహారంకి దక్షిణపక్షంలో చివరనున్న శివాలయం నుంచి ఒక త్రోవలో నడుస్తే, రెండు మూడు చోట్ల వంపులు దాటిన తరువాత, ఆ బడిని చేరుకుంటాం; ఆ ఊరు పిల్లలకి అదేం పెద్ద ప్రశ్నగా కనిపించలేదు. పిల్లల తల్లిదండ్రులకి తమ పిల్లలు ఆ మార్గంలో నడిచి వెళ్ళడంగురించి ఎటువంటి భయమూ లేదు.

తక్కిన రోజులకంటే అవాళ సాయంకాలం మబ్బులు తన్ను త్వరగా ఆవరించుకుంటాయని, చీకటి బిరబిరగా కప్పుకొనే అవకాశం వచ్చేసిందని ఎరుగని సూర్యుడు నిష్కపటమైన పసిపిల్లవాడులాగ తన కిరణాల శక్తిని అమోఘంగా భూమిమీద ప్రసరించుతూ ఆకాశవీధిలో తిరుగుతున్నాడు. ఆటువంటి తీవ్రమైన వాతావరణంలో రహమాన్ ఆ మఱ్ఱిచెట్టుకింద నిలబడివున్నాడు.

ఆ మధ్యాహ్న వేళలో నీడ కావాలని కొందరు ఆ చెట్టుకింద కొంచెం సేపు విశ్రాంతికని ఆగారు. కాని రహమాన్ తను ఎదురుచూసిన సమయం వరకూ అక్కడనుంచి కదలనేలేదు.

బడి మూసే వేళ వచ్చేసిందనే సందేశం కంచు మ్రోగుతున్న ధ్వనిలో, ఉరుముతున్నట్టు వినిపించింది. చిన్న మబ్బులు గుంపులు గుంపులుగా



తరలివస్తున్నట్టు పిల్లలు - గెంతుతూ, నవ్వుకుంటూ, కేకలు పెడుతూ - బడి వదిలి ఇళ్ళకి తిరిగి వస్తున్నారు.

అవును మరి! ఇళ్లకు తిరిగివచ్చే ఆ పిల్లల సంతోషంకి అంతు ఉందా ఏమిటి? బడిలోని నియమనిబంధనలకి కట్టుబడి మెలిగిన ఆ పిల్లలు ఇల్లు చేరుకున్నవెంటనే తల్లిదండ్రుల ఆదరణ, సానుభూతి, తక్కిన తోబుట్టువులతో ఆటలు, ముచ్చటలు అనుభవించవచ్చుకదా? ఆ పిల్లలకి మరేం విచారమూ లేదే?

కాని అలాగని నొక్కి చెప్పలేం; దానికీ వ్యతిరేకంగా ఈ పిల్లలలో ఎవరైనా ఉన్నారేమో? బడిలో సరిగ్గా చదవలేదనో, లేక ఇతర కారణాలవలన ఇంటిలో వాళ్ళని దెబ్బలు తాకే అవకాశం ఉందేమో?

గుంపుగా వస్తున్న ఆ పిల్లల్ని చూస్తే ఎవరికీ అటువంటి ఆలోచన రాకపోవచ్చు; కాని వాళ్ళకీ, వయస్సుకి తగినట్టు బోలెడన్ని కోరికలూ, కొఱతలూ ఉన్నాయని మనం గుర్తుచేసుకోవాలి!

రహమాన్ బుద్ధిసూక్ష్మతతో ఆ పిల్లల గుంపుని చూసాడు. అందులో చిట్టచివరికి కనిపించిన ఒక బాలని తేఱిచూసాడు.

అదుగో! అదే అతనికి కావాలి!

పాలులాంటి దేహం, బుగ్గలు; చురుకైన కన్నులు; తన చిన్న చేతులు ఊపుతూ తన స్నేహితులతో నడిచి వస్తున్న ఆ బాల రహమాన్ కళ్ళని ఆకర్షించింది. ఆమె తొడుక్కున్న దుస్తులు, నగలు, - పరికిణీ, జాకెట్టు, వెండి గాజులు - సామాన్యంగానే కనిపించాయి. కాని ఆ అమ్మాయే ఆ గుంపులో అధికారం చెలాయించుతున్నట్టు కనిపించింది. తన స్నేహితులతో మాటాడుతున్న రాజకుమార్తెలాగ ఉంది ఆమె వాలకం.

ఆమెను చేరుకున్న రహమాన్, “పాప, మీ నాన్నగారు నిన్ను తీసుకొని రమ్మన్నారు. మనం వెంటనే వెళ్ళాలి. రా, ఎక్కి కూర్చో!” అని వొంగాడు. ఆమె జవాబుకి కాచుకోకుండా, తనకి హక్కు ఉందన్న సూచనతో, ముఖానుభవంతో ఆమెను భుజంమీద ఎత్తుకొని నడిచాడు.

తలతోక తెలియక ఆమె అతన్ని చూసింది; భయంతో కాదు, భ్రమ, ఆశ్చర్యంతో! “సరే!” అంటూ అతని భుజంలో ఎక్కి కూర్చుంది!

సముద్రంలో చేపలు వేటాడాలని వెళ్ళిన మనిషికి ముత్యాలు దొరికితే ఎలాగుంటుంది? సద్దు చెయ్యకుండా, గొణక్కుండా, చూసేవాళ్ళకెవరికీ అనుమానమూ రాకుండా తన భుజంలో సవారికి వెంటనే సిద్ధమైన ఆ అమ్మాయిని రహమాన్ మనసులో దీవించాడు.

కొన్ని నిమిషాలు గడిచాయి. బాల రహమాన్ తల జుత్తుని బాగా అలుముకుంది. కళ్లని నిండుగా తెరిచి చూసింది. "ఓ, నాన్నగారు నన్ను పిలిచారా? నాకు బొమ్మలిస్తారా?" అని అడిగింది.

ఇంతలో రహమాన్ ఒక ఫర్లాంగు దూరం నడిచి ఉంటాడేమో?

"అవునమ్మా!" అన్నాడు రహమాన్. ఆ జవాబుతో ఆమె మనసులో లేచిన ఆనందంలో వెళ్తున్న తోవ దిక్కు మారిందని ఆమెకెలాగ తెలుసు? తను ఇంటికి వెళ్తున్న యోచనేకదా ఆ పసి హృదయంలో తేలుతోంది?

బాల ఏమేమో మాటాడుతూనే వస్తోంది; రహమాన్ మౌనంగా వింటూనే, తను ఇక చేరుకొనే తావు గురించి ఆలోచిస్తున్నాడు. స్పర్శశక్తిలేని ఒక రైలుబండి ప్రయాణికులని మోస్తున్నట్టు ఆ రైలుస్టేషన్ దాటి అతని కాళ్ళు ముందుకు సాగాయి. త్వరలో తన సహచరులని కలుసుకోవాలికదా?

ఊపిరి వదలకుండా ఆ పిల్ల అంటున్న మాటలు రహమాన్ కొంచెం అపేక్షతో వినసాగాడు.

"నాకు ఇంటికి వెళ్ళాలంటే ఎప్పుడూ భయం! నేనెప్పుడూ తక్కిన పిల్లలతో మెల్లగా నడిచి వెళ్తాను. ఇవాళకూడా చచ్చుతో వెళ్ళాలని అనుకున్నాను. ఇంటికి వెళ్తే పిన్ని కొట్టుంది. నాన్నగారు కూడా మాటాడరు, అంబితో[1] ఆడుతూవుంటారు. వాడికి అసలు మాటలేవీ రావు, కాని వాడితో మాటాడతారు! నాకూ నాన్నగారుతో మాటాడలని ఉంటుంది, కాని అతను ఎప్పుడూ మాటాడరు! 'నాన్నగారూ!' అని నేను పిలుస్తే, "ఏమే, బయటికి వెళ్ళి ఆడుకో!" అని తరుముతారు. నాకు ఇంటికి వెళ్ళాలంటే ఇష్టం లేదు!"

రహమాన్ తలెత్తి ఆమెను చూసాడు. "అంటే, పాప, నీకు ఇంటికి వెళ్ళాలని లేదా?" అని అడిగాడు.

---

[1] 'అంబి' అని తన తమ్ముడిని పిలుస్తోంది



“ఇవాళ తప్పకుండా వెళ్ళాలి, మరి నాన్నగారు నన్ను పిలిచారని అనలేదూ? నేను వెళ్ళి అతనితో ఆటలాడాలి . . . ముందు నాకు అమ్మ ఉండేది . . . అప్పుడెల్లా నాన్నగారు నాతో ఆడేవారు . . . టవును నుంచి చాలా బొమ్మలు కొని తెచ్చేవారు . . . అమ్మ నాకు తినడానికి అప్పచ్చులు ఇచ్చేది . . . ఇప్పుడేమో పిన్నికి నేను ఎదడిగినా ఒకటే కోపం! ముందెల్లా ఏదో కొంచెం ఇచ్చి తర్వాత మరేం ఇవ్వదు . . . నేను పిన్నిని ఏమీ అడగను . . . చచ్చువాళ్ళ నాన్నమ్మే నాకు అరిశెలు, జంతికలు ఇస్తారు . . . అమ్మ ఉన్నప్పుడు నాకెన్ని పకోడీలు. చేకోడీలు ఇచ్చేది!”

రహమాన్ భావావేశంతో “పాప, నీకు ఇప్పుడు అమ్మ ఇప్పుడు లేదా?” అని అడిగాడు.

“ఇంటిలో లేదు . . . కాని ఆకాశంలో ఉంది . . . అక్కడనుంచి నన్ను చూస్తూందట! . . . కాని నేను మాత్రం మా అమ్మని చూడనేలేదు! . . . ”

రహమాన్ మళ్ళీ తలెత్తాడు. ఆమె కళ్లలోని ఆణిముత్యాలు చూసాడు. చెప్పలేని వేదన అతన్ని ఆవరించుకుంది. ఆ కళ్ళలోని యాతన చూడడానికే అతను జంకాడు; తలని కిందకి దించుకున్నాడు.

ఏమేమో అలోచనలు. వేడికి కరిగి వజ్రం సానపడినట్టు అతని మనసులో ఒక అమానుష్యమైన ఆలోచన లేచి, ఒక కాంతిలాగ మెరిసింది.

తన భుజంమీద కూర్చోని నిశ్చింతగా ఉన్న ఆ బాలని - ఒక ఆనకట్టు గభీమని బద్దలై, ముంచెత్తిన జలప్రవాహంలాగ ఆమె మాటలు ఎడతెగక వస్తున్నాయి - తను ఎక్కడికి, తీసుకొని వెళ్తున్నాడు? . . . ఎందుకు తీసుకొని వెళ్తున్నాడు?

‘అయ్యయ్యో, నేను అంత దుర్మార్గుడనా?’

‘నిజంగానే నేను అంత దురాత్ముడనా? బడి దగ్గర ఈ పిల్లని నా భుజంలో ఎక్కించుకున్నప్పుడు నా మనసులో ఏముందని?

అతని మనసు కరిగిపోయింది: ‘నేను అటువంటి రాక్షసుడుని కాదు!’

మొట్టమొదట ఆమె తన కళ్ళకి కనిపించినప్పుడు రహమాన్ ఆమె అంగవిన్యాసం, తీరు చూసి, ఆహ్లాదపడి, ఆమెని కౌగిలించుకోవాలని పరుగెత్తుకొని

వచ్చాడు. ఆ సమయంలో తన మనసులో మరేం దురాలోచన లేదే? ఆ క్షణంలో తన్ను నిర్బంధపెట్టే ఆ ఘోర వృత్తి గుర్తుకి వచ్చివుంటే వేరొక పిల్లని తీసుకొని వచ్చేవాడు. తనీ పిల్లని ఎంచుకొని రావడం ప్రేమానురాగాల వలనే . . .  మరేం ప్రేరేపణ లేదు . . .'

ఇలాగ తన గురించి అతను మానసిక బాధ పడుతుంటే అతని మనసులో వేరే కొన్ని ఆలోచనలు లేచాయి.

"నాకు ఆకాశంకి వెళ్ళి అమ్మని చూడాలని ఉంది. కాని నాకది అందకుండా ఉంది . . . నేను చిన్న పిల్లని కదా . . . కొన్ని రోజులముందు మేజామీద నిలుచొని, బీరువాని అందుకొని దానిమీద నిలబడి చూసాను . . . అప్పుడూ అందలేదు . . . బీరువామీద గెంతి చూసానుకూడా . . . హూహూం . . . 'సరే, ఇక ఏం చేద్దాం?' అని అనుకుంటూంటే పిన్ని వచ్చి, నన్ను కిందకి దింపేసి 'ఇక బీరువామీద ఎక్కవద్దు!' అని కొట్టింది. "బీరువా నేలమీద పడి అద్దం పగులుతుంది! ఉండు, మీ నాన్నగారికి చెప్పి కొట్టమంటాను!" అని అంది. నేను అవాళ చచ్చు నానమ్మని అడిగాను - నా అమ్మని చూడడం ఎలాగ అని. నేనూ నాన్నగారిలా ఎత్తుగా పెరిగితే అమ్మని చూస్తానని ఆవిడ అన్నారు . . . కాని నేనేమో చాలా రోజులుగా ఆ చిన్న మేజా ఎత్తే ఉన్నాను . . . నాన్నగారి ఎత్తు రావాలంటే ఇక ఎన్ని రోజులు కాచుకొని ఉండాలో? . . . అంకుల్ . . . అంకుల్ . . . కొంచెం ఆగండి! . . . నాకిప్పుడు మీమీద  నిలబడి చూడాలని ఉంది . . . "

రహమాన్ ఆగాడు; ఆమె మాటలు విన్నతరువాత ఒక నిర్ణయంకి వచ్చాడు.

"పాప, ఇప్పుడు నీకు మీ అమ్మ కనిపించరమ్మా! నువ్వింకా పెరగాలి, పెద్దదవ్వాలి! మీ నాన్నగారు నిన్ను ఆటకి పిలవలేదు. నువ్వు అల్లరి చేసావని నీ పిన్ని అతనికి చెప్పిందట! మీ నాన్నగారు చాలా కోపంతో ఉన్నారు."

"అయ్యయ్యో,  . . . అంకుల్ . . . అలాగైతే నన్ను దింపేయ్! . . . నేనింటికి రాను!" అని బాల బొబ్బలు పెట్టింది. చెట్టులోనున్న ఏదో పాము కఱచినట్టు, ఆ క్షణమే దిగివచ్చి నేలమీద పడాలనే భయంతో  బతిమాలింది.

రబమాన్ ఆమెను బిగివుగా అదుముకున్నాడు. "పాప, నీకేం భయం వద్దమ్మా! నువ్వు ఇంటికి వెళ్ళవద్దు! కాని ఇవాళ రాత్రి ఎక్కడ నిద్రపోతావ్? నీకు

ఆకలేస్తుందే? మరి, నాతో ఉంటావా? నాన్నగారు నిన్ను కొట్టకుండా నేను చూసుకుంటాను, సరేనా?" అని అడిగాడు.

"సరే అంకుల్, నేనిక నీతోనే ఉంటాను . . . ఇంటికి వెళ్ళను!" అని ఆమె అన్న వెంటనే ఆమె రెండు కాళ్ళు రహమాన్ కంఠాన్ని చుట్టుముట్టుకున్నాయి.

ఆమె సమ్మతి అతనికి నచ్చింది. తనిక ఎంచుకున్న బాధ్యతని తలపోసుకుంటూ రహమాన్ రైలుస్టేషన్ ప్రవేశించాడు. అప్పుడు గడియారంలో సమయం సాయంకాలం 5.15 అని, తంజావూరుకి వెళ్ళే పాసెజరు రాబోతుందని తెలిసింది. దానికే తనకీ, పిల్లకీ రహమాన్ టికెట్లు కొన్నాడు; మిఠాయిలూ కొన్నాడు. తన తల మీదున్న తువ్వాలు పిల్లని బాగా కప్పుకొని ఉందనే ధైర్యంతో, రైలు వచ్చే వరకూ కాచుకొని, ఆమెతో బండి ఎక్కాడు.

ఒక మూడవ తరగతి కంపార్టుమెంటులో ఎక్కి కూర్చొని ఆమెకి మిఠాయిలు అందిస్తూ ఆమె చెప్పే మాటలు విన్నాడు; కబుర్లు వింటూ ఇంకా చెప్పమని ప్రోత్సాహించాడు.

అసలు పిల్లలతో ఎటువంటి పరిచయం లేని తనకి - రాతిగుండెతో ఉన్న మనిషికి - ఎలాగ పిల్లలమీద ప్రేమానురాగాలు, సమయోచిత బుద్ధితో మాటాడే శక్తి వచ్చింది? 'నాకు పిల్లల మనస్తత్త్వం అంటే ఏమీ తెలియదే?" అని అతనికి ఆశ్చర్యమూ కలిగింది.

అమాయకుడు, పశువుల కాపరి అని అందరికీ తెలిసిన కాళిదాసు నాలికలో ఆ సరస్వతీదేవి కాపురం ఆరంభించినవెంటనే ఎన్ని మార్పులు, అద్భుతాలు చోటుచేసుకున్నాయి! అలాగే కాబోలు, దైవానుగ్రహం అతని మనసుకి అందిన ఆ నిమిషం రహమాన్ ఒక అపూర్వమైన వ్యక్తిగా మారిపోయాడు!

అతను బాలని అన్ని విధాలా తృప్తి చెయ్యగానే, ఆమె చింత, విచారం తొలగాయి. నెమ్మదిగా అతని మడిలో పడుకుంది. పులకించిపోయి రహమాన్ ఆమె నుదుటన ముద్దాడాడు. ఆ కొత్త కౌగిలిలో ఆహ్లాదించిన ఆ పసి హృదయం వెంటనే నిద్రపోయింది. రహమాన్ ఆమె కళ్ళని తీవ్రంగా చూసాడు. మెల్లగా కొన్ని క్షణాలలో ఆమె తిలకంని తుడిచేసాడు.

మంచి వేళ, అతను అప్పుడు ఆ పని చేసాడు! కొంచెం సమయంలో ఒక ముసలాయన బండి ఎక్కి రహమాన్ కూర్చున్న బల్ల మీదే వచ్చి కూర్చున్నారు. రహమాన్ కూర్చున్న బల్ల ఆ కంపార్టుమెంటుకి ఒక మూలలో ఉంది, కాని ఆ పెద్దాయన మంచి పరిచయమున్నట్టు రహమాన్ ఉన్న తావుకే వచ్చారు.

ఒక గంట తరువాత ఏదో మాటాడాలనే నెపంతో అతను రహమాన్ని చూసి "మీ అమ్మాయా?" అని అడిగారు.

ఒక క్షణం రహమాన్ నివ్వెరబోయాడు. 'ఇతనికి ఆ అమ్మాయి ఎవరని తెలుసునేమో?' అని గాబరా పడ్డాడు. కాని అతని ముఖభావం చూసి, వెంటనే, ధైర్యంతో "అవునండీ!" అన్నాడు. కాని ఆ తర్వాత అతను ఏం అడుగుతారో అని గుండె గబగబమని కొట్టుకుంది.

"మీ అమ్మాయి పరికిణీ చూసి అడిగాను - అది హిందువుల పద్ధతికదా  మీ మతంలో మామూలుగా టోపీలు, లుంగీలు వాడుతారు, అవునా?" అని అన్నారు అతను.

అతని మాటలు విని రహమాన్ అదిరిపడలేదు. అతను సహజంగానే అడుగుతున్నారని ఊహించి "అవునండీ, నేను దీన్ని హిందువుగానే పెంచుతున్నాను. ఈ ప్రాంతంలోనే ఐదు సంవత్సరాలుగా ఇది పుట్టిపెరుగుతోంది. నా భార్యకూడా హిందువే! కాని బ్రాహ్మణస్త్రీ కాదు. దురదృష్టంగా గత సంవత్సరం అది పోయింది. 'నేను పోయిన తరువాత అమ్మాయిని నా జ్ఞాపకార్థంగా హిందువుగా పెంచండి!' అని అడుక్కుంది. అదే కారణం సార్!" అని కల్పనతో ఒక కథ చెప్పాడు. అప్పుడు అమ్మాయి నిద్రపోతూ ఉండడంవలన మరేం గొడవ లేదు.

ఆవును, ఆ సమయం అల్లా అనుగ్రహం అతన్ని కాపాడిందనాలి!

ఆ మరుదినం పొద్దున్న ఒక సత్రంలో మెలకువ వచ్చి నిద్రలోనుంచి లేచిన బాల "నాన్నగారూ  . . . నాన్నగారూ . . . మీరెక్కడున్నారు?" అని అడిగింది.

"పాప, విను! మీ నాన్నగారు ఇంకా కోపంతోనే ఉన్నారు. ఇప్పుడు మనం ఇంటికి వెళ్ళవద్దు! నువ్వు నాతోనే ఉండు . . . నేను నీకన్నీ ఇస్తాను  . . . నాకు నీ మీద ఎప్పుడూ కోపం రాదు, సరేనా?"

"సరే, అంకుల్ . . . కాని నేను చచ్చు ఇంటికి వెళ్ళి జడ అల్లుకొని స్కూలుకి వెళ్ళాలే!"

"స్కూలు శెలవులకి మూసేసారమ్మా! చచ్చు కూడా వాళ్ళ నాన్నమ్మతో రైలు బండిలో ఊరుకి వెళ్ళిపోయింది! మనం కూడా నిన్నలాగ రైలుబండిలో వెల్దాం, సరేనా? ఏదీ, నీకీ పాట తెలుసా - 'చుకు చుకు బండి! రైలు బండి!' అని వల్లించుతూ ఆమె ఆసక్తిని మళ్ళించాడు.

ఇలాగ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ, తినడానికి అమ్మాయికి అన్నీ ఇస్తూ, త్వరలో రహమాన్ ఆమె అభిమానంకి పూర్తిగా అర్హుడయ్యాడు.

పొద్దున్న ఎనిమిది గంటలకి పాపతో మద్రాసుకి బయలుదేరాడు.

రైలుబండిలో పక్కన ఎవరూ లేని సమయంలో రహమాన్ "పాప, నీ పేరేంటమ్మా?" అని అడిగాడు.

"నా పేరు అలము. కాని స్కూల్లో అందరూ నన్ను 'అలమేలు' అనే పిలుస్తారు. టీచరు 'అలమేలు' అని పిలవగానే నేను 'Present Sir' అని బదులు చెప్తాను."

"ఓ, అలమువా? నేను నిన్ను ఎమని పిలుస్తానో తెలుసా?"

"అలము అని పిలుస్తావ్! కాని, అంకుల్, అలా పిలవొద్దు! . . . నన్ను 'జిల్లీ' అని పిలు . . . మా రాజు వాళ్ళ ఇంట్లో 'జిల్లీ' అనే కుక్కపిల్ల ఉంది . . . దానికి రోజు బిస్కట్లు అన్నీ ఇస్తారు . . . నాకూ జిల్లీలాగ ఉండాలని ఆశ! నిన్న నువ్వు నాకు ఎన్ని పళ్ళూ, బిస్కట్లూ కొని ఇచ్చావ్! ఇప్పుడు నేనూ 'జిల్లీ' ఐపోయాను! నన్ను జిల్లీ అనే పిలు!"

'అయ్యో పాపం!' అని అతనికి జాలి కలిగింది. "వద్దమ్మా, 'జిల్లీ' అన్న పేరు కుక్కపిల్లకే సరిపోతుంది . . . కుక్క భౌ భౌ అని అరుస్తుంది, బెదరించుతుంది! నువ్వెంత మంచి పిల్ల! నేను నిన్ను అల్లి అని పిలుస్తాను . . . అదీ జిల్లీలాగే కదా?" అని రహమాన్ సముదాయించాడు.

"సరే, అంకుల్ . . . ఆ పేరూ బాగుంది!" అని అంటూ అమ్మాయి చప్పట్లు కొట్టింది.

ఆ ముందు రాత్రి, అల్లా కృపతో తనకి దొరికిన ఆ పిల్లకి తగిన పేరు తెలియక రహమాన్ చాలా చికాకుపడ్డాడు.

మరుదినం ఆమె 'అలము' అని తన సొంతపేరు చెప్పి "అంకుల్, ఇక నన్ను అల్లి అని పిలు!" అని అనగానే రహమాన్ మనసులోనూ ఆ పేరే ముందు మోగింది.

** ** **

అల్లి![2]

బాలిక కళ్లు చూస్తూ పరవశమైపోయి "ఆహా, ఎంత మంచి పేరు!" అని రహమాన్ సంతోషించాడు. ఆమె సొంతపేరులో మొదటి అక్షరం, ఆమెకి నచ్చిన పేరులోని ల్లి సబ్దం - రెండూ కలిపితే అల్లి! అల్లా కృపతో తనకి దొరికిన బహుమానం! తన కోరిక, అమ్మాయి ఆశ - ఎంత చక్కని ఒద్దిక!

ఈ సంభాషణ తరువాత రైలు ఒక స్టేషన్ లో ఆగింది. రహమాన్ "పాప, నీకు దాహమేస్తుందా? నీళ్ళు కావాలా?" అని అడిగాడు.

"అంకుల్! నువ్వు నన్ను అల్లి అని పిలుస్తేనే జవాబు చెప్తాను."

"అవును! అవును! . . . అల్లి, నీకు నీళ్ళు కావాలా, చెప్పు!"

"వొద్దు! అంకుల్, నాకు దాహం లేదు!"

"సరే . . . కాని అల్లి, నువ్వు కూడా ఇక నన్ను 'అంకుల్' అని పిలవకు. 'బాబా' అని పిలు . . . ఏదీ, పిలు చూద్దాం! . . . బాబా . . . బాబా . . . "

"ఓ! బాబా . . . బాబా . . . నువ్వేమో నన్ను 'పాప' అని పిలవకూడదు . . . కాని నేను నిన్ను బాబా అని పిలుస్తాను . . . అవునా?" అంటూ అల్లి చప్పట్లు కొట్టింది.

ఏదో పెద్ద భారం తొలగినట్టు రహమాన్ నిట్టూర్పు వదలాడు. ఇక తన బాధ్యతగురించి తలబోస్తూ కిటికీ ద్వారా బాహ్య ప్రపంచాన్ని చూసాడు.

"బాబా, నేను నిద్రపోవాలి!" అని అల్లి మాటల్లోని ఉన్న చనువు చూసి అతని మనసు మళ్ళీ పులకరించింది.

"ఇదిగో, అల్లీ, ఇలా తలపెట్టుకొని నిద్రపోమ్మా!" అని తనూ మక్కువతో అన్నాడు.

---

[2] తమిళంలో అల్లి అంటే కలువ పువ్వు (Water Lilly). కలువ, తామర, రెండూ అందంకి ప్రసిద్ధికెక్కినవి.

అతను అల్లితో మద్రాసు చేరుకున్నదినం అతని మనసులో ఆరాటం చోటుచేసుకుంది, కాని క్రమేణ అది తగ్గుతూ వచ్చింది. నిశ్చింతగా చెయిలోవున్న కొంచెం డబ్బుతో రహమాన్ అల్లితో మూడు నాలుగురోజులు హాయిగా పట్టంలో అన్నీ తిరిగి చూసాడు.

ఆ పర్యటనల మూలంగా అతనికి ఒక మనుగడ దొరికింది. ఒక దర్జీ దుకాణంలో సహకారిగా చేరాడు. పట్నంకి సమీపంలోవున్న ఒక పేటలో ఆ దుకాణం ఉంది. దానికి పక్కనే ఒక గదిని రెండు రూపాయల అద్దెకి తీసుకొని అల్లితో అక్కడ స్థిరపడ్డాడు.

ఒకరోజు రహమాన్ తను అల్లికని కొన్న తినుబండారాలతో కొంచెం మాంసమూ కొనితెచ్చి ఆమెకి అందించాడు. దాన్ని తీసుకొని అది నోటి దగ్గరకి చేరుకున్నవెంటనే అల్లి "అయ్యయ్యో, కంపు! బాబా, నాకు వొద్దు!" అని దబ్బుమని కింద పడేసింది. "సరే, అది నీకు వొద్దమ్మా," అని రహమాన్ అన్నాడు; ఆమెని బలవంతం చెయ్యలేదు. కాలక్రమంలో అల్లికి మాసం అలవాటు చేద్దామని ఆలోచించాడు.

కాని ఆ రోజే ఒక విపరీతం జరిగింది. ఆ దుర్గంధంకే అల్లి ఎడతెగకుండా వాతులు తీసింది. కొన్ని గంటలలోనే ఆమె మొహం, దేహంలో కనిపించిన మార్పులు చూసి రహమాన్ అల్లాడిపోయాడు.

'ఓ, అల్లా! నాకూ మాసం ఇక వద్దు! మాంసం తినమని ఇస్లాం బలవంతం చెయ్యలేదే! అహింస గురించి నాకు ఈ సందేశం వచ్చింది కాబోలు!' అని రహమాన్ ఆలోచించాడు.

"అల్లి, నిన్నెవరూ కనిబెట్టలేరు!" అని తనకు తనే అనుకుంటూ సంతోషించాడు.

చాలారోజులుగా అతన్ని ఆ భయం వెంటాడుతూనే ఉంది. అల్లికి గభీమని తన నాన్నని చూడాలని అభిలాష వస్తే? అందుకోసమే ఆమెని మోసుకొని రోజంతా చాలా ప్రదేశాలు తిరగడం అలవాటు చేసుకున్నాడు. ఆమె మనసు కన్నతండ్రిమీద పడకుండా చెయ్యాలని అలాగ చేస్తూ క్రమంగా విజయం పొందుతూవచ్చాడు.

“ఆహా, ఈ బాలిక వలన మనకి ఎంత సంతోషం! దీన్ని పోగొట్టుకొన్న ఆ కన్నతండ్రి మనసు ఎలా బాధ పడుతుందో?” అని అతను రెండుమూడు సార్లు ఆలోచించాడు కూడా. కాని వెంటనే . . .

‘అసలు ముందునించే అల్లికి నాన్నగారంటే చనువు లేదనిపిస్తోంది; నిత్యమూ అతనంటే భయమూ, దిగులే! దానికి కారణం ఆ పాపిష్టి తండ్రికి దీనిమీద మచ్చుకైనా ప్రేమ లేకపోవడమే! అతని ఉపేక్ష, ఉదాసీనత, పక్షపాతం దీని మనసులో చాలా లోతుగా పాతుకుపోయాయన్నమాట! కన్నతండ్రిగా అతను వాపోతున్నాడేమో? సరేలే, చేసిన పాపంకి ఫలం బాగా అనుభవించనీ! ఇక్కడ అల్లి సంతోషంగా ఉందికదా , నాకూ సంతోషంగా ఉంది. నేనంటే దానికి ఎంత చనువు, అభిమానం! ఇక అన్నీ ఇలాగే సాగనీ!’ అని రహమాన్ తన మనసుని సుళువుగా ఊఱడించుకున్నాడు. అల్లితో తన భవిష్యత్తు గురించి ఆలోచించే అతని మనసులో కొత్తగా కాపురం చేసే దంపతులకి ఏర్పడే ఆనందంని మించిన సంతుష్టి చోటుచేసుకుంది.

తను సహకారిగా పని చేసిన దర్జీ దుకాణంలో సమర్ధతతో పని చేసి రహమాన్ యజమానిదగ్గర మంచి పేరు సంపాదించాడు; ఆఖరికి తన సహోద్యులకి నాయకుడుగా మారాడు. ఆ తరువాత చెయిలో కొంచెం డబ్బు పోగుచేసుకొని తనే సొంతంగా ఒక కుట్టు మెషిన్ కొన్నాడు. మద్రాసులోనే శైదాపేట్ అనే శివారులో, ఒక ఇల్లు అద్దెకి తీసుకొని అల్లితో కాపురం ఆరంభించి ఇంటి గుమ్మంలో తన దర్జీ దుకాణం తెరిచాడు.

‘అలీబాబా దర్జీ దుకాణం’ అనే పేరుతో వ్యాయాపారం ఆరంభించినవాడిని ఆ అలీబాబాన్ని కొట్టిన అదృష్టం మళ్ళీ కొట్టింది. ఇరవై సంవత్సరాలముందు ఆరంభించిన మొదటి ప్రపంచ యుద్ధం అంతమై, కరువులూ, అన్నిరకాల ఇక్కట్లు తొలగుతున్న కాలమది; కొత్త కొత్త, రకరాల వస్తువులు, దండిగా, చవుకగా, ప్రజలకి అందాయి. ఇంచుమించు ఆదాయం ఉన్న జనులుకూడా సుఖంగా జీవించిన కాలమది.

ఇటీవల యౌవనస్త్రీలకి బుట్టచేతుల రవికలంటే ఏవగింపు వచ్చేసింది. సొగసుగా, రకరకాలుగా సృష్టించిన రవికలు ధరించాలనే అభిరుచి వాళ్ళ మధ్య

త్వరగా వ్యాపించింది. వాళ్ళ ప్రీతికి దోహదం చేసేవారు దర్జీలేకదా? ఆ కృషిలో పాల్గొని, యౌవనస్త్రీల మెచ్చుకోలు సంపాదించుకున్న దర్జీలలో రహమాన్ కూడా ఒకడు.

అతని ఆదాయం పెరగడానికి ఆ స్త్రీల ప్రశంశ ముఖ్యకారణమైనా, రహమాన్ ఆ గౌరవం అల్లికే ఇవ్వాలని నిశ్చయించాడు. అందులోనూ న్యాయముంది. అతని మనసులో మొట్టమొదట కొత్త మోస్తరులో ఒక దుస్తు కుట్టాలనే ఆలోచన వచ్చిందంటే, రహమాన్ దాన్ని అల్లికనే కుట్టి, ఆమె తొడుక్కున్నతరువాత చూసి, అది ఎలాగ ఉందని అంచనా వేస్తాడు; అందులో లోపాలేమైనా కనిపిస్తే, తనకి తృప్తి కలిగినంతవరకూ వాటిని సరిదిద్దుతాడు. ఆమె దేహంలో ఆ కొత్త ఉడుపు రాణించే సొగసు చూస్తూ, పరవశమై, ఉత్సాహంతో దాన్ని ఇతరులకి కుట్టడానికి పూనుకుంటాడు.

మొదటినుంచే అల్లి తన జీవితంని తీర్చిదిద్దడానికి వచ్చిన దివ్యకానుక అని నమ్మిన రహమాన్ మనసులో క్రమంగా ఆమె తనకి సంపద, శ్రేయస్సు అనుగ్రహించే ధనలక్ష్మి, దేవత అనే ఆలోచనా, ఉత్సాహమూ స్థిరపడిపోయాయి.

అల్లికి పన్నెండేళ్ళు నిండాయి. రహమాన్ అల్లికి కుట్టుపని నేర్పించాడు. ఏడేళ్లు నిండడానికి ముందే అల్లి అతని పనితనం పక్కనుండి చూస్తూ, ఆ తరువాత చిల్లరి పనుల్లో అతనికి సాయం చేస్తూ, సులభంగా అన్నీ నేర్చుకుంది. ఆమెకని ఒక కుట్టు మెషిన్ కొని, రహమాన్ ప్రోత్సాహించాడు.

ఇంటిలోపల మెషిన్ పెట్టుకొని అల్లి బట్టలు కుట్టింది; బాబాకీ, తనకీ వంట తనే చేసింది; క్రమంగా ఇంటిపనులకి బాధ్యత తీసుకొని ఇంటి యజమానిగా మారి పోయింది!

ఆ తరువాత, కొన్ని మాసాలలో, ఆ ఇంటిలో, ఇంకొక ముఖ్యమైన మార్పు కనిపించింది.

అల్లి ఎప్పుడూ ఇంట్లోనే ఉంటుంది, బయటికి వెళ్ళదు; ఇది రహమాన్ గమనించాడు. నాలుగైదుసార్లు తనతో రమ్మని పిలిచాడు. ఏదో సాకు చెప్పి అల్లి తప్పించుకుంటోందని రహమాన్కి తెలిసిపోయింది!

"అల్లీ, నువ్వెందుకు నాతో ఎక్కడకీ రానంటున్నావ్?" అని ఒకరోజు నోరు విప్పి అడిగేసాడు.

అందుకు అల్లి "బాబా, ఈ వీధి చివరన మూడో ఇల్లు లో ఉన్న అవ్వ నాకు ఏం చెప్పిందో తెలుసా? 'మన కులాచారంలో, మనకి 'గోషా' ఉందమ్మా! నీ బాబా నువ్వు బయటకి వెళ్ళడానికి సరే అన్నా నువ్వు మాత్రం ఎక్కువగా బయటకి వెళ్ళవద్దు!' అని అంది. అందుకే నేను నీతో వెళ్ళడానికి జంకుతున్నాను . . . నాకు చదవడానికి పుస్తకాలున్నాయి, సమయమెలాగో గడచిపోతోంది . . . బాబా, నువ్వే వెళ్ళిరా, నేనెందుకు?" అని అడిగింది.

బాబా మరేం అనక ఊరుకున్నాడు. తనకీ, అల్లికీ మధ్య ఎడబాటు రాబోతుందా?

"ఇన్నిరోజులూ అల్లి బాలికగానే నాతో ఉంటోంది. ఐనా ఈ సహవాసం కొనసాగించడంలో ఏమైనా చిక్కులున్నాయా? ఎందుకీ పిచ్చి పిచ్చి ఆలోచనలు!" అని రహమాన్ విసుగ్గున్నాడు.

అల్లి తనతోబాటు వాహ్యాళికి రాకపోతే ఏం? అదేం పెద్ద ప్రశ్న కాదు!

అయినప్పటికీ ఇందులో విచిత్రమేమంటే అల్లితో జీవితం ఆరంభించిన రోజుల్లో రహమాన్ ఆమెతో బయటకి వెళ్ళాలంటే వెనకాడేవాడు. ఎవరైనా ఆమెని సరిపోల్చుకొని తమిద్దరినీ వేరుచేస్తారేమో అని అతనికి భయం! కాని ఇంటికి తాళం వేసి అల్లిని బంధించడానికి అతనికి ఇష్టం లేదు. స్వతంత్రంగా బాహ్య ప్రపంచంలో అన్నీ చూసి ఆహ్లాదించిన బాలికకి అది ఎంత పెద్ద శిక్ష! అందుకే నాన్నని, తన స్నేహితులని అల్లి మరచిపోవాలని రహమాన్ ఆమెని చాలా చోట్లకి తీసుకొని వెళ్ళి వేడుకలన్నీ చూపాడు. 'నావంటి దుర్మార్గుడికి అల్లా కరుణించి ఇచ్చిన బహుమానం అల్లి; దాన్ని ఆ దేవుడు నా దగ్గరనుంచి లాగ్గోరు!' అనే ధైర్యంతో రహమాన్ తను వెళ్ళిన ప్రాంతాలన్నీ అల్లితో తిరిగాడు.

ఇప్పుడు అతని మనసులో ఆరాటం రవంతైనా లేదు. 'కాని అల్లి ఇప్పుడు గోషా స్త్రీగా మాఱబోతుంది! ఆశ్చర్యం! తన ఆజ్ఞ లేకుండానే ముస్లిమ్ స్త్రీల ఆచారం, పాటించుతోంది!' ఇలాగ ఆలోచిస్తూ, ఆఖరికి రహమాన్ 'సరేలే, అసలు ముస్లిమ్

స్త్రీలాగంటే మంచిదే! అది ఎండలో, దుమ్మూ, ధూళిలో నాతో తిరుగుతూ అందం పోగొట్టుకోవద్దు!" అని తనకు తానే సముదాయించుకున్నాడు.

కాని ఇంతలో అల్లిగురించి మళ్ళీ ఆలోచించినప్పుడు గభీమని ఒక భయం కప్పుకుంది.

'విధి ఆడే వింత ఆటలు ఎవరికి తెలుసు? దాన్ని ఎవరైనా పోల్చుకుంటారో అని నేను భయపడిన రోజుల్లో అలాగేం జరగలేదు. ఇప్పుడు నేను ధైర్యంగా ఉన్నాను; ఎవరైనా అల్లి ఎవరని తెలుసుకొని ఎదురుపడితే నేను చేసేదేముంది? అల్లి ముఖంలో తల్లి పోలికలున్నాయేమో? ఇప్పుడు యౌవనంలో దీనిలో కనిపించే పోలికలు ఎక్కడైనా చూసి దీని తండ్రి . . .

'అయ్యో, ఇది పది సంవత్సరాలముందు కనిపించకుండా పోయిన నా అమ్మాయి అలము!' అని ఎవరైనా అంటే, వెంటనే నా ముఖభావం నా నేరంని బట్టబయలు చేస్తుంది! అల్లి నన్ను విడిచి వెళ్ళిపోతుంది! అవును, అలాగేదైనా జరుగుతుందేమో? ఆ తరువాత? . . . మనం కథల్లో చదివినట్టు ఒక పాపాత్ముడు జీవితం సరిదిద్దడానికని వాడితో కొంతకాలం ఉండి, వాడు సన్మార్గ తోవలో ప్రవేశించినవెంటనే వాడిని వదిలేసినట్టు నా అల్లికూడా నన్ను మంచివాడుగా చేసి 'ఇక నా బాధ్యత తీరింది!" అని వెళ్ళిపోతుందా? పట్టినత్తార్[3] కొడుకు ఆ పనే చేసాడు; నా దేవత అల్లికూడా అలాగ చేస్తుందా? అయ్యో, వద్దు! అది భద్రంగా ఇంటిలోనే ఉండనీ! 'నేను బయటకి రాను,' అని అల్లి అంటే 'సరే, లోపలే ఉండు!' అని నేను తిట్టను, 'నాతో నువ్వు రావద్దు!' అని కోప్పడను' అని ఆఖరికి రహమాన్ నిశ్చయించాడు. ఆ తరువాత అల్లి తనతో వాహ్యాళి రాలేదని అతను బాధపడలేదు. ఈ పరిస్థితిలో ఆమె పాటించే పరదా కూడా అనుకూలంగానే ఉందని అతనికనిపించింది. అవశ్యకమైనప్పుడు అల్లి బయటకి వస్తుండేది, నిత్యమూ, గుమ్మంలోనే బాబా కుట్టు మెషిన్ దగ్గర కూర్చోలేదు. చాలామట్టుకు లోపలే ఉంటుంది, ఎప్పుడైనా గుమ్మంకి రావడం అలవాటు చేసుకుంది.

ఇలాగే దాదాపుగా ఒక సంవత్సరం గడిచిపోయింది. ఇటీవల, పదిరోజులముందే, అల్లిలో ఒక మార్పు కానవచ్చింది. ఆమె దిన చర్యలలో,

---

[3] తమిళులు పూజించే శివభక్తుడు. ఆధ్యాత్మిక నేత

మనోభావంలోకూడా రహమాన్ మార్పులు గమనించడం జరిగినా, అతను పూర్తిగా అవగాహన చేసుకున్నది ఇవాళే; అది సహించలేక పోయాడు. అందుకే ఎన్నటికిని ఎరుగని అలసట వచ్చేసింది.

ఒక వారం ముందు రహమాన్ ఏదో పనిమీద చెంగల్పట్టుకి వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళేముందు అల్లితో "ఇవాళ మధ్యాహ్నం కణ్ణన్ అని ఒకతను వస్తారు. అతనికి ఇవ్వవలసిన దుస్తులు చూసి ఇచ్చేయ్; అవి రెడిగా బిల్లుతో ఉన్నాయమ్మా," అని అన్నాడు.

అతను సాయంకాలం తిరిగవచ్చి బట్టలు మార్చుకుంటున్నప్పుడు అల్లి "బాబా, మీరన్నట్టే కణ్ణన్ అని ఒకతను వచ్చి బట్టలు తీసుకొని వెళ్ళారు . . . అతను ఇంతకు ముందు మన దుకాణంకి వచ్చివున్నారా?. . . నాకతన్ని చూసినట్టు గుర్తు లేదే?" అని అడిగింది.

"హూం, ఓ రెండు మూడు సార్లు అతను వచ్చారు . . . అతను ఏమన్నారు? దుస్తులు తీసుకొని కూలీ ఇచ్చేసారా?"

"ఓ, కూలీ ఇచ్చేసారు! కాని వెళ్ళేముందు 'నీ పేరు అల్లికదూ?' అని నన్ను అడిగారు! బాబా, అతనికెలా నా పేరు తెలుసు? నేనతన్ని ఇంతకుముందు చూడనే లేదే?" అని అల్లి అడిగింది.

"అతను మొట్టమొదట మన కొట్టుకి వచ్చినప్పుడు 'మీ పేరు ఆలిబాబావా?' అని నన్ను అడిగారమ్మా. 'కాదు, రహమాన్,' అని అన్నాను. దుకాణం పేరులోని 'అలిబాబా' చూసి అతను నన్ను అలాగ అడిగారు. అప్పుడు నేను అతనికి కారణం వివరించి చెప్పాను: 'నా అమ్మాయి పేరు అల్లి, నేను దానికి బాబా! రెండూ కలిపి అలిబాబా అని పేరుపెట్టాను!' అని అన్నాను. అందువలనే అతనికి నీ పేరు తెలిసింది."

"ఓ, అలాగా? అతనికి జ్యోస్యం తెలుసునేమో అని అనుకున్నాను! 'బాగా చదువుకున్న మనిషి, ఇతనిలో ఏదో ఆకర్షణ శక్తి ఉంది!' నాకనిపించింది. 'కణ్ణన్ అని ఒకతను వస్తారు,' అని మీరు చెప్పి వెళ్ళారు కదా? 'ఆ పేరేమో కుట్టివాళ్ళకే సరిపోతుంది, పెద్దవాళ్ళకి బాగుండదు!' అని నేను ఆలోచించేదాన్ని, కాని అతన్ని

చూడగానే 'ఇతనికీ ఆ పేరు బాగుంది! అబ్బా, ఎంత పెద్ద కళ్ళు! అతనికి తగిన పేరే!' అని అనుకున్నాను!"

అవును. అందమైన ఆ కణ్ణన్ కన్నులు చూసి అల్లి మైమఱచిపోయింది.

అల్లి అడిగిన ప్రశ్న విని రహమాన్ మనసులో ఎటువంటి అనుమానమూ చోటుచేసుకోలేదు. "అవునమ్మా, . . . మంచి పేరు, సరైన పేరు . . .ఆ అబ్బాయికి పెద్ద కళ్ళు!" అని అన్నాడు.

ఆ రోజు తను అన్న మాటలే ఆమె వాంఛని దృఢపరచాయేమో? తనుగాని అలా ఆమోదించకుడా నోరు మూసుకొనివుంటే? . . .

రహమాన్ కూడా కణ్ణన్ గురించి గొప్పగా అనడంతో అల్లికి తన మనసులోని నిగూఢ వాంఛన అణచుకోడం అసాధ్యమైపోయిందికాబోలు!

ఆతురతతో అల్లి "బాబా, అతను మళ్ళీ ఎప్పుడు వస్తారు? అతను తరచుగా దుస్తులు కుట్టడానికి వస్తుంటారా?" అని అడిగింది.

"తరచుగా రారమ్మా! ఇప్పుడీ యుద్ధం రావడంతో రేషన్ వచ్చేసిందికదా, కావాలన్నప్పుడు జనులు బట్టలు కొనడం చాలా కష్టం! ఇప్పుడే అతను మరేం ఆర్డర్లు ఇవ్వరు! ఈ రెండు మాసాల్లో మూడు సార్లు వచ్చారు . . . ఇంకా రెండు వారాలు పడుతుంది," అన్నాడు రహమాన్. అప్పుడుకూడా అతని మనసులో రవంతైనా అనుమానం లేదు.

కాని, ఏం ఆశ్చర్యం, అల్లి మానసిక ఆహ్వానం కణ్ణన్ చెవులకి అందిందా?

రెండే రోజుల తరువాత, అంటే - ఐదారు రోజులముందు - 'రహమాన్ సాయబ్!' అనే పిలుపు విని రహమాన్ త్వరగా బయటకి వచ్చాడు.

కణ్ణన్ నాలిక 'రహమాన్!' అని పిలిచింది కాని ఆ యువకుని మనసూ, కన్నులూ అల్లినే వెతుక్కుంటూ వచ్చాయని ఆ సమయంలో రహమాన్కి తెలీదే? గుమ్మం చేరుకున్న రహమాన్ "ఓ, మీరా?" అని ఆశ్చర్యంతో అతనికి స్వాగతం చెప్పి, పక్కనేవున్న బెంచీలో కూర్చోమన్నాడు. "ఇదేం పొట్లం, మీ చెయిలో? నేను కుట్టిన దుస్తులు సరిగ్గా లేవా?" అని బెంగతో అడిగాడు.

"సాయబ్, బాగుంది మీ ప్రశ్న! మీరు కుట్టిన దుస్తుల్లో ఎప్పుడైనా కొరతలన్నాయా? మీకెందుకు అనుమానం? కొత్తగా ఆర్డర్లు ఇవ్వడానికి నేను

వచ్చాను. మీరు కుట్టిన shirt, pant మోస్తర్లు నా స్నేహితులకి బాగా నచ్చాయి. 'ఎవరు కుట్టారు?' అని అడిగారు. 'మీరు బట్టలు, కొలతలు ఇవ్వండి, నేనే కుట్టమని చెప్తాను,' అని వాళ్ళకి మాట ఇచ్చాను" అని అంటూ కణ్ణన్ చెయిలోని మూటని విప్పాడు.

అతని మాటలు వినే కాబోలు అల్లికూడా గుమ్మంకి దగ్గరగా వచ్చేసింది; రెప్పవాల్చకుండా అతన్నే చూస్తూ నిలబడింది. ఇంతవరకూ అల్లిని చూడాలనే ఆతురతతో తన కళ్ళని ఇంటిలోకి తరచుగా మళ్ళించుతున్న కణ్ణన్, ఆమె దగ్గరలో కనిపించగానే, సిగ్గుతో తన చూపుని నేలమీదకి దించుకున్నాడు. అప్పుడే అల్లికూడా ఏకాగ్రతతో అతన్ని చూసింది.

కణ్ణన్ తెచ్చిన బట్టలూ, మాదిరి దుస్తులూ చూస్తూ ఏవేవో ఆలోచనలో పడిపోయిన రహమాన్ కణ్ణన్, అల్లి, వాళ్ళిద్దరి కన్నులలోని కొత్త మార్పు గమనించలేదు; ఓ రెండుసార్లు వాళ్ళ కళ్ళు కలుసుకోవడంతో ఇద్దరి ముఖాలు చెమట పట్టేసి, నిగనిగలాడడమూ అతను గుర్తుపట్టలేదు.

వచ్చినపని పూర్తి అవగానే, కణ్ణన్ అక్కడనుంచి నిష్క్రమించలేదు. బట్టలు, వాటి తారతమ్యం, ధరలు, మరెన్నో కబుర్లు అతను రహమాన్ తో మాటాడుతూనేవున్నాడు.

'ప్రేమ' అనే భావన వచ్చిందంటే ప్రజలు అన్నివిధాల పిచ్చిపనులూ చమత్కారంగా చెయ్యడం సహజమేకదా? ఏ లోకజ్ఞానమూ ఎరుగక అడవిలో పెరుగుతున్న ఆ శకుంతల కన్నులు దుష్యంత మహరాజుని చూడగానే ఆమె మైమరచిపోయి, తన కాలులో ముల్లు గుచ్చుకుందని నటిస్తూ తన స్నేహితుల వెనుక నిలిచిపోయింది! నోరు విప్పి ఏమీ అనక కళ్లమూలంగానే సంభాషించిన ప్రేమికలు ఎంతముంది మన పురాణాల్లో ఉన్నారు? ఇప్పుడూ ఉన్నారు! అసలు ప్రేమకి మూలకారణం కన్నులే! చూపులు కలిసిన ఆ శుభవేళనుంచి జీవితాన్ని పోషించేది ఆ ప్రేమే!

కణ్ణన్ ముచ్చటగా, చమత్కారంగా ఏదేదో మాటాడుతూనే ఉన్నాడు. అక్కరలేని కబుర్లే మాటాడినా ఎలాగో ఒకదానికొకటి జోడించి సంభాషణ పొడిగించాడు.

ఇంతలో రహమాన్ గుమ్మంలో నిలబడివున్న అల్లిని చూసాడు. ఎన్నడూ చూడని వింతగా, ఆ రోజు, తను పనిలో ఉన్నప్పుడు, అల్లి వచ్చి అక్కడ నిలబడడం చూసి అతనికి ఒక క్షణం ఆశ్చర్యం కలిగింది; కాని వెంటనే అతని మనసులో గర్వమూ, సంతోషమూ చోటుచేసుకున్నాయి. ఆమె మొహంలో కానవచ్చిన ముసిముసి నవ్వు, చూసినవారెవరైనా వాళ్ళ మనసుని దోచుకొనే అమరిక చూసి రహమాన్ ఆనందించాడు. గతించిన నాలుగు రోజుల్లో అల్లి మనసులో పెద్ద మార్పు వచ్చిందని అతనికి తెలియకపోయినా, ఇప్పుడు నివ్వెఱపోయి అల్లిని చూసినప్పుడు అతనికి ఆమె అందం అధిగమించినట్టు కనిపించింది.

"సార్, చూడండి. మా అమ్మాయిగాని లేదంటే ఇలాంటి కుట్టుపని, అందరినీ తృప్తి చేసే సమర్ధత నాకెలా వస్తుంది? ఇదిగో, ఇప్పుడు మీరు తొడుక్కున్న షర్టు - అది ఇక్కడ కుట్టినట్టుందే? అవునా?" అని అడిగాడు రహమాన్.

"అవును, సాయబు. మీరే ఇది కుట్టారు; నాకు చాలా నచ్చింది. దీనితోబాటు ఇంకొక షర్టు మీ దగ్గరే కుట్టించుకున్నాను." అన్నాడు కణ్ణన్.

రహమాన్ గర్వపడుతూ "సార్, ఇదెవరు కుట్టారో తెలుసా? అదిగో, చూడండి, మా అల్లి, అదే కుట్టింది! అవాళ్ళ పొద్దున్న నేను టవునుకి వెళ్ళవలసి వచ్చింది. ఈ రెండు షర్టులు, కొన్ని రవికలు ఇచ్చి కుట్టమని చెప్పి వెళ్ళాను. నేను తిరిగిరావడం ముందే, చక్కగా అన్నీ కుట్టి, గుండీలుతోబాటు రెడీ చేసేసింది!" అన్నాడు.

"ఓ, అలాగా? ఇవన్నీకూడా మీ అమ్మాయికి తెలుసన్న మాట!" అని అంటూ కణ్ణన్ అల్లిని సూటిగా చూసాడు. ఇప్పుడు అల్లి తల దించుకుంది! కాని మొహంలో చిరునవ్వు అలాగే ఉంది.

ఆ చూపులోని నిగూఢ అర్ధం: 'చూసావా? నీ చేతులు తాకిన చొక్కాయి నా గుండెకి హత్తుకొని ఉంది! ఆహా, నాకు ఎంత సంతోషంగా ఉంది!"

అల్లి దృషిలోనూ, సిగ్గుతో ఆమె తల వంచినప్పుడూ ఒక సందేశం ఉంది కాబోలు: 'అవును, మీలాగే నాకూ చాలా సంతోషమే!'

తను తొడుక్కున్న చొక్కాయి అల్లి శరీరంని కౌగిలించినట్టు ఒక ఆనందభరితమైన స్మరణ కణ్ణన్  నరాలని తాకింది; అతను ఆవేశంతో, ఇంకా చురుకుగా రహమాన్ ఏమంటున్నాడో వింటున్నాడు.

“ఓ, దానికి అవన్నీ బాగా తెలుసు సార్! . . . కుట్టుపనిలో అల్లి నాకు అన్నివిధాలుగా సాయం చేస్తోంది . . . అంతే కాదు . . . ఇంటి పనులూ చక్కగా చేస్తుంది . . . చదువుకుంటుంది కూడా  . . . తరచుగా వీధి దీపాల వెలుతురులో ఏదో తమిళంలో, ఉర్దూలో,  ఏదో చదువుతూనేవుంటుంది.  ‘ఎందుకమ్మా ఇవన్నీ నీకు? కళ్ళు చెడిపోతాయ్, కుట్టుపని మాత్రం చాలదా?’ అని నేను అంటే వింటేనా? దానికి ఉర్దూ నేనే నేర్పాను; ముందు ప్రాధమిక పుస్తకాలు, ఆ తరువాత క్రమంగా పాఠ పుస్తకాలు దానికి కొని ఇచ్చాను. అవన్నీ చదివి అన్నీ నేర్చుకుంది. ఇంటి పనుల్లో  బాధ్యతలు రాకముందు - అంటే పన్నెండళ్ళవరకూ - దాని శ్రద్ధ అంతా కుట్టుపనిమీదే. నాకు తెలిసిన తమిళం నేర్పాను, దానికీ ఉర్దూలాగ పుస్తకాలు కొని ఇచ్చాను.

నాకు హిందూ మతం అంటే ద్వేషం లేదు. బాల్యంనుంచే నేను బడిలో తమిళం చదివాను. అన్నిరకాల పుస్తకాలు కొని చదవడం అలవాటు చేసుకున్నాను. ‘కృష్ణలీలలు’ కథలో అల్లికి ఒక్కొక్క కృష్ణలీలగురించి బాగా తెలుసు; రామాయణం, భారతం కథలు టూకీగా తెలుసు. శివుడు, సుబ్రహ్మణ్య స్వాముల కథలు తెలుసు. మా మతంలోని మహనీయులగురించి అడిగితే అవన్నీ చెప్తుంది” అని ముగించాడు రహమాన్.

“అలాగా? నాకు మీ సలహా నచ్చింది. అదే ప్రజలకి నీచబుద్ధి రాకుండా కాపాడుతుంది. మీలాగే మీ ఔదార్యం, సానుభూతి మీ అమ్మాయిలోనూ కనిపించడంలో ఆశ్చర్యమేముంది?” అని అంటూ అల్లిని మళ్ళీ చూద్దామని కణ్ణన్ ధైర్యంగా తిరిగి చూసాడు.

ఆశ్చర్యం, అల్లి గుమ్మం దగ్గర కనిపించలేదు! రహమాన్ కణ్ణన్ దగ్గర తన్ను పొగడుతూ మాటాడడం విని ఆమెకి సిగ్గేసి, అల్లి ఇంట్లోకి పరుగు తీసింది. ఆమెని చూడలేదని కణ్ణన్ బాధపడినా, ఆ అవస్థలోనూ అతని మనసులో ఒక విధమైన ఆహ్లాదం చోటుచేసుకుంది; రహమాన్ వర్ణనలో అల్లి కథ విని ఆనందించాడుకదా?

కొంచెం సమయం తరువాత కణ్ణన్ అక్కడనుంచి నిష్క్రమించాడు.

తను అల్లిని పొగడుతూ, ఆమె స్వభావం, విశిష్టత, వివరించి కణ్ణన్కి చెప్పడం వలన ఇటీవల వాళ్ళిద్దరిమధ్య మొలకెత్తిన ప్రేమ ఇంకా లోతుగా, గాఢంగా గట్టిపడుతుందని  రహమాన్ గ్రహించలేకపోవడం ఒక పెద్ద వింత అని వేరే చెప్పాలా?

ఆ మరుదినం రహమాన్ దారంబండీలు కొనడానికి బజారుకి వెళ్ళాడు. తిరిగి రాగానే "అల్లి, ఇక్కడకి రామ్మా!" అని పిలిచాడు.

ఆతురతతో  పరుగెత్తుకొని వచ్చిన అల్లిని దయతో చూస్తూ రహమాన్ "ఆ వెండి లోలకుని తీసేయ్! నీకు కొత్తగా ఇది కొన్నాను. దీనికి 'స్టడ్' అని పేరట!" అని అంటూ ఆ పాత లోలకులు తీసేసి కొత్త నగలతో ఆమె చెవులని అలంకరించాడు.

ఆ పెద్ద, ఎర్రని కమ్మలు ధరించిన అల్లి ముఖంలో కానవచ్చే కాంతి, కళ రహమాన్ చూసి ఆనందించాడు. "అల్లి, నేననుకున్నట్టే ఇది నీకు బాగుంది. నువ్వే అద్దంలో వెళ్ళి చూసుకో! నారింజరంగు రవిక చెయికి - రెండు పక్కలా - ఎర్ర గుండీ ఉంటే ఎలా శోభిస్తుందో - అలా ఉంది!" అన్నాడు.

"అవును, బాబా, అవును! . . . బాబా, ఆ కణ్ణన్ మొహంలో, కళ్ళకి పైన, నుదుటకి దగ్గరగా ఎర్ర రంగులో ఒక పెద్ద మచ్చ . . . press button లాగ! . . . మీరు చూసారా?" అని అడిగింది అల్లి.

"నేను చూడలేదే? . . . హూం . . . అవును, ఇప్పుడు గుర్తుకి వస్తోంది . . . నీవన్నది నిజం . . . నీకు మంచి జ్ఞాపక శక్తి!" అన్నాడు రహమాన్.

రాత్రీ పగలూ కణ్ణన్ మొహాన్ని ధ్యానించే అల్లి మనసులో ఆ ముఖంలో ఆమెని మురిపించే ఆ ఎర్ర మచ్చ స్థిరపడిపోయింది. రహమాన్కి అతని ఖాతాదారులలో కణ్ణన్ ఒకడు.  కాని అల్లికి కణ్ణన్ సర్వవ్యాపియైన దేవుడులాగ కనిపించాడు.

ఇవన్నీ రహమాన్ ఆ ఆ సమయాల్లో ఊహించాడా? లేదు! 'అల్లి ఎందుకు కణ్ణన్ గరించి తరచుగా మాటాడుతోంది?' అని ఇన్నాళ్ళూ ఆలోచించనివాడికి ఆ రాత్రే అనుమానం కలిగింది.

ఆ రాత్రి అల్లి తనే కణ్ణన్ గురించి మాటాడింది. కణ్ణన్ లేని సమయంలో ఆమె అతనిగురించి ప్రస్తావించడం వలనే రహమాన్ మనసులో ఆ అనుమానం లేచింది.

ఆతురతతో  పరుగెత్తుకొని వచ్చిన అల్లిని దయతో చూస్తూ రహమాన్ “ఆ వెండి లోలకుని తీసేయ్! నీకు కొత్తగా ఇది కొన్నాను. దీనికి ‘స్టడ్’ అని పేరట!” అని అంటూ ఆ పాత లోలకులు తీసేసి కొత్త నగలతో ఆమె చెవులని అలంకరించాడు.

ఆ పెద్ద, ఎర్రని కమ్మలు ధరించిన అల్లి ముఖంలో కానవచ్చే కాంతి, కళ రహమాన్ చూసి ఆనందించాడు. “అల్లి, నేననుకున్నట్టే ఇది నీకు బాగుంది. నువ్వే అద్దంలో వెళ్ళి చూసుకో! నారింజరంగు రవిక చెయికి - రెండు పక్కలా - ఎర్ర గుండీ ఉంటే ఎలా శోభిస్తుందో - అలా ఉంది!” అన్నాడు.

“అవును, బాబా, అవును! . . . బాబా, ఆ కణ్ణన్ మొహంలో, కళ్ళకి పైన, నుదుటకి దగ్గరగా ఎర్ర రంగులో ఒక పెద్ద మచ్చ . . . press button లాగ! . . . మీరు చూసారా?” అని అడిగింది అల్లి.

“నేను చూడలేదే? . . . హూం . . . అవును, ఇప్పుడు గుర్తుకి వస్తోంది . . . నీవన్నది నిజం . . . నీకు మంచి జ్ఞాపక శక్తి!” అన్నాడు రహమాన్.

రాత్రీ పగలూ కణ్ణన్ మొహాన్ని ధ్యానించే అల్లి మనసులో ఆ ముఖంలో ఆమెని మురిపించే ఆ ఎర్ర మచ్చ స్థిరపడిపోయింది. రహమాన్కి అతని ఖాతాదారులలో కణ్ణన్ ఒకడు.  కాని అల్లికి కణ్ణన్ సర్వవ్యాపియైన దేవుడులాగ కనిపించాడు.

ఇవన్నీ రహమాన్ ఆ ఆ సమయాల్లో ఊహించాడా? లేదు! ‘అల్లి ఎందుకు కణ్ణన్ గరించి తరచుగా మాటాడుతోంది?’ అని ఇన్నాళ్ళూ ఆలోచించనివాడికి ఆ రాత్రే అనుమానం కలిగింది.

ఆ రాత్రి అల్లి తనే కణ్ణన్ గురించి మాటాడింది. కణ్ణన్ లేని నమయంలో ఆమె అతనిగురించి ప్రస్తావించడం వలనే రహమాన్ మనసులో ఆ అనుమానం లేచింది.

** ** **

ఆ ఉత్తరం చదివి రహమాన్ ‘ఇదేం వింతరా, ఈ అబ్బాయి ఇలా రాసాడు?’ అని నివ్వెఅపడిపోయాడు. ఆ తరువాత ‘ఇలా రాస్తేనే తప్పకుండా ఈ పెళ్ళికి నేను నా సమ్మతి ఇస్తానని వాడి మనసులో ఉంది కాబోలు! ఇంతకీ అల్లి మనసులో ఏముందో? అదేం తెలియక వీడు ఇంత  జోరుగా రాస్తే ఎవరికి లాభం? అల్లికి కణ్ణన్ మీద మక్కువ ఉంది, నిజం.  కాని అది లోకజ్ఞానం లేని పిల్ల . . . ‘ఇలాంటివేవీ

జరగవమ్మా!' అని నేనొక మాట అంటే చాలు, దానికి బోధపడుతుంది; అల్లి బుద్ధిమంతురాలు. . . వీడేదో గొప్పగా కల్పించుకొని పెళ్ళి గురించి మాటాడుతున్నాడు!" అని రహమాన్ ఆలోచించాడు.

కొంచెం సమయం తరువాత అల్లిని రమ్మని పిలిచి ఆ ఉత్తరం అందించాడు. "దీన్ని చదవమ్మా! పాపం, ఎలా రాసాడో చూడు! కాని ఇదెలా జరుగతుంది?" అని చెప్పి పెరడుకు వెళ్ళాడు.

ఒక పావుగంట తరువాత అల్లి తడిసిన కళ్ళతో వంటగది ప్రవేశించింది; సిద్ధంగావున్న రహమాన్కి మౌనంగా అన్నం వడ్డించింది.

"రోజులాగే నువ్వూ భోజనం చెయ్; నీ పళ్ళెం ఎక్కడ?" అని రహమాన్ అడిగాడు.

"బాబా, నాకిప్పుడు ఆకలి లేదు" అంది అల్లి.

"ఎం, ఎందుకు? నీకా ఉత్తరం చదివి బాధగా ఉందా? అవునమ్మా, నాకూ అలాగే ఉంది. అతను ఉత్తికే చావూ, గీవూ అని ఎందుకు రాసాడో నాకు అర్థం కావడంలేదు!" అని అంటూ కొంచెం తొందరగానే రహమాన్ తన భోజనం ముగించేసాడు.

పాపం, అతని మాటలు అల్లిని ఓదార్చాయి!

"బాబా మనసులో కణ్ణన్ కోరిక నిరవేర్చాలని ఉంది. అందువలనే 'అతను ఉత్తికే చావూ, గీవూ అని ఎందుకు రాసాడో నాకు అర్థం కావడంలేదు!'" అని రహమాన్ అంటున్నాడని అల్లి తప్పార్థం చేసుకుంది!

బాబా భోజనం చేసి లేచిన తరువాత అల్లి తనూ భోజనం చేసింది. బాబా మాటలు విని, ఊరడించబడి, ఆమె మనసు కుదుటబడింది. వంటగదిని శుభ్రం చేసింది; మామూలుగా ఇంటిపనులన్నీ చేసింది.

భోజనం చేసి గుమ్మం చేరుకున్న రహమాన్ అల్లి భోంచెయ్యడం, మామూలుగా ఇంటి పనులు చెయ్యడం చూసి 'నా మనసులో ఏముందో తెలిసినా అల్లి బాధ పడలేదే? అల్లి మనసులో కణ్ణన్ని పెళ్ళిచేసుకోవాలనే ఆలోచన లేనేలేదు; ఇప్పుడే నాకంతా బోధపడింది!' అని సంతోషించాడు.

ఆ నమ్మకం భంగమైన తరువాత అతని మనసు శిథిలమైపోయింది; ఒడలంతా ఆయాసం కప్పుకుంది. బోనులో చిక్కుకున్న చిట్టెలుకలాగ గిజగిజలాడాడు.

మధ్యాహ్నం సుమారు రెండు గంటలయివుంటుంది. అంతకు ముందు రెండు మూడు సార్లు రహమాన్ కుట్టుపనిలో శ్రద్ధగా ఉన్నాడని లోపలికి వెళ్ళిపోయిన అల్లి అప్పుడు వచ్చింది.

“బాబా, ఇక మనిద్దరిమధ్య ఎడబాటు వచ్చే భయం లేదు!” అని అంది.

ఆమె భావనలో ‘ఇక మనం ముగ్గురం కలిసివుంటాం!’ అనే ప్రజ్ఞ! పెళ్ళైనతరువాతకూడ తమిద్దరిమధ్యా ఎడబాటు రాదనే ఆలోచనే అల్లి మనసులో చోటుచేసుకుంది.

“అవునమ్మా, మరేం భయంలేదు,” అని మారుమాట పలికిన రహమాన్ మనసులో ఏముంది?

‘ఇక పెళ్ళి సంగతి మరిచిపోదాం!’ అనే అల్లి అంటున్నట్టు రహమాన్ ఉద్దేశం. ఎందుకు కణ్ణన్ పలికిన మాటలు అల్లి మనసుని తాకినట్టు రహమాన్ మనసుని తాకలేదు? దానికి అతని అజాగ్రత్తే కారణమనాలి. తన తప్పుని, తను పొరబాటుగా గ్రహించిన సందేశంని రహమాన్, ఆ తరువాత అల్లి అన్న మాటలు విని, సరిగ్గా తెలుసుకున్నాడు.

“బాబా, అతను మీ సమ్మతిని రెండురోజుల తరువాత తెలియపరచమని రాసినా, మీరు ఇవాళే రాసేయండి! శుభవార్తని  రెండురోజులముందే వింటే మంచిదేకదా? మీరు రెండు రోజులు కాచుకోని రాసి, ఆ ఉత్తరం టపాలో ఏదో ఆలస్యం వలన రెండురోజుల తరువాత అతనికి అందితే అతను ఆత్మహత్య చేసుకుంటారేమో? నాకు చాలా భయంగా ఉంది!” అని చెప్పి అల్లి అక్కడనుంచి నిష్క్రమించింది.

అప్పుడే “ఆ! ఇదేమంటుంది!” అని రహమాన్ నిర్ఘాంతపోయాడు. ఆకాశంలో విమానంలో ప్రయాణం చేస్తున్న మనిషి గభీమని నేలని ఢీకొట్టుకున్నట్టు గుండెని, దేహాన్ని జడత్వం ఆవరించుకుంది.

ఈ వ్యాకులత వలనే రహమాన్ బుర్ర గిర గిర మని తిరిగింది; తలమీద పిడుగు పడినట్టైంది. అలసట, తల నొప్పితో మంచమెక్కాడు.

** ** **

మళ్ళీ పాత జ్ఞాపకాల్లో రహమాన్ చిక్కుకున్నాడు. కొంచెంసేపు తరువాత, తేరుకొని, నెమ్మదిగా వర్తమానం గురించి ఆలోచించాడు.

గడచిన కొన్ని సంవత్సరాలూ అతని జీవితం నిమ్మళంగా, సంతోషంగానే గడిచింది. ఆ కారణం వలనే ఇప్పుడు విభ్రాంతి కలిగించే ఈ పరిస్థితి అతనికి ఒక పెద్ద ప్రశ్నగా ఎదురైంది.

'ఇక నేను ఏంచెయ్యాలి? అల్లి మనసు కణ్ణన్ని కోరుతోంది; అతన్నే పెండ్లాడాలని ఆమె ఆహ్లాదపడుతోంది! అదే నా అంతరాత్మ నాకు వక్కాణించి చెప్తోంది! వారిద్దరి కోరికలు రాజీపడినప్పుడు నేను సమ్మతించాలా లేక నాకెది ఇష్టమో దాన్నే బలవంతం చెయ్యాలా?

కాని . . . అసలు నా ఇష్టం ఏమిటి? ఆ అబ్బాయికి అల్లిని ఇవ్వకూడదు! అంటే, అల్లి నిరాశతో కూలిపోవాలా? హూహూం, అలాగేం జరగ్గూడదు! . . . అల్లి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలి, అదేకదా నా ఆశ? ఇంతకాలం నా ముద్దుబిడ్డగా పెరిగిన అల్లి, ఇప్పుడు మనసు చెదరి వాపోవాలా? అల్లి పెళ్ళిచేసుకొని హాయిగా జీవించాలి, అదేకదా నేనిక చెయ్యవలసిన పని? అల్లి నా జీవితాన్ని ఎలాగ తీర్చిదిద్దింది! దాని ఆశలు నేను పాడుచెయ్యడమా? అల్లి సుఖంకి నేనే జవాబుదారీ. కాని నా బాధ్యత నెరవేర్చడానికి నాకు ధైర్యం ఉందా? ఈ మతాంతర పెళ్ళిని సిగ్గచేటని నలుగురు దూషించారంటే నాకెలావుంటుంది? ఈ సమాజం అంగీకరిస్తుందా? 'పైజామా, టోపీ తొడుక్కొని నేనూ తురకవాడుగా మారిపోతాను!' అని ఎంత తేలికగా ఆ రోజు కణ్ణన్ అనేసాడు? ఇతరుల కళ్ళకి అతని మోసం తెలియకపోవచ్చు, కాని నా అంతరాత్మ లెక్కలేనన్ని కళ్ళని నా మనసులో కల్పించుతుంది . . .'

ఈ బెంగ, దిగిలు, అతన్ని ముంచేసాయి; మరేం తోచక రహమాన్ అల్లాని వేడుకున్నాడు.

'అవును, ఆ అల్లాపే ఈ ఇక్కట్టునుంచి నన్ను కాపాడాలి! మరెవరికి సాధ్యం! హిందువు కణ్ణన్ని ఇస్లాము మతానుకారి రహమాన్ అల్లుడుగా ఆమోదించడమా! కణ్ణన్ హిందువు, అల్లి ముస్లిం; ఇద్దరికీ ఏ పొత్తూ లేదే?'

‘ఆ, ఏంటి, ఏంటి, నేనేమంటున్నాను? అల్లి ముస్లీమా? అవును! కాని, ఇప్పుడేగా అది ముస్లిం? నాలుగేళ్ళు నిండినవరకూ అది హిందూవేకదా? నాకేం మతి పోయిందా? నేనేకదా అల్లిని పైజామా, భుజాలని పూర్తిగా కప్పుకున్న జాకెట్టూ తొడుక్కోవాలని బలవంతం చేసి దాన్ని ముస్లింగా మార్చాను? మరి నేనెందుకు కణ్ణన్ని ఎగతాళి చేసాను? ఆ పొరబాటు నాకు ముందు తెలియలేదే?’

‘ఐనా, ఇప్పుడు ఏం కొంపా మునిగి పోలేదు! అసలు నిజమేమిటో నేనిప్పుడు తెలుసుకున్నాను! అంతా ఆ అల్లా దయ! నేను పాత జ్ఞాపకాల్లో పడిపోయినప్పుడు అల్లి ముందు ఒక హిందువు అనే సంగతి బొత్తిగా మరిచిపోయాను! ఇప్పుడు అల్లాని వేడుకున్న తరువాత నా భ్రమ పోయింది! ‘అల్లికి కణ్ణన్ని పెళ్ళాడడానికి జన్మహక్కు ఉంది!’ అనే సందేశం అల్లా నాకు పంపించారు! ఈ పెళ్ళి తప్పకుండా జరగవలసిందే! నేనెవరు అడ్డు చెప్పడానికి?’

ఈ అల్లి నా దగ్గర వచ్చి చిక్కుకుంది! అలాగ కాకుండా వాళ్ళ నాన్న దగ్గరే ఉండివుంటే ఈ కణ్ణన్నే పెళ్ళాడివుంటుందోమో, ఎవరికి తెలుసు? అది నా దగ్గర చిక్కుకున్నందువలన నేను అనుభవించిన అదృష్టం ఎలా వర్ణించడం? అల్లి మూలం నాకు దొరికిన బహుమకులకి నేను ప్రత్యుపకారం చెయ్యాలి . అది తన మతస్థుడు కణ్ణన్ని వరించుతే ఎదురు చెప్పడానికి నాకేం అధికారం ఉంది? నేనదేకదా ఇంతకుముందు చెయ్యాలనుకున్నాను?

జన్మజన్మాలకీ అల్లి నాకు అనుగ్రహించినవన్నీ అనుభవించి, పన్నెండు సంవత్సరాలు ఆమె నా సంరక్షణలో పెరిగిందనే కారణం వలన ఆమె జీవితం నాశనం చెయ్యడానికి నాకేం హక్కు ఉంది?

పాపం, ఎందుకు అల్లి ఒక తురకవాడి దగ్గరకి వచ్చి చేరాలి? ఒక హిందువు పోషణలోగాని ఆమె మెలిగివుంటే ఏ బాధా లేకుండా దాని కోరిక తీరియుంటుందే! కాని ఇదీ దేవుడు ఆడే ఆటల్లో ఒకటి! నాదగ్గర ముస్లింగా పన్నెండు సంవత్సరాలు పెరిగి, ఆ తరువాత కణ్ణన్ చెయిబట్టాలని అల్లి విధి కాబోలు! అవును! నది అన్నది ఎన్ని చోట్ల, ఎన్ని దిశలు మారినా, ఆఖరికి, తన బాధ్యతలన్నీ పూర్తవగానే, సముద్రంనే కలుసుకుంటుంది; అలాగే అల్లికూడా! అల్లి కణ్ణన్ కోసమే జన్మమెత్తింది, కాని రహమాన్ పాపవిముక్తికోసం దేవుడి పన్నిన పథకం ప్రకారం

పన్నెండు సంవత్సరాలు ఒక తురకవాడి సంరక్షణలో పెరిగి ఆఖరికి కణ్ణన్ని కలుసుకుంటుంది.

అల్లా దయవలనో, కృపవలనో తను పూనుకున్న ఘోర పాపంనుంచి రహమాన్ తప్పుకున్నాడు. అల్లా కోరికని తన కోరికగా ఎంచుకొని ధైర్యంగా, ఉత్సాహంతో, ఇక తన బాధ్యతని నెరవేర్చాలి! అదే ముఖ్యం, మరేం విచారం లేదు! అల్లినీ, కణ్ణన్నీ ముడిపెట్టిన తరువాత తనూ వాళ్ళతో ఉండవచ్చు! అదే అల్లి అవాళ తనకి చెప్పింది! కణ్ణన్ కూడా అదే చెప్పువుంటాడు. . .

ఉత్సాహంతో రహమాన్ మంచంనుంచి లేచాడు.

"అల్లి, ఆ టపా కవరూ, కాగితం తీసుకు రామ్మా!" అని అంటూ దీపం వత్తిని సర్దుకుంటూ రహమాన్ కలంతో కూర్చున్నాడు.

"బాబా, రాత్రి ఐపోయిందే? ఎలాగా రేపు టపాలో ఈ ఉత్తరం వెళ్ళదు . . . మీరు మధ్యాహ్నం రాసివుంటే . . ." అని అంటూ అల్లి వచ్చింది.

"నాకేమిటో తలనొప్పి వచ్చేసిందమ్మా! లేకపోతే రాసివుండనా? సరే, ఇప్పుడు రాసేస్తాను!" అని రహమాన్ నవ్వాడు. "నీకు సిగ్గుగా ఉంటే నేనే వెళ్తాను."

సిగ్గు ఆవరించుకున్నా దాన్ని దాచుకుంటూ అల్లి "బాబా, నాకెందుకు సిగ్గు? ఉండు, నేనే తెస్తాను," అని లోపలికి వెళ్ళింది.

తళుక్కుమని మెరిసే మొహంతో, ఆనందంతో గెంతులేస్తూ పరుగెత్తిన అమ్మాయిని రహమాన్ రెప్పవాల్చకుండా చూసాడు. ఆ చూపులో ఒక దివ్య కణం తన్ను తాకినట్టనిపించింది: ఇప్పుడు తన ప్రపంచమంతా అల్లి స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ తన ఆధీనంలో అల్లి ఉందని గర్వపడే మనసు, "అల్లి, అల్లి, నువ్వు హిందువుగా పుట్టావమ్మా! నువ్వొక హిందువుని పెళ్ళాడడం ఆక్షేపించి, నీ భవిష్యత్తుని పాడు చెయ్యడానికి నేను పూనుకున్నాను. అది ఎంత ఘోరమైన పాపం! నీ జన్మహక్కుని ఎదిరించడానికి నేనెవరు?" అని వల్లించింది.

అల్లి తీసుకువచ్చిన కాగితంలో రహమాన్ "మీ వివాహం ఇక రాబోయే ఆదర్శ మతాంతర వివాహాలకి ఒక మార్గదర్శకంగా మెలగాలని నా ఆశ!" అని రాసాడు.

ప్రేమ, భక్కి, ఆహ్లాదం - ఇవన్నీ ఒకేసారి అల్లి మనసుని ఆవరించుకున్నాయి. "నా బాబా! నా బాబా!" అని అల్లి వల్లించుకుంటుంటే 'ఎదిరించడానికి నేనెవరు?'

అని రహమాన్ అడిగిన ప్రశ్న అతని చెవుల్లో ఇంకా మ్రోగుతూనే ఉంది. ఆ కారణాలన్నీ అతను పూర్తిగా గ్రహించాడా?

*********

**మూలం: ప్రచురణ: స్వదేశమిత్రన్, నవంబర్ 2,9,16,23, 1947 సంచికలు)**


விந்தியா

# ఒక మాట

"అదేంటో, అత్తగారు లేని కుటుంబం అని చూసి చూసి నాకు పెళ్లిచేసారు, కాని ఏం లాభం! ఒక పక్క రిటైరయి, నిశ్చింతగా ఉన్న మామగారు; ఇంకోపక్క అల్లరి చేస్తున్న పిల్లలు. వాళ్ళకని పొద్దున్నే టిఫను, పాలు అమర్చి, బట్టలు తొడిగి, బడికి పంపించడానికే నాకు టైము సరిపోతోంది! మీకు నేనింకా ఒక 'ఇల్లాలు' గానే కనిపిస్తున్నాను, నా బాధ మీకు అర్థం కాదు! ఈ ఇంట్లో ముచ్చటగా ఒక చిన్న కాపురం చేద్దామంటే అదీ వీలుకాదు!"

"పద్మా, పిల్లలమీద నింద మోపవద్దు! మా అమ్మ నలుకువతో మంచమెక్కిన రోజులనుంచీ నేను వాళ్ళని పెంచుకొనివచ్చాను. ఇప్పుడు నాకు నా ఉద్యోగం చూసుకోనే నిర్బంధం వచ్చేసింది. అందువలనే పిల్లల్ని చూసుకోడానికి టైము చాలకుండా ఉంది."

"అవునులెండి! . . . మరి, నన్ను కని పెంచినవాళ్ళకి ఎలావుంటుంది?"

"అదేదో ముందే ఆలోచించిచి పెళ్ళి చెయ్యాలనే బుద్ధి వాళ్ళకి లేదా?"

"మీరేమంటున్నారు? ఆఖరివరకూ నేను మీ బంధువులని మోయాలి, మీరు నా అమ్మా, నాన్నగారిని తోసిపారేయాలి, అవునా? లోకంలో న్యాయమంటే ఇదే కాబోలు!"

పద్మా ఇంకా మాటాడుతూనే ఉంది. 'సరేలే, నీ వాగుడు సాగనీ, నాకేం పోయింది?' అనే ధోరణిలో ఆమె భర్త ఆఫీసుకి బయలుదేరాడు.

ఇంటి నడిమిలో ఎంగిలి తావులని శుభ్రపరుస్తున్న పద్మకి భర్త ఉపేక్ష కొరడా దెబ్బలాగ కొట్టింది.

ఇంత తీవ్రమైన జగడం ఇంతకుముందు ఈ దంపతులమధ్య చోటుచేసుకోలేదు. పద్మ మంచి పిల్ల, భర్తా మంచివాడే; కాని ఇటీవల వాళ్ళమధ్య ఈ చిన్న కొట్లాట జరుగుతోంది.

పొరుగింట్లో రాజం, ఆమె భర్తతో చేసే కాపురంలాగ తన కాపురం లేదని పద్మ బాధపడుతోంది. తనకలా నిరాశ కలగడానికి న్యాయముందని ఆమె నమ్ముతోంది. మామూలుగా పద్మని ఆమె భర్త కోపగించుకోడు. ఐనా వల్లకానిది గురించి ఆమె

పదే పదే గొణుకుతుంటే ఎవరికి లాభం? ఆ జ్ఞానం తన భార్యకి లేదనే అతను ఆ రోజు విసుగ్గున్నాడు.

తన తల్లి పోయిన తరువాత గతిలేని తన తండ్రినీ, పిల్లలనీ పోషించే బాధ్యత తన భార్యకే కదా? అది పద్మ మరిచిపోతే ఎలాగ? సాధ్యమైనంతవరకూ ఇన్నిరోజులవరకూ తను తన బాధ్యతలు పూర్తిగా నెరవేర్చడం జరిగింది. ఇక భర్తకి ఉద్యోగం కుదిరిన తరువాత ఆ పని తన భార్య పూనుకోవద్దూ? ఆ ఆలోచనే ఆమెకు లేదనిపిస్తుందే? 'అత్తగారింటికి వచ్చి ఏడు మాసాలే అయ్యాయి; ఇంతలోనే ఎంత ద్వేషం!' అని అతను వాపోయాడు.

** ** **

చాలా సమయం వరకూ పద్మ భర్త ఉదాసీనత మరవలేక బాధ పడింది. ఆ తరువాత తన స్నేహితురాలు సీత రాకతో ఆ బాధ పూర్తిగా మరిచిపోయింది.

ఇద్దరూ ఏవేవో కబుర్లు పంచుకున్నారు. "సీతా, ఏమైంది నీకు? నువ్వు బాగా చిక్కిపోయావే?" అని పద్మ అడిగింది.

"నాకేం, నేను బాగానే ఉన్నాను . . . మా అయనకే అస్వస్థతగా ఉంది. రెండు మాసాలు అతన్ని ఆసుపత్రిలో చేర్చాం. ఎన్నిరోజులని అక్కడ ఉండడం సాధ్యం? ఇంటికి వచ్చిన తరువాతకూడా అతను పూర్తిగా కోలుకోలేదు. నేను పడుతున్న బాధంతా అతనిగురించే! రాత్రులు నిద్రపోకుండా అతనికి అన్నివిధాలా సేవ చెయ్యడమే నాకు తృప్తిగా ఉంది. అందువలనే నా ఒళ్ళు కొంచెం చిక్కినట్టు నీకు కనిపిస్తోంది."

సీత తనకలాగ వివరించి చెప్పిన మాటలూ, ఆమె స్వరూపం ఆ రోజంతా పద్మ మనసుని ఆక్రమించుకున్నాయి: తన కన్నులకి కనిపించిన ఆ బక్కచిక్కిన దేహంతోబాటు సీత పలికిన దీనమైన మాటలుకూడా పద్మ చెవుల్లో మ్రోగుతూనేవున్నాయి. ఎటువంటి ఘనమైన సేవ సీత చేస్తోంది! దాన్ని ఎంత అభిమానం, గర్వంతో తనకి చెప్తోంది!

ఆ మరుదినం "పద్మా, చూసావా ఇది? మా అమ్మాయి సరసు రాసిన ఉత్తరం!" అని అంటూ పొరుగింటి ముత్తైదువ అమ్మాళు మామి వచ్చారు.

పద్మ ఉత్తరం అందుకొని చదివింది:



"రోజంతా నేను చేసేది చాకిరీ అనే చెప్పాలి. అత్తగారు జబ్బులో ఉన్నారు. ఆడపడుచులు ముగ్గురున్నారు కాని వాళ్ళెవరికీ బాధ్యత వహించాలనో, సాయం చేయాలనో ఉద్దేశం రవంతైనా లేదు. ఇంటిలో పనిమనిషి లేదు. ఇంటి పనులన్నీ నేనే చేస్తున్నాను. కాని నాకది తృప్తిగా ఉంది. అలసట అంటూ ఏమీ లేదు. ఇంట్లో ఇంతమంది ఉన్నాకూడా నాకున్న బాధ్యతగురించి నాకు గర్వంగా ఉంది. నువ్వు నాగురించి ఆయాసపడవద్దు."

ఉత్తరంలో ఈ భాగం చదివి పద్మ మనసు కరిగింది. "పాపం, అమ్మాయి చాలా బాధ పడుతోంది!" అని మాత్రం అంది.

ఆమె మనసులో రెండురోజులవరకూ అమ్మాళు మామి, సరసు స్థిరంగా నిలిచిపోయారు.

నాలుగైదు రోజులు గడిచాయి. తన తల్లికి ఉత్తరం రాసి చాలా రోజులయ్యాయని పద్మ గుర్తుచేసుకుంది. తన మనసు పడుతున్న ఆరాటమంతా ఒలకబోసి తల్లికి వివరంగా ఒక ఉత్తరం రాయాలని నాలుగు రోజులుగా ఆలోచిస్తున్న పద్మ చివరికి ఒక రోజు ఆ పనికి సిద్ధమైంది; కాని కాగితం, కలంతో కూర్చున్నవెంటనే ఏం రాయాలో తెలియక మనసు కలవరపడింది.

ఆఖరికి పద్మ ఆ ఉత్తరం రాసే ఉద్దేశం వదులుకుంది. దానికి బదులు వినోదంకని తిరుచ్చిలోనున్న తన స్నేహితురాలు లక్ష్మికి ఒక ఉత్తరం రాసింది; ఐదు రోజులతరువాత లక్ష్మినుంచి జవాబు వచ్చింది.

"మా అత్తగారు మేలిమి బంగారంలాంటివారు. మధ్యాహ్నభోజనం ఆవిడే వండుతారు, ఆవిడే అందరికీ వడ్డిస్తారు. ఆవిడ ఏనాడూ నాకు ఆ బాధ్యత ఇవ్వనేలేదు. అందరూ అంటున్నట్టు నేను నిజంగా అదృష్టవంతురాలుని. మా ఆయనకీ, మా అత్తగారికీ నేనంటే చాలా ప్రేమ.

కాని, నా మనసులో ఉన్న ఒక కొరత చెప్తాను, విను. నా ఇద్దరి ఆడపడుచులూ నామీద ఎప్పుడూ అధికారం చెలాయించుతుంటారు. నేనే అన్ని పనులూ చెయ్యాలి: వాళ్ళ స్నానంకి వేడినీళ్ళు పెట్టాలి; స్నానం తరువాత తొడుక్కోడానికి వాళ్ళకి బట్టలు అందించాలి; పాతబట్టలు ఉతికి, ఎండలో ఆరబెట్టి, మడిచిబెట్టాలి; అంతేకాదు, వాళ్ళ చంటిపిల్లలకి నేనే స్నానం చేయించాలి,

సింగారించాలి. ఉదయమంతా వాళ్ళ సేవకంలోనే నాకు సరిపోతుంది. తక్కిన పనులన్నీ నా సొంత పనులు. మా అత్తగారికి ఏ సాయమూ చెయ్యలేను. నా సమయమంతా నా ఆడపడచుల ఆజ్ఞలకే తరిగిపోతోంది అని తెలియని ఇరుగుపొరుగువారు, 'చూసారా, ఈ అమ్మాయి ఎంత అదృష్టవంతురాలో? ఇంటిపనులన్నీ అత్తగారే చూసుకుంటున్నారు. రాత్రివేళ కోడలు సీదాసాదా వంట చేస్తే చాలు!' అని అంటున్నారు; అది వింటే నాకు కటువుగా ఉంది.

ఆడపడుచుల ఆజ్ఞలు, రోజువారి పనుల తరువాత నాకు ఏదైనా చదవడానికి, పాటలు పాడడానికి సాధ్యం కాదు. దానితోబాటు వంటగదిలో అత్తగారికి సాయంగా ఎదైనా నూఱుదాం, రుబ్బుదాం అంటే అదీ వీలుకాదు! 'వయసు మళ్ళినవారికి సేవ చెయ్యకుండా ఎవరికెవరికో సేవ చేస్తున్నాను!' అనే నా కొరత ఇతరులకి తెలియదే? "నువ్వెలాగమ్మా అందరికీ సేవ చెయ్యగలవు? వాళ్ళని తృప్తి చెయ్. నేనేం నిన్ను తప్పుపెట్టను," అని అంటున్న మా అత్తగారికే అది తెలుసు!"

పద్మకి ఎలాగో అనిపించింది. కళ్ళనుంచి రెండు కన్నీటిబొట్టులు రాలాయి. వెంటనే వడి వడిగా ఏదో రాసింది. సాయంకాలం భర్త ఆఫీసునుంచి రాగానే దాన్ని అతనికి అందించి "దీన్ని చదవండి!" అని చెప్పి అక్కడనుంచి జారుకుంది.

మరేం అనకుండా అతనూ చదవసాగాడు; అది ఇలాగ ఆరంభమైంది:

"భర్తకనే రాత్రీ పగలూ సేవ చేసి సీత దేహమూ, మనసూ నష్టపడిపోయాయి;

ముఖ్యమైన అధికారం, అర్హత ఇతరులవశం ఉన్నా, ఇంటి పనులన్నిటికీ పూర్తిగా తనే బాధ్యత వహించి, 'నేను ఈ ఇంటికి రాణి!' అని గర్వపడుతూ సరసు ఓర్పుతో రోజులు గడుపుతోంది;

ఉరిలో అందరి కళ్ళకీ అదృష్టవంతురాలుగా కనిపించే లక్ష్మి - ఇదిగో, కుండలో దీపంలాగ వెలుగుతోంది;

మరి, నా సంగతో? అందరి దృష్టిలో నేనొక యజమానిగా శోభిస్తున్నాను. 'ఈ అమ్మాయి ఎంత చక్కగా ఇంటిపనులన్నీ చేస్తోంది!' అని అందరూ నన్ను పొగడుతున్నారు. ఈ ఇంట్లో స్వేచ్ఛగా అధికారం చెలాయిస్తున్న నాకు ఆ ముగ్గురూ పడే కష్టంలో సహస్రాంశం కూడా లేదు.

"నేను మీ మనసుని నొప్పించాను; క్షమించండి." అని అందులో రాసివుంది.



ఉత్తరం చదివిన తరువాత రాజు పద్మని పిలిచాడు. "నువ్వెప్పుడు ఈ ఇంట్లో రాణివే కదా?" అని అన్నాడు.


"అలాగేం కాదు. నేనొక ఒక మంచి ఇల్లాలు. ఐతే అప్పుడప్పుడు దుర్బుద్ధికూడా నాలో లేచి అల్లరి చేయాలనిపిస్తుంది. అందుకే పెద్దలు అన్నారు, 'ఒక మంచి ఎద్దుకొక వాత!, 'ఒక మంచి గొడ్డుకొక మంచి దెబ్బ!' అని. ఒక మంచి అమ్మాయికొక మంచి మాట! అవునా?"

"నువ్వూ ఎంత త్వరలో నీ తప్పు దిద్దుకున్నావ్? Wonderful!" అని రాజు నవ్వుతూ భార్యని మెచ్చుకున్నాడు.

"ఒక మంచి ఎద్దుకొక వాత! ఐతే నన్ను మూడు వాతలు కాపాడాయి!" అని పద్మ అన్న మాటల్లోని గూఢార్ధం రాజుకి బోధపడలేదు, కాని అతనూ నవ్వేసాడు.

********

**(మూలం ప్రచురణ: పెళ్లిమణి, అక్టోబర్ 3, 1947)**



# తప్పు ఎవరిది?

మధ్యాహ్నం మండుటెండ; ఎవరో తలుపు తట్టారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారందరికీ కష్టంగానూ, చిరాకుగానూ ఉంది; కాని తలుపు తెరిచి, కబురు అందుకొన్నవెంటనే సంతోషం కలిగింది.

"పాపం, ఎండలో నిలుచున్నావ్! . . . సరే . . . నేను వస్తానని చెప్పు . . . నువ్విక వెళ్ళు . . . " అని రాజమయ్యర్ వచ్చినతనికి సందేశం తెలియజేసారు. అతని స్నేహితుడి ఇంటిలో ఆ సాయంకాలం ఒక పాట కచేరీ జరుగబోతోంది.

పడకకుర్చీలో వాలుతున్న గణేశన్ "ఈ కచేరీ చాలా బాగుంటుంది; ఇతని వయలిన్ solo performance అందరూ పొగడుతారు," అన్నాడు.

అతని భార్య భామా, వదిన లక్ష్మి- తోడికోడళ్ళు - పక్క గదిలోనుంచి తొంగి చూసారు. 'మనమూ వెళ్తామా?' అని ఒకరినొకరు తమకు తామే అడుక్కున్నారు.

రాజమయ్యర్ ఇద్దరినీ చూసారు: "మీరు సరిగ్గా ఐదుగంటలకి బయలుదేరండి. నేను కొంచెం ఆలస్యంగా వస్తాను. నేను తిరిగివచ్చినప్పుడు మీరు నాతో రావచ్చు. ఈ ఫ్రెండుతో మనకి మంచి పరిచయం ఉంది. మనం తప్పకుండా వెళ్ళాలి," అన్నారు.

ఒక నెలరోజులుగా బయటకి వెళ్ళకుండా చికాకు పడుతున్న తోడికోడళ్ళు అతని మాటలు విని సంతోషించారు.

"వదినా, ఇవాళ నేను మడిసారు[1] కట్టుకుంటాను. వెళ్ళి అక్కడ కూర్చొని మనం పాట వినాలి, అంతేకదా? కాలుతప్పిపడిపోతామనే భయం లేదు! . . . " అని భామా తను ధరించబోయే చీర, నగల గురించి ఆలోచించింది.

"ఇంకా బోలెడు టైముందిలే . . . ముందు నువ్వు కొంచెం రెస్టు తీసుకో!" అని లక్ష్మి నవ్వింది. బయటకి వెళ్ళినప్పుడు ఏదో ఒక చీరని లెక్క చెయ్యకుండా ఎంచుకొనే ఆమెకి నవ్వు రాదా?

---

[1] తమిళ స్త్రీల చీరకట్టు. తొమ్మిదిగజాల చీరని రెండు కాళ్ళమధ్యనుంచి తిప్పుతూ కట్టుతారు.

ఆఖరికి సాయంకాలం 4.45 కి ఒక క్రేప్ సిల్కు చీరని మడిసారుగా కట్టుకొని లక్ష్మి సిద్ధమవగానే భామా ఆమెను వింతగా చూసింది. 'మడిసారు కట్టుకి పట్టుచీరలే సరిపోతాయని అనుకున్నాను. కాని రోజూవారీ అలవాటు చేసుకుంటే ఏ చీరైనా బాగానే ఉంటుంది,'' అని గుర్తుచేసుకుంది. వేరే చీర కట్టుకుందామని ఆలోచించింది, కాని మామగారు 'ఆలస్యం అవుతోంది,' అని తొందర పడతారని ఊరుకుంది.

''నీ చీరకట్టు బాగుంది!'' అని భర్త శ్లాఘించిన తరువాత భామా తృప్తితో బయలుదేరింది. '' సరే, వస్తాం, ఎనిమిది గంటలకి తిరిగి వచ్చేస్తాం!'' ఇని గణేశన్ దగ్గర భామా, లక్ష్మి చెప్పుకున్నారు. పిల్లలు పొరుగింటి ఉత్తరదేశ స్నేహితుడింటికి పంపించేసారు. అత్తగారు ''మరేం చింతా వద్దు. వెళ్ళి కచేరీ విని ఆనందించండి,'' అని సాగనంపారు. ''త్వరగా వెళ్ళండి; ఆ తరువాత హాలులో జాగా దొరకదు!'' అని గణేశన్ తొందరపెట్టాడు.

ఇంతకీ వాళ్ళు ఆ ఇల్లు చేరుకున్నప్పుడు ఒకరో ఇద్దరో మాత్రం కనిపించారు. ఆ ఇంటి యజమాని అకిలాంబాళ్ ఇద్దరికీ స్వాగతం చెప్పారు. "అదిగో, చూసారా, అక్కడ కూర్చొనివున్నారే, అతనే ఇవాళ ప్రోగ్రాంలోని వయలిన్ విద్వాంసుడు; మాకు ఆయనతో మంచి పరిచయముంది. మేం అడగ్గానే కచేరీకి సరేనన్నారు. మనకి తెలిసిన నలుగురు వచ్చి వినాలని మా ఆశ!" అని ఆవిడ అన్నారు.

"మా అదృష్టం!" అని భామా అనగానే అకిలాంబాళ్ ఆమెని తేఱిచూసారు. ఆ తరువాత లక్ష్మితో "నీ తోడికోడలుతో వచ్చావ్; మరి మీ ఆయనా, నీ మామగారు వస్తారుకదూ?" అని అడిగారు.

"మామగారు వస్తారు. మా ఆయన camp కి వెళ్లారు; ఊరులో ఉన్నా అతనికి పాట కచేరీలంటే మోజు లేదు!"

"ఓ, అలాగా?" అని ఆశ్చర్యపడుతూ అకిలాంబాళ్ నవ్వారు; ఇంతలో మరికొందరు స్త్రీలు రావడం చూసి వాళ్ళకి స్వాగతం చెప్పాలని వెళ్ళారు.

భామా తోడికోడలు భుజంమీద ఆనుకొని నవ్వుతూ చెప్పింది: "మా ఆయనకి మాత్రం సంగీతం అంటే చాలా ఇష్టం; రాత్రి పదకొండు గంటలవరకూ National Program వింటారు.'' ఆ మాటలు నోటిలో ఆలపించుతున్నప్పుడు ఆమె


இருவர் கனவு
"விந்தியா"
ரமணி

కంఠధ్వనిలో ఒక నీరసం - వాద్యంలో శ్రుతి తప్పినట్టు - చోటుచేసుకుంది. ఎదుట హాలులో ఒక మూల విద్వాంసుడు వయలిన్ పెట్టెని తడముకుంటూ పక్కనేవున్నవారితో మాటాడుతూ కనిపించారు. వాచీని చూసుకొని "ఇంకా పది నిమిషాలు పోనీ!" అని అతను అతనడమూ ఆమె వింది.

"వదినా!" అని పిలిచింది; లక్ష్మి ఎవరితోనో మాటాడుతోంది. భామా తటాలున లేచింది; బిడియంతో మడిసారు చీరకట్టుని సర్దుకొని పక్కనేవున్న ఒక ద్వారం తెరుచుకొని ఒక గదిలో ప్రవేశించింది.

ఆ గదిలోవున్న ఒక కిటికీద్వారా భామా అకిలాంబాళ్ని సైగచేసి పిలిచింది. ఆవిడ రాగానే, తొందరపడుతూ "మామీ, నాకొక paper, pen ఇస్తారా? ఇవాళ మధ్యాహ్నం మా ఇంటికి కబురు అందించిన మనిషి ఉన్నాడా? మా ఆయన్ని రమ్మని ఒక చీటీ పంపాలనుకుంటున్నాను" అని అంది. "దానికేం, ఇదిగో, నువ్వు రాయి. నేను వెంటనే పంపుతానులే," అని ఆవిడ ఒక paper, pen అందించారు.

"మూడు గంటలు మీరు సంగీతం విని ఆనందించవచ్చు, వెంటనే బయలుదేరి రండి! అక్కడ ఇంట్లో కూర్చొనివుండడానికి బదులు ఇక్కడ వచ్చి కూర్చోండి. ఇంకా ఐదు నిమిషాల్లో కచేరీ ఆరంభమవబోతోంది!" అని భామా తొందరగా రాసింది.

చీర సందడి విని భామా వెనక్కి తిరిగిచూసింది. లక్ష్మి "ఎక్కడికి వెళ్ళావ్?" అని అడిగింది.

"మా ఆయన్ని రమ్మని పిలిచాను; అతను మంచి కచేరీలు వినడం చాలా అరుదు. ఇక్కడ కూర్చొని వినడం సులభం, రావొచ్చుకదా?"

"అవును. పాపం, అతను రానీ," అని లక్ష్మి అంది. కాని ఆమె శ్రద్ధ అంతా కచేరీకి సిద్ధం చేస్తున్న ఏర్పాట్లమీదే ఉంది. ఒకప్పుడు ఆమెకూడా వయలిన్ నేర్చుకోవాలని ఆశించింది; కాని గాత్రసంగీతంతో ఆవిడ అభ్యాసం ఆపేసారు.

రాజమయ్యరు చేతికర్రతో, కంఠంని బాగా చుట్టుకున్న ముసుకుతో, చిరునవ్వుతో ప్రవేశించారు. వేళతప్పక అతను వచ్చారని సంతోషిస్తూ ఆ ఇంటి యజమాని అతనికి స్వాగతం చెప్పి అతని పక్కనే కూర్చున్నారు.

విద్వాంసుడు తన వాద్యంని ఛాతీతో హత్తుకున్నారు. మృదువుగా స్వరం వినిపించినట్టు రెండుసార్లు విల్లుని తీగలమధ్య పోనిచ్చారు. తనచుట్టూ గుమిగూడియున్న గుంపుని చురుకుగా ఒక సారి చూసి తన కళా నైపుణ్యం చూపించడానికి సిద్ధమైయ్యారు. ఈ ప్రారంభ దృశ్యం తన భర్త చూడలేదని భామా బాధపడింది.

‘‘వదినా, ఇప్పుడే అతను నా చీటీ చదివివుంటారు; వర్ణం అంతమవగానే వచ్చేస్తారు.’’

‘అవును’ అన్నట్టు లక్ష్మి తలూపింది. ఉల్లాసంతో నాట్యమాడుతున్నట్టు నాటకురింజీ రాగంలో వర్ణం, ఘున ఘున మోతలతో పారవశ్యం చేసి, ముగిసింది.

భామా ప్రవేశ ద్వారం చూసింది. ఎవరెవరో వస్తున్నారు, వచ్చి కూర్చుంటున్నారు.

విఘ్నేశ్వరుని ప్రార్ధన ‘వాతాపి గణపతిం భజే’ వినేవారి చెవుల్లో భక్తరసం ఒలకబోసింది.

భామా తన మామగారిని చూసింది. అతను కన్నులు సగం మూసుకొని పాటని విని ఆనందిస్తున్నారు. ‘అతనే తన అబ్బాయిని తనవెంట రమ్మని చెప్పివుంటే ఎంత బాగున్ను!’ అని భామా ఆలోచించింది.

‘‘వదినా, వయలిన్ చాలా బాగుంది.’’

‘‘అవును.’’

‘‘రాగమూ అలాంటిదే! కుతూహలం.’’

‘‘వదినా, నా చీటీ చూడగానే అతను వచ్చివుంటే అతనూ ఇది వినివుంటారు! అప్పుడే మూడుపాటలైపోయాయ్.’’

‘‘ఇంకా టైముంది . . . ’’

ఎవరైనా తమ సంభాషణని ఆక్షేపిస్తున్నారో అని భామా ఒక క్షణం ఆగి, చుట్టుపక్కలా చూసింది; దూరంలో అకిలాంబాళ్ కనిపించారు. అప్పుడే 'నా చీటీ తీసుకొనివెళ్ళడానికి ఆవిడకి మనిషి దొరికాడో లేదో?' అనే అనుమానం కలిగింది.

పెదవులు బిగించుకొని, భామా 'అతను రాలేదు!' అని ఆవిడకి ప్రకటన చేస్తూ చెయితోనూ సైగ చేసింది. కాని అకిలాంబాళ్ ఆ చేష్ట గమనించక వేరే పనిమీద త్వరగా ఎక్కడికో వెళ్ళిపోయారు.

తన సూచన వ్యర్థమని సిగ్గుపడుతూ, తల వొంచి భామా "చూసారా వదినా, అతను రాలేదు!" అని అంది.

"ఔను."

"బండి పిలవడానికి ఎవరూ లేకపోయినా నడిచి రావచ్చుగా? ఇదేం ఎక్కువ దూరం కాదే?"

"ఔను."

"బండిలో ఎక్కి రావడంకి బదులు మెల్లగా నడుచుకొని రావడం మంచిది. అవునా?"

"వస్తారు. ఎక్కువగా ఆలస్యం అవలేదు."

"వదినా, ఇప్పుడు వస్తేనే మంచిది."

"అవును."

భామా మళ్ళీ ప్రవేశద్వారం చూసింది. అకిలంబాళ్ అక్కడ నిలబడివున్నారు. వెళ్ళి ఆవిడని అడుగుదామంటే ఇవాళకని ఈ చీరకట్టు ఇబ్బందిగా ఉందే? కాలు జారి తను పడితే ఏంకాను? ఇంతమంది చూస్తున్నారే?

విద్వాంసుడు శంకరాభరణంలో ఏదో పాట వాయించుతున్నారు. భామా మనసులో ఆమెను ఆవరించుకున్న ఆ కంగారులో 'ఇదేదో మనకి తెలిసిన రాగం' అనే భావన మాత్రం లేచింది; కాని మరేం స్పష్టత, శ్రద్ధ చోటుచేసుకోలేదు.

"ఇక అతను వస్తారా, వదినా? బాగా ఆలస్యం ఐపోయింది. నాన్నగారు ఇష్టపడరని ఆలోచించారేమో?"

"ఏమో? అలాగే కాబోలు . . . "

భామా మామగారిపక్క తన దృష్టి మళ్ళించింది. కోడళ్ళు సభలో మాటాడుతున్నారని చిరాకు పడుతున్నట్టు అతను కనిపించారు. భామా వెంటనే తనేదో రాగ చర్చ చేస్తున్నట్టు మొహం మార్చుకుంది. బయట చీకటి బాగా కప్పేసింది. ఇక తన భర్త రారనిపించింది. ఇంతసేపూ అతను తప్పక వస్తారని నమ్మింది. "సరే, రారు, ఇక రారు!" అనే ఆలోచన వచ్చినతరువాత "ఎందుకు రాలేదు?" అని తనలో అడుక్కుంది.

"వదినా, వారం రోజులుగా అతను ఈ పరసరాలకి వాకింగ్ వస్తున్నారే? ఇదేం ఎక్కువదూరంలో లేదే?"

"అవును. నిజం."

"వదినా, ఇక వస్తే అతనికి జాగాకూడా దొరకదు!'

అప్పుడే కొంతమంది లోపలికి వస్తున్నారు. సంగీత కచేరీలో వెనుకటి భాగమే బాగుంటుంది అని ఈ అభిమానుల ఉద్దేశం. వీళ్ళలాగే గణేశన్ కూడా వస్తే? . . . వస్తే, కూర్చోడానికి జాగా ఎక్కడ?

"అబ్బా, నాయనా!" అని ఎవరో ఆయాసంతో మూల్గుతున్నారని భామా తిరిగి చూసింది. పక్కనే గోడమీద ఆనుకొనివున్న ఒక గర్భవతి తన ఒడిలోవున్న పాపని నేలమీద పెట్టి, కాలు మార్చుకొని, మళ్ళీ పాపని ఒడిలోకి తీసుకుంది.

తటాలున భామా "వదినా, అతను వచ్చినా నేలమీద కూర్చోవాలేమో?" అని అడిగింది.

"చూసావా, అందుకే అతను రాలేదు. కారణముంది." 'నిండు సభలో మాటాడకూడదు, టూకీగాకూడా ఏమీ అనకూడదు' అనే ఉద్దేశం లక్ష్మికి ఉన్నా ఇప్పుడు కారణమేమిటే కనిపెట్టిన ఉత్సాహంలో ఆమె కంఠం పెద్దగా వినిపించింది. చటుక్కున ఇద్దరు ముగ్గురు మొహం ముడుచుకోడం చూసి లక్ష్మి తన తప్పు తెలుసుకుంది. మనసులో మాత్రం కోపం - నీరులో పడిన సున్నం తునుకలాగ మండింది. 'ఇంతసేపూ భామా సతాయించినప్పుడు ఎవరూ ఆక్షేపించలేదు; ఇప్పుడు నేను పొరబాటున ఒక క్షణం మాటాడితే అందరూ నివ్వెఱపోయి చూస్తున్నారు! ఔను, నాది కంచు కంఠం! మంచి సంగీత శిక్షణ, అభ్యాసంతో నేనది సంపాదించుకున్నాను . . . నా గంభీరమైన కంఠం వింటే ఈ సభలో అందరూ

పరవశమౌతారు!   కాని నాకూ భాగ్యం లేదు!" అని అంతరాత్మలో తన గతకాల జ్ఞాపకాలు తలపోసుకుంది లక్ష్మి.

"వదినా, అతనుగాని వస్తే? . . . చాప వేసి కూర్చోడానికి జాగా లేదంటే బయట ఒక కుర్చీ వెయ్యవచ్చుకదా?"

"ఔను . . . ఔను."

"పెద్దలందరూ కింద కూర్చున్నప్పుడు అతను మాత్రం కుర్చీలో కూర్చోరు! అతనిక రావొద్దు . . .  అదే మంచిది."

"అతనిక రారు! నీకెందుకు ఆరాటం? నువ్వైనా పాట విను!" అని శ్రమతో తన నోరు మూసుకొని లక్ష్మి భామా నోరుకూడా మూసేసింది.

భామా ఊరుకుంది కాని మనసులో తనకి తానే చెప్పుకుంది: 'ఆడ బుద్ధి అంటే పిచ్చి బుద్ధి! మంచి వేళ, నేను రమ్మని పిలిచానని అతను రాలేదు! మంచిదైంది. ఇవాళ కచేరీలో విద్వాంసుడు వాయించిన కాపీ, మోహన రాగ కీర్తనలంటే ఆయనకి చాలా ఇష్టం! అతను వినివుంటే తప్పక ఆనందించివుంటారు! కాని, అతను రాకపోవడం మంచిదే! . . . "

మిత్రుడనే స్నేహభావంతో చేసిన కచేరీ అనే కారణంవలన విద్వాంసుడు మంగళం పాడకుండానే కచేరీ ముగించేసారు. చివరికి  రెండు మూడు చిన్నపాటలు వాయించిన తరువాత "మీకెవరికీ మంగళం వినడానికి ఓపిక లేదు - లేచిపోతారని నాకు తెలుసు. ఇప్పుడు నేను వాయించబోయే ఈ ఆఖరి పాటకి అందరూ నిలబడవలసిందే! . . . నేను మాత్రం కూర్చుంటాను, క్షమించాలి . . . !" అని అంటూ  అతను జాతీయగీతం 'జనగణమన' వాయించారు; అందరూ నిలబడ్డారు.

"మంచిపని చేసారు!" అని లక్ష్మి అభినందించింది.

భామా ఈ ఆఖరి అంశం తన భర్త విని ఆనందించలేదని బాధ పడింది.

"మీ ఆయన వచ్చారామ్మా?" అని అకిలాంబాళ్ జ్ఞాపకం ఉంచుకొని అడిగారు.

"లేదండి."

"నీకీ కచేరీ విన్నట్టే లేదేమో?" అని ఆవిడ అభిమానంతో అడిగారు.

"అవును, మామీ," అంది లక్ష్మి కొంటెగా. "లేదండీ, అలాగేం కాదు . . .  " అని తడబడుతూ భామా ఏదో చెప్పబోయింది.

అకిలాంబాళ్ దగ్గర శెలవు పుచ్చుకొని, మెట్లు దిగి, ఇద్దరూ కాలిబాటలో నడిచి వచ్చినప్పుడు బయట ఒక కారుపక్కన రాజమయ్యర్ వాళ్ళని ఎదురిచూస్తూ కనిపించారు. కారు ముందు సీటులో . . . గణేశన్!

"మీరెప్పుడు వచ్చారు?" అని భామా ఉలిక్కిపడింది. "అవును, వచ్చాను, మత్తెక్కి వచ్చాను!" అని గణేశన్ అరిచాడు. తనేదో నేరం చేసినట్టు భామా మనసు అల్లాడింది. 'ఇప్పుడేం మాటాడకు!' అని లక్ష్మి భామా భుజం నొక్కింది; ఆమె కన్నులు మామగారి మీదే ఉన్నాయి.

"సరే, వెళ్దామా?" అని అడుగుతూ ఒక యువకుడు కారు తలుపు తెరిచాడు.

"హూం, వెళ్దాం . . . బాగుంది, నేను వచ్చిన వేళ! . . . గాత్ర సంగీతమైతే ఇక్కడ బాగా వినబడుతుంది . . . వయలిన్ నాదం ఏం అంత బిగ్గరగా లేదు, మైకూ లేదు! డ్రైవరులాగ నేను ఇంత సేపూ ఇక్కడే కూర్చొనివున్నాను!" అని గణేశన్ విసుగ్గున్నాడు.

"నేనేకదా ఈ కారు డ్రైవరు?నీకెందుకురా సిగ్గు?" అని అడుగుతూ యువకుడు కారు చక్రం పట్టుకున్నాడు.

"ఇది నీ కారు," అన్నాడు, గణేశన్. రాజమయ్యరు కొంచెం నిదానించి మాటాడారు: "వీడికి ఆపరేషనై ఒక నెలకూడా నిండలేదు. అందువలనే ఇప్పుడు ఇలా వచ్చినందుకు సిగ్గుపడుతున్నాడు!"

"వీడి కారు మనింటిని దాటి వచ్చినప్పుడు నాకు గభీమని ఆశ వచ్చేసింది - 'సరే, మనమూ కచేరీ విందాం!', అని. ఇక్కడకి వచ్చిన తరువాతే 'హాలులోకి వెళ్దామా, వొద్దా?' అని ఆలోచించాను. 'నువ్వు కారులోనే ఉండు!' అని చెప్పి వీడు తనేదో పని చూసుకోవాలని వెళ్ళిపోతాడని నాకు తెలీదే?" అని గణేశన్ నొచ్చుకున్నాడు.

సంభాషణ దిశ మార్చాలని రాజమయ్యరు వయలిన్ విద్వాంసుని ప్రదర్శనగురించి విమర్శించారు; మధ్యలో కొందరు స్త్రీల 'వదురుబోతు' మాటలగురించికూడా ప్రస్తావించారు.

కారు వెనుక సీటులో అవన్నీ వింటున్న భామాకి ప్రాణం పోయినట్టనిపించింది; ఏమైనా అనాలని మనసు తహతహలాడింది. 'ఏమీ అనవద్దు!' అని లక్ష్మి మళ్ళీ హెచ్చరిక చేసింది.

'మా ఆడవారి ధోరణి మారనే మారదు! మేం స్త్రీలం, బుద్ధిహీనులం, అజ్ఞానులం, నిత్యమూ వాగుతూంటాం! మాకెప్పుడూ తొందరే! ఇవన్నీ మాకు తెలుసుగా!' అని చీదఱ పడుతూ, ఇల్లు చేరుకున్నవెంటనే భామా కారునుంచి దిగింది.

తిన్నగా అత్తగారిదగ్గరకి వెళ్ళి నిలబడింది. "ఇదిగో, ఎవరో వచ్చి ఈ చీటీ ఇచ్చినప్పుడు గణేశన్ ఇంట్లో లేడు!" అని ఆవిడ దాన్ని అందించారు.

భామా దాన్ని దాచుకొని, గణేశన్ దుస్తులు మార్చుకునే గదికి వెళ్ళి అతనికి ఆ చీటీ అందించకుండానే, కళ్ళకి మాత్రం చూపించి, చదవమని చెప్పి, దాన్నిఅక్కడే చింపేసింది.

"ఓ, అలాగా?" అని గణేశన్ ఆశ్చర్యంతో అడిగాడు; "అవును!" అని చెప్పి భామా నిష్క్రమించింది.

కచేరీ గురించి కబురు వచ్చిన మధ్యాహ్నం నుంచి సాయంత్రంవరకూ అందరూ 'గణేశన్ కచేరీకి వెళ్ళడు, అతన్ని అడగవద్దు' అనే ఆలోచనలోనే ఉన్నారు. 'రణచికిత్స వలన అతనికి నొప్పిగా ఉంది, ఇంటిలోనే ఉండనీ!' అని అందరి మనసులోనూ ఉంది. దాన్ని మరిచిపోవడం ఎలాగ? ఆశ, చంచలం అని వచ్చినప్పుడు కొంచెం అగి అలోచిస్తే ఈ తప్పు జరిగివుండేకాదు; గణేశన్ తన స్నేహితుడి కారు చూడగానే తొందరపడిపోయాడు.

'అతనికి ఇష్టం ఉంటే రానీ' అనే ఆలోచనతోబాటు, ఆమె మనసులో రవంతైనా అశ్రద్ధ, నిర్లక్ష్యం చోటుచేసుకొనివుంటే భామా ఈ మావసిక వ్యధతో అల్లాడిపోవడం జరిగివుండదు. తనూ పాట కచేరీని చెవులకి విందుగా అనుభవించి ఉంటుంది. అలాగ జరగలేదంటే ఆ తప్పుకి భామాపే కారణం.

స్త్రీలకి ఈ విధి తప్పనిసరి అనవచ్చా?

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, జూలై 26, 1956)**


சிறுதாரம்
"விந்தியா"

# ఒక చిన్న పిలుపు

వారం రోజులుగా ఉత్తరాలేవీ రాలేదు. ఆ రోజు వచ్చిన 'కవరు'ని చూడగానే ఉత్సాహంతో తొందరగా దాని అంచుని చింపాను; ఓరని ఊది కవరుని దొర్లించాను. ఒక నాణెం జారి మేజామీద పడింది. అదొక సాయిబాబా నాణెం!

ఆశ్చర్యంతో కవరులోని ఉత్తరం తీసి చదివాను; గోమతి నాతో మాటాడుతోంది:

"ఈ నాణెం గురువారం నీ చెయికి అందినట్టు పంపాలని ఆలోచించాను. కాని తపాలా శాఖని నమ్మలేం, కొంచెం ముందూ, వెనుకా అది నీకు అందవచ్చు. అందుకే ఇవాళ గురువారం మా పూజ గదిలోనుంచి దాన్నితీసి నీకు పంపుతున్నాను. ఇటీవల మేం షిర్డీ వెళ్ళివచ్చిన వివరాలన్నీ మా ఆయన అన్నయ్యకి రాస్తారు."

ఆడపడుచు గోమతి మరికొన్ని చిల్లర కబుర్లుకూడా రాసింది. నేను నా దృష్టిని పూర్తిగా ఆ నాణెంమీద పోనిచ్చాను: ఒక పక్క సాయిబాబా ఆకారం, ఇంకొక పక్క గజలక్ష్మి. వెండి నాణెంలాగ బాగా మెరుస్తోంది. మంగళసూత్రంలో అలంకరించుకోవడానికి ఒక చిన్న కొక్కెం కూడా ఉంది. 'కట్టుకుందామా?' అని నేను కొంచెం ఆలోచించాను కూడా. ఎందుకంటే నాకు సాయిబాబా పట్ల ప్రత్యేకంగా భక్తి, ప్రేమ అని ఏవీ లేవు. అతనొక మహనీయుడనే భావన తప్పిస్తే నా మనసులో మరేం ఆలోచనా లేదు. కాని ఇప్పుడు ఆ నాణెంని చులకన చెయ్యడం నాకిష్టం లేదు. 'సరిగ్గా ఇవాళ గురువారం నాకు ఇది వచ్చిందే!' అని కొంచెం ఆశ్చర్యం కూడా కలిగింది. ఇటీవల రైళ్ళు ప్రయాణాలు ఆలస్యమవడం వలన సోమవారం రావలసినది నాకు గురువారం వచ్చిచేరింది!

'నువ్వు ఈ నాణెం కట్టుకో!' అని గోమతి నాకు సూటిగా రాయలేదు. కాని ఏదో చిన్న పిలుపు అలాగ చెప్తున్నట్టు నాలో నాకే వినిపించింది.

నేను తాలిబొట్టుని భుజంమీద వేసుకొని ముడివిప్పుదామని ప్రయత్నించాను, కాని వెనుకాడాను. ఎదుటనున్న గడియారం చూసాను: గంట ఒకటి. ఇంకా

ముప్పై నిమిషాల్లో వర్షం ఆరంభమౌతుంది. అంతకుముందే కట్టుకుంటే సరిపోతుంది . . .

వర్షం గురించి ఆలోచన రాగానే నా మనసు తారుమారైంది; ఉత్తరం, కవరు, నాణెం అన్నిటినీ అలాగే మరిచిపోయాను. నీరసం నా దేహం, ప్రాణం, మనస్సుని ఆవరించుకుంది; ఉపేక్షతో అలాగే మంచంమీద వాలాను.

గురువారం అంటే చాలు, భయమూ, కోపమూ నా మనసులో చోటుచేసుకుంటాయి. అవును, నా ముద్దుపాప ఒక గురువారం పోయింది. వర్షంలో దాని మృతదేహం తరలించకూడదని దాన్ని అలాగే వదిలేసారే, ఆ ఘోరం నేను మరిచిపోవడం ఎలా సాధ్యం? 'పిల్లలకి జ్వరం రావడం మామూలేకదా?' అని మేం రెండు రోజులు నిబ్బరంతో ఉన్నాం. ఆ తర్వాత రెండు రోజులు ఏమీ చెయ్యలేకపోయాం, ఆఖరికి మోసం పోయాం. ఆ కటువుని మింగడం ఎలాగ?

కాని నా అంతరాత్మలో ఒక చిన్న పిలుపు 'నువ్వు అన్నీ మరిచిపోతున్నావ్! అది నీ మంచికే! అవును మరి, ఎన్నిరోజులని దుఃఖించడం?' అని నన్ను అడుగుతోంది. 'నా పాపని వదిలి ఇక ఎలా బతకగలను?' అని నేను వాపోయిన రోజులు గతించాయి. 'నేనూ మెల్లమెల్లగా నా ముద్దు అమ్మాయిని మరిచిపోతున్నానే!' అని నేను లోలోపల బాధపడుతున్నాను. కొన్నిరోజులు మాతో మెలిగి మాయమైన కూతురు గురించి గుర్తు చేసుకుంటే మనసుకి కొంచెం ఊరటగావుంది.

కాని . . .

గభీమని లేచాను; తర్వాత కొన్ని నిమిషాలలో ఆ సాయిబాబా నాణెం నా మెడలోనున్న పుస్తి కాసులతో కలిసిపోయింది.

కొన్ని నిమిషాలలో నేను నా స్వభావంకి తగినట్టు కమలిలాగ మారిపోయాను. అంటే కూతురుని పోగొట్టుకున్న తల్లిలాగ కాదు,  గోమతి మనసుని ఆరసించే వదినలాగ!

గోమతికే సాయిబాబా భక్తి; ఆమెకే సాయిబాబా శక్తిని పూర్తిగా నమ్మే గుణం. "శ్రీసాయే నాకు దేవుడు. అతనుంటే నాకెందుకు భయం?" అని తరచుగా నాకు చెప్పేది. నేనుకూడా చాలా రోజులు ఆ మాటలు విన్నతరువాత నా ఉద్దేశమేమిటో


ரமணி

ఆమెకి తెలియజేసాను: “నాకేమో మన రాముడు, శివుడు, కృష్ణుడు, అనే పేర్లు వింటేనే దేవుడనిపిస్తోంది!” అని అన్నాను. అది విని గోమతి మనసు బాధపడిందనుకుంటాను; ముఖం ముడుచుకొని నాకు చెప్పింది: “నేను గురువారం రాత్రులు ఉప్పు లేకుండా భోజనం చేస్తాను. కాని అన్నయ్య నేను హల్వా, కేసరి మింగుతున్నాను అని ఎగతాళి చేస్తున్నాడు!” అని మొఱబెట్టుకునేది.

గోమతి అన్నయ్య - మా శ్రీవారు ఉన్నారే - ఇతను ప్రమిదె పంక్తిలో ఒక మైనపు బత్తీలాగ. కొన్ని విషయాలలో నాకు పూర్తిగా విరుద్ధం; ఇతనితో ఇంత కాలం కలిసి మెలిగినా ఇతని స్వభావం నాకు అర్థం కాదు. అసలు ఇతనికి సాయిబాబా పట్ల భక్తివుందా అని నాకు తెలీదు. ఇతను ఎప్పుడైనా సాయిబాబా పేరు వల్లించి ఉంటారా? మావారు హాస్యంగా ఏదైనా అంటే అందులోకూడా గాంభీర్యం కనిపిస్తోందా! తమాషాగా గురువారం గురించి ఇతను ఏమైనా అన్నారేమో, గోమతికి అన్నయ్య తన సాయిభక్తిని ఎగతాళి చేసినట్టు అనుమానం వచ్చేసింది! నాకూ ఆశ్చర్యం కలిగింది - ఎప్పుడు? అతను ఉద్యోగం ఆరంభించి, వచ్చిన మొట్టమొదటి జీతంలో సగం వంతు సాయిబాబాకి దానం చేసారే, అప్పుడే!

** ** **

సాయంకాలం మావారు ఇంటికి తిరిగిరాగానే చెల్లెలి ఉత్తరం చూసారుగా? కాని “ఏదీ, ఆ నాణెం చూద్దాం, తీసుకురా!” అని అనలేదు. నేను దాన్ని తీసి పెట్టుకొనివుంటాను అని అతని ఉద్దేశం. “మీరు పంపిన నాణెం నాకు అందింది. దాన్ని ఇవాళే కట్టుకున్నాను” అని నేను గోమతికి రాసిన ఉత్తరం చదివిన తరువాత కూడా “ఓ, అలాగా?” అని అతను నిట్టూర్పు వదల్లేదు. నేను ఆ కాసు కట్టుకున్నానని తెలుసుకున్న తరువాత నాకూ ఆడపడుచంటే గౌరవం ఉందని అతను లోలోపల సంతోషించి ఉంటారు.

నేను మాటవరుసలో రెండుమూడు సార్లు ఆ నాణెం గురించి - తలా లేక తోక? అని పరీక్ష చేస్తున్నట్టు - మా ఆయనతో ప్రస్తావించాను. “నాకెందుకో అంత తొందర! ఆ కాసుగాని మీ జందెంలో ఉంటే బాగుంటుందేమో?” అని అన్నాను. ఆ నాణెంలోని లక్ష్మి నన్ను బాగా ఆకర్షించందని కూడా తెలియజేసాను. కాని అతను

నోరు పెగల్లేదు. ఏదీ కాదని అంటున్న అతని వాలకమే అతని జవాబు అని తెలుసుకున్నాను. గోమతి సాయిబాబా నాణెం పంపించడం వలన నాకు సాయి భక్తి రాలేదని అతనికి బాహటంగా తెలియజేసానని నాలో అల్పసంతోషం చోటుచేసుకుంది.

** ** **

మరికొన్ని రోజుల్లోనే ఆ నాణెం వెండి మెరుగు మాసిపోయింది. దాన్ని తీసి ఒక చిన్న తఋుగు బుట్టలో పెట్టేసాను. 'ఓ, ఇవాళ గురువారం!' అని చాలా సేపు తరువాత గుర్తు చేసుకున్నాను. 'కొన్ని రోజులే కట్టుకున్నాను, అది చాలు!" అని నాలో నచ్చజెప్పుకున్నాను. 'దాన్ని కట్టుకున్నట్టే తీసేయడమూ జరిగింది!' అనికూడా ఆలోచించాను. కాని ఆ ఆలోచన చాలా రోజులు స్థిరపడకుండా పోయింది. ఎందుకు? మట్టిదీపంలో నూనెలో నానబెట్టిన వత్తి ఉందనుకోండి; వత్తి చుట్టూ నూనె లేదంటే అని ఎంతసేపు వెలుగుతుంది?

రాత్రి భోజనం అతనికి వడ్డించి నేనూ భోజనంకి కూర్చున్నాను. అప్పుడే గుమ్మం దగ్గర పెళ్లి సంబరాలకి మమ్మల్ని ఆహ్వానించడానికి స్నేహితులు కనిపించారు. సరే అని ఇవతలకి వచ్చాను. పెళ్ళిగురించి మాటాడాలంటే ఎన్ని కబుర్లున్నాయ్! వాళ్ళని పంపించేసి వంటగదికి తిరిగి వచ్చాను. రెండు పిల్లులు కనిపించాయి. ఒక పిల్లికూన మజ్జిగని రుచి చూసి నాలికని చప్పరించుకుంటోంది; ఇంకొకటి ఉత్తి అన్నం తింటోంది.

"సరేలే, ఉపవాసం ఉంటే మంచిదే!" అని నేను అన్నాను.

"నీకివాళ ఉపవాసమా?" అని మా ఆయన నవ్వుతూ అడిగారు.

"నాకేం ఆకలి లేదు. సాయంకాలం తిన్న పాల పూరి కడుపులో అలాగే ఉంది. ఇప్పుడు భోంచేయకపోతే ఏమీ నష్టం లేదని అంటున్నాను."

"సరేలే, నీకు ఇవాళ సాయిబాబా వ్రతం ఐపోయిందన్నమాట! సాయంకాలం స్వీట్ మాత్రం తిన్నావు కదూ?" అని అతను అడగ్గానే నేను నివ్వెఱపోయాను.

వెంటనే తఋుగు బుట్టలోనుంచి సాయిబాబా నాణెం తీసాను; దాన్ని పూజగదిలో గంగాజలమున్న చెంబుమీద పెట్టాను.

మా ఆయన ఏదీ తీవ్రంగా పట్టించుకోరు; నేను అలాగ కాదు.

** ** **

మాటిమాటికీ సాయిబాబా గురించి నా మనసులో ఒక ఆలోచన లేస్తూనే వుంది. అతను హిందూ మహమ్మదీయుల ఐకమత్యం కోసం కృషి చేసారని ఎవరో చెప్పారు; సాయిబాబా పుట్టినది ఒక మహమ్మదీయ కుటుంబంలో.

దానిగురించి ఇప్పుడు మళ్ళీ తలుచుకుంటే నాకెలాగోవుంది. ఐకమత్యం! గోమతి, ఈ కమల - ఇద్దరూ జోడైన యువతులే, కాని ఒద్దిక అని వస్తే, ఎంత భేదం! స్వభావంలో ఎన్నో తారతమ్యాలు ఉండవచ్చు, అదీ మంచిదే. ఉప్పూ, చింతపండూ కలిపితే నోటికి ఆ తొక్కు రుచే వేరు. తిన్న వారెవరైనా 'ఆహా! ఏమీ రుచి!' అని అనుకోకుండా ఉండలేరు!

ఒకామెకి ఒక ఇల్లు పుట్టినిల్లు, రాణిలాగ ఏలుతోంది; అదే ఇంట్లో ఇంకొక యువతికి అది మెట్టినిల్లు, ఆమె సేవ చేస్తోంది; ఇద్దరూ అవగాహనతో, అనురాగంతో, సహచరులుగా మెలగవచ్చు. అధికారంతోబాటు ఆదరణ, సేవతోబాటు మైత్రి చోటు చేసుకుంటాయి. కాని అలాగ ఏమీ జరగలేదు.

ఇప్పుడు గోమతి, నేనూ పూర్తిగా మారిపోయాం; ఇక లోబఱచుకోవడం, లొంగిపోవడం సాధ్యంకాదని తెలుసుకున్నాం.

లేకపోతే నేనెందుకు ఇప్పుడు ఇంత ఉత్సాహంతో గోమతి ఇంటికి బయలుదేరుతాను? గోమతి ముఖాముఖి అంటే పులి ఉన్న ఒక గుహలో దూరడం అనే నా భయం పోయింది. ఇప్పుడేమో బాగా పరిచయమున్న అడవి జంతువులతో ఆడుకోవడానికి వెళ్తున్నట్టు ఆత్మ విశ్వాసం నాకు ఉంది. మా ఆయనకి ఇప్పుడు శెలవులు; మమ్మల్ని రమ్మని పిలుస్తూ, పిలుస్తూ గోమతి కూడా అలసిపోయింది. మేం ఇద్దరం కుషిగా బయల్దేరాం.

ఆ నాణెం నాకు పంపించిన సంగతి గురించి గోమతి ఏం గొప్పగా చెప్పుకోదు. కాని దానిగురించి నేను ఏమైనా ప్రస్తావించాలని ఆమె ఆశించవచ్చు. 'సరేలే, ఆమె అడిగితే దానిగురించి మాటాడదాం!' అనే ధోరణిలో నేను ఎన్నో విషయాలు మాటాడాను.

అప్పుడే నా మేనల్లుడు రవి, చెయిలో ఒక ఫోటో ఆల్బంతో నా దగ్గరకి వచ్చి నా పక్కనే కూర్చోవాలనే ఉద్దేశంతో "మామీ, మా ఇంటి బొమ్మలకొలువు ఫోటో చూస్తారా?" అని అడిగాడు. నేను వాడితో మరికొన్ని ఫోటోలుకూడా చూసాను.

"మీరందరూ కలిసివున్న ఒక గ్రూప్ ఫోటో మాకు పంపిస్తే బాగున్ను. మా దగ్గర మీ 'ఫేమిలీ ఫోటో' అని ఏమీ లేదే?" అని నేను గోమతికి చెప్తూంటే రవి నా భుజాన్ని తాకి "మామీ, మీదగ్గర  సాయిబాబా కాసు భద్రంగా ఉందా?" అని అడిగాడు. "ఓ, అది మేం పూజ చేసే గదిలో ఉంది!" అని అన్నాను.

"నేనూ దాన్ని జాగ్రత్తంగా ఎక్కడో పెట్టాను, కాని అది పోయింది!    ఐతేనేం, నేనున్నానుగా, నా పేరు సాయినాథ్!" అని రవి నవ్వాడు.

పిల్లవాడు మాటాడుతున్నధోరణి చూసి, మురిసిపోయి నేనూ నవ్వేసాను.

"బడీలో వీడికి సాయినాథ్ అని పేరు. మేం పెట్టిన మూడవపేరు సాయినాథ్ కదా?" అని గోమతి నాకు గుర్తుచేసింది. ఈ పిల్లవాడి కానుపుకి గోమతి పుట్టిల్లుకి వచ్చింది. ఆ తరువాత పిల్లవాడిని ఆమె రవి అనే పిలవడం గమనించాను. "సాయినామం కావాలనే ఆ పేరు పెట్టారుకదూ? ఆ తర్వాత ఏమైంది?" అని నేను అడగడం మరిచిపోయాను.

"పేరు మార్చితే పిల్లలు తికమకలాడిపోతారు. క్లాసులో హాజరైనవాళ్ళ పేర్లు పిలిచినప్పుడు వీడు చురుగ్గా పని చెయ్యాలి! లేకపోతే Absent అనేస్తారు!" అన్నాను నేను.

"అబ్బబ్బా! అసలు వీడికా బాధ లేనేలేదు! సాయినాథ్ అనే పేరే కావాలని హఠం చేసి  మా ప్రాణం తీసేసాడు! మేం ఒక డజను సాయిబాబా కాసులు కొన్నాం; మా ఇంటికి నాలుగు; పుట్టిల్లుకి నాలుగు; పొరుగింటికి రెండు; ఎదుటింటిలో ఉన్న పాప మొలతాడులో కట్టమని ఒకటి ఇచ్చాను. ఒకటి మిలిగింది. 'సరే, ఉండనీ!' అనుకున్నాను. వీడే 'మామీకి పంపు!', 'మామీకి పంపు!' అని సతాయించాడు. ఆఖరికి నీకు పంపించేసాను!"

సాయిభక్తి లేనిదానికి కాసు ఎందుకు పంపాలి అని గోమతి ఉద్దేశం. న్యాయమే కదా? కాని రవి తల్లిని వదల్లేదు. 'మామీకి పంపు!', 'మామీకి పంపు!' అదే వాడి మొండిపట్టు!

నేను ఆతురతతో రవిని చూసాను. ఇంతసేపూ నాతో మాటాడిన పిల్లవాడు మౌనంగా నన్ను చూసి చక్కగా నవ్వాడు.

ఆ చూపులో కృతజ్ఞత, సానుభూతి మిళితమైపోయాయి; వివరింపలేని ఆనందం నన్ను ఆకట్టుకుంది.

ఆహా, ఈ కుఱ్ఱవాడిని, ఉపకారిని, స్నేహితుడిని నేను మరిచిపోయానే! అవును, ఈ చిన్నవాడు నా జ్ఞాపకంలో లేడు! నేనెలా మరిచిపోయాను?

రెండు సంవత్సరాలముందు ఈ బాలకుడు "మామీ, మీరు ఎన్ని పనులు చేస్తున్నారు!" అని నన్ను పొగడాడు. ఇంకొకసారి "మామీ, నీ గురించి అమ్మా, అమ్మమ్మా ఏమేమో అంటున్నారు," అని అమ్మమ్మ ముందరే నాకు చెప్పేసాడు. "ఒరేయ్, నువ్వు ముందు బయటకి వెళ్ళు!" అని అమ్మమ్మ బెదిరింపు వినగానే "నాకు ఈ మామీ అంటే చాలా ఇష్టం!" అని నిష్కపటంగా అన్నాడు.

ఆ రోజుల్లో నేను పడుతున్న మానసిక అవస్థలో 'ఓ, అలాగా? వీళ్ళ గుట్టు నాకు తెలిసిపోయింది!' అనే భావన కలిగింది. కాని 'వీడికి నేనంటే ఎంత అభిమానం!' అని ఇప్పుడే మళ్ళీ గుర్తుచేసుకున్నాను.

'ఇలాంటివాడిని ఎందుకు మరిచిపోయాను?' అని నేను బాధపడ్డాను. వాడు నాకిచ్చిన బహుమానం ఆ సాయిబాబా నాణెం!

"మామీ, ఇదిగో, చూడండి! ఈ బొమ్మలకొలువులో పెద్ద సాయిబాబా బొమ్మ!" అని రవి నాకొక ఫోటోని ఉత్సాహంతో చూపించాడు.

"ఎందుకురా మామీని చికాకుపెడ్తున్నావ్?" అని గోమతి మందలించింది. నాకు సాయిబాబాకి సంబంధించిన విషయాల్లో ఆసక్తి లేదని గోమతి పిల్లవాడికి చెప్తోంది; అది వింటే నాకు వినోదంగా ఉంది. ఆడపడచుగా గోమతి నన్ను వేధించిన పాత రోజులు నేను గుర్తు చేసుకున్నాను. దానికి ఆధారంకూడా ఈ అభిమానమే కాబోలు!

నేను కూడా ఏమైనా కబుర్లు చెప్పుకుంటూ నా స్నేహం మెరుగుపరచాలని ఆలోచించాను. "అసలు బొమ్మలకొలువుకి ఆధారమేమిటో తెలుసా?" అని అడిగాను; గోమతి కూడా నా వ్యాఖ్యానం వినాలని నా వాంఛ.

"బొమ్మలన్నీ చూడడానికి అందంగా ఉంటాయి!" అని అన్నాడు రవి. మగపిల్లలకీ బొమ్మలు ముచ్చటగా కనిపిస్తాయికదా?

"అంతే కాదు. ఒక రాక్షసుడుని - దుర్మార్గుడిని - హతం చెయ్యాలని అమ్మవారు యుద్ధంకి సిద్ధమైంది. ఆవిడకి సాయం చెయ్యాలని అందరూ . . . అంటే, దేవతలు, సూర్యుడూ, చంద్రుడూ, ఇంద్రుడూ అందరూ పూనుకున్నారు. మనింట్లోవున్న ఒక్కొక్క బొమ్మ ఒక దేవత అన్నమాట! మనింట్లో ఒకే ఒక బొమ్మని మనం కొలువులో నిలబెట్టినాకూడా అమ్మవారికి సాయంగా మనింట్లోకూడా ఒక దేవత ఉందని అర్థం!" రవికి వివరిస్తున్న సమయంలో, మధ్య మధ్య నేను గోమతి మొహమూ చూస్తూనే ఉన్నాను. ఆమె కూడా శ్రద్ధగా వింటోంది. నా వివరణ విన్నతర్వాత, "వదినా, బాగుంది నీ వ్యాఖ్యానం! నీ ఊహ బ్రహ్మాండంగా ఉంది!" అని అంది.

"ఇందులో ఏ ఊహా లేదే! బొమ్మలకొలువులోని తాత్పర్యం ఏమిటని నాకొక స్నేహితురాలు చెప్పింది. ఆమె చెప్పినట్టు నేనూ మా ఇంట్లో మేజామీద నాలుగైదు బొమ్మలు పెట్టాను. చిన్న కొలువని మనమెందుకు సిగ్గుపడాలి? మనమూ అమ్మవారికి సైన్యం కూడబెట్టినట్టు సంతోషించాలి. అందుకే మా ఇంట్లోనూ ఒక చిన్న బొమ్మలకొలువు ఉంది!" అన్నాను.

"మామీ, మీరు ఫోటో తీసారా?" అని ఆతురతతో నన్ను అడిగాడు రవి. ఇంతలో గోమతి జోక్యం చేసుకొని "కొంచెం ఆగురా!" అని పిల్లవాడిని అడ్డగించి నాకు చెప్పింది: "పూర్వకాలంలో యుద్ధమని వస్తే ఒక్కొక్క ఇంటినుంచి ఒక యువకుడు వెళ్ళి సైన్యంలో చేరాలని నియమం ఉండేదట. అలాగే ఒక్కొక్క ఇంటిలో ఒక బొమ్మైనా కొలువులో ఉండాలి!" అంది.

రవికి మనసులో బాధగా ఉందేమో? "తలచుకుంటే నా సాయిబాబా ఆ రాక్షసుడిని ధ్వంసం చేసేస్తారు! అతనికి ఎవరి సాయం వద్దు! అతనికి ఒక నిమిషం చాలు!" అని అన్నాడు.

అంత గాఢమైన నమ్మకం రవికి ఉందంటే? దానికే భక్తి అని పేరు. "అవును, నిజం!" అని వాడిని వాత్సల్యంతో రెండు చేతులా లాగ్గొని కౌగిలించుకున్నాను.

ఆ నమ్మకం వాడికెలా వచ్చింది? తన పేరు సాయినాథ్ అనే గర్వం వలనా? చిన్నవయసులోనే ఇలాంటి భావన కలిగితే క్రమేణ అది మమతగా, అహంకారంగా మారే అపాయం ఉందా?

ఏది ఎలావున్నా రవిని ఆ క్షణం చూడగానే నాకా అనుమానం, సందేహం, రవంతైనా లేదు; ప్రేమానురాగాలే ఆవరించుకున్నాయి. వాడికి సాయిబాబా దేవత కాకపోవచ్చు. ఐతేనేం, తన ఇష్టదేవతగా అతన్ని పూజించనీ!

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అనలేదూ, "నేనే సకలమూ; నేనే శిష్యుడుని!" అని? అతనే గురువనే స్థానం వహించి "నేనే పురుషోత్తముడుగా, కర్తగా ఏలుతున్నాను!" అని వక్కాణించి చెప్తున్నారు. అతను 'నేను', 'నేను,' అని నొక్కిచెప్పడం వలన అతనికి గర్వమని ఎవరైనా అపార్థం చేసుకుంటారా?

'ఐతేనేం, నేనే సాయినాథ్!' అని రవి అంటున్నాడు. నాణెం పోగొట్టుకున్నందుకు బాధ పడినా సాయి భక్తుడుగా మెలగుతూ "నేనే సాయి!" అనే వాడి అభిరుచి నాకు ఇంపుగా ఉంది.

'నా పేరు సాయి. నా జ్ఞాపకార్థంగా మామీకి సాయిబాబా నాణెం పంపాలి!' అని వాడి అభిలాష కాబోలు!

చిన్నవాడికి మరేం పెద్ద ఆలోచనలు రాకపోయీనా, నామీదున్న సహానుభూతి వాడిని పురిగొల్పి ఉండాలి!

ముందొకసారి గోమతి తన కొడుకుని ముద్దాడుతూ "ఒరేయ్, మామీని 'నాకొక పెళ్ళాం కావాలి, కని పెడతావా?' అని అడుగురా!" అని నేర్పింది. నాకూ ఆడ పిల్లే పుట్టింది. కాని ఏం లాభం? అది పోయింది. దాని బతుకు గురించి నాకు ఒకటే భయం. 'ఆడపడుచుగా మీరు నామీద రుద్దిన దౌర్జన్యం చాలు. నా కూతురుకి అత్తగారుగా వచ్చి దాన్నికూడా మీరు చిత్రహింస చెయ్యాలా?' అని నాకు గోమతిమీద పట్టరాని కోపం కలిగింది. అంటే, నాకు నా అమ్మాయి భవిష్యత్తుగురించి అంత నమ్మకం ఉండేదన్నమాట!

నా ముద్దుబిడ్డ పోయిన తర్వాత నా మనసు కరిగి ఇప్పుడే ఈ ప్రపంచాన్ని చూస్తున్నాను. అవును, ఈ రవిని చూస్తున్నాను. విశాలమైన దృక్పథంతో పిల్లందరినీ చూడాలని నాకు ఇదివరకూ ఎవరూ నేర్పలేదు.

ఇప్పుడు కూడా నాకూ, రవికి మధ్య ఏర్పడిన బంధం అభిమానం కాదు; దానికి సానుభూతి అని పేరు. నా కూతురుగాని బతికివుంటే నేను దాన్ని గోమతి కోడలుగా సమ్మతించి ఉండనేమో? ఇప్పుడు దాన్ని నా ఊహా ప్రపంచంలో రవి

భార్యగా చూసేసాను. కూతురుని పోగొట్టుకొన్న నేనూ, భార్యని పోగొట్టుకున్న రవీ - ఇద్దరికీ ఆ అవగాహనలో ప్రేమానురాగలబంధం చోటుచేసుకుంది.

“మామీ, నువ్వుకూడా ఇవాళ నాలాగ అన్నం తినవద్దు! బర్ఫీ తిను!” అని రవి అనగానే గోమతి “బాగుందిరా నీ ఆజ్ఞ! ఊరుకో!” అని కొడుకుని మందలించింది.

“అక్కయ్యా, సాయినాథ్ ఆజ్ఞ పాటించకుండా ఉంటానా?” అని జవాబు చెప్పి నేను జరిగాను. ఆ పిల్లవాడి మాటని అనుసరించి రాబోయో అనుభవం నాకు ఇంపుగా కనిపిస్తోంది!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, అక్టోబర్, 21, 1956)**

# ఆశాగ్ని కిరణాలలో . . .

తడిసిన జుత్తుని electric fan గాలిలో ఆఱబోసుకుంటూ శకుంతల కూర్చొనివుంది.

ఆ రోజుల్లో మహారాజులు, రాణీలకి పరిచారికలు చామరం వీస్తూ గౌరవించారు; ఈ రోజుల్లో ఎవరి సాయమూ ఎదురుచూడకుండా electric fan మూలం దొరికే సేవని ఒక చక్కని ఆధునిక సృష్టి అనాలి!

“అమ్మా, ఆంటీని చూసావా? ఆవిడ జుత్తు బాగా ఆఱిపోయింది! నేనుగాని తైల స్నానం చేసానంటే రోజంతా జుత్తుని ఆఱబోసుకొని దెయ్యంలాగ ఇంట్లో తిరగవలసిందే!” అని మైతిలి గొణుక్కుంది.

శ్రద్ధ తప్పి మమ్మల్ని కిటికీకి దగ్గఱగా చూసిన శకుంతల, ఆహ్లాదంతో “ఓ, మీరా? రండి, రండి!  మీరు రావడం ఈ fan సద్దులో వినిపించనేలేదు!” అని అంటూ దాన్ని ఆపి, ముడికట్టుకొని, లేచి నిలబడింది.

మేమిద్దరం నిలబడివున్నది మా ఇంటిని ఆనుకొనివున్న మట్టి నెలమీద. కిటికీ శకుంతల ఇంటి పడకగదికి చెందినది. ఆ గదిలో ఉన్న పెద్ద నిలువుటద్దంలో నా ముఖం, మైతిలి ముఖం శకుంతలకి కనిపించివుండాలి!

“ఈ ఆంటీ పెద్ద నిలువుటద్దం కొన్నారుగాని దానిముందు కూర్చొని ఎప్పుడూ దువ్వుకోరు!” అని మైతిలి చిరునవ్వు నవ్వింది.

“దువ్వుకోడానికీ, జుత్తు ఆఱబోసుకోడానికీ ఈ జాగావే నాకు ఇష్టం! అని అంటూ, నవ్వుతూ శకుంతల కిటికీ దగ్గరకి వచ్చింది.

“మా ఇంటికి రా!” అని నేను శకుంతలని పిలిచాను. దీపావళి పండుగకి కలెక్టరు కృష్ణన్ ఇంటికి కొన్ని పట్టుచీరలు ఒక వర్తకుడు తీసుకొని వచ్చాడు. మేమూ వాటిని చూసి ఇష్టపడితే కొనవచ్చు అని మాకు చెప్పారు. ఈ సంవత్సరం మా ఇంటిలో మైతిలికి పండుగ; అల్లుడుగారు వస్తున్నారు.

గంతులు వేసుకుంటూ శకుంతల మా ఇంటికి వచ్చి చీరలు చూసింది. “ఆంటీ, మా ఆయన రావడానికి మధ్యాహ్నం రెండు గంటలవుతుందే?” అని అంది.

"దానికేం? నేను చీరలని ఇవాళ సాయంకాలం తిరిగి పంపాలని అనుకుంటున్నాను" అని నేను అనగానే శకుంతల సంతోషించింది.

"వినండి, ఈ పట్టుచీరలని చేతుల్లో తీసుకొని చూడడానికే నాకు సిగ్గుగా ఉంది: ఈ చేతులతో ముడిని తట్టుకున్నానుకదూ? ముందు నా చేతులు శుభ్రంగా కడుక్కుంటాను" అనడంతో ఆమె ముందాలోచన నాకు నచ్చింది.

"ఆంటీ, దీపావళి రోజు పొద్దున్న తైల స్నానం అవగానే మీరు కొత్త చీర కట్టుకోవాలి," అని మైతిలి గుర్తుచేసింది. "నేను సాయంకాలమే కట్టుకుంటాను!" అని అంటూ శకుంతల నవ్వింది; ఊదా రంగులో ఒక చీర ఎంచుకుంది. "మా ఆయనతో మాటాడిన తరువాతే ఇది కొంటాను!" అని చెప్పి వెళ్ళింది.

కాని ఆఖరికి శకుంతల ఏ చీరా కొనలేదు. భార్యాభర్తలు ఏం మాటాడుకున్నారో? నలుగురూ చూసి వద్దని నిరాకరించిన చీరలు కొనాలని ఏ నిర్బంధం లేదే? నేను పండుగకని రెండు చీరలు కొన్నాను. మైతిలి నాతో "అమ్మా, ఈ చీరలకి ఖర్చు చేసే  డబ్బుతో నాకు ఒక మంచి నిలువుటద్దం కొను," అంది.

"సమయం వచ్చినప్పుడు అదీ కొని ఇస్తానులే!" అని నేను చమత్కారంగా నవ్వుతూ అన్నాను.

"ఇప్పుడే కొను! నాకు చీర వద్దు!" అని మైతిలి విసుగ్గుంది.

అవును, కాని ఇది చెప్తే సరిపోతుందా? దాని అత్తగారింట్లో మమ్మల్ని ఎవరైనా మెచ్చుకుంటారా?మా మైతిలి ఛాయకి, దాని చెవులకి రవ దుద్దులే సరిపోతాయట! "మీరు మీ అమ్మాయికి ఏది చెయ్యాలనికున్నా ముందు కమ్మలు కొనేయండి!" అని వాళ్లు మాకు పదే పదే చెప్పివున్నారు. అలాంటప్పుడు మేం నిలవుటద్దం, electric fan కొనడం ఎలా సాధ్యం? "ఈ రెండూ మన ఇంటిలో లేవు!" అని మైతిలి అంగలార్చుకుంటోంది!

నేనూ శకుంతలకి చెప్పాలని అనుకున్నాను: "దీపావళి దినం మా మైతిలిని మీ ఇంటికి వచ్చి fan  దగ్గర కూర్చొని జుత్తు ఆరబెట్టుకోమని చెప్పు. 'నేను దెయ్యంలాగ తిరగాలా?' అని అది అడుగుతోంది. అది మీ fan ముందు తన్ను అలంకరించుకొని భర్తకి ఎదురుగా ధైర్యంగా నిలబడనీ!" అని అన్నాను.

‘కాపురం అంటే ఏమిటో తెలుసుకోవాలని మైతిలి ఎంత ఆతురతతో ఉందో?’ అని నేను ఆలోచిస్తూంటే మైతిలి వచ్చి “అమ్మా, శకుంతల ఆంటీకి చెవి పోటంట. తనే మందు పోసుకుంటున్నారు,” అని చెప్పింది. అంకుల్ సాయం చెయ్యకూడదా అని దాని ఉద్దేశం!

“ఏం, నువ్వు సాయం చెయ్యకపోయావా? మూర్తి ఇంటిలో లేడా?”

“అతను వసారాలో ఉన్నారే?” అనే జవాబు వినిపించింది.

రెండు రోజులుగా శకుంతల నాకు కనిపించలేదు. నాకేదో అనుమానం. ఒక రోజు మూర్తి ఆఫీసుకి  వెళ్ళగానే నేను శకుంతలని వెళ్ళిచూసాను.

“చెవిపోటని విన్నాను. నీదగ్గర ఏ మందు ఉంది?” అని అడుగుతూ ఆమె చెవిని కప్పుకున్న వెండ్రుకలని మెల్లగా తాకాను; దూదితో మూసిన చెవిని గుర్తుచేసుకున్నాను;  శకుంతల చెవిని ముట్టుకోడానికే వెనకాడింది.

‘స్వర్ణరేకలాంటి నీ చెవికా ఈ గతి?’ అని నేను బాధపడ్డాను. “విను, నా కన్ను వలనే నీకు దిష్టి తగిలింది, ఇబ్బందిలో పడిపోయావ్! ఆ రోజు నువ్వు ముడికట్టుకొని నా ముందు కనిపించినప్పుడు ‘ఆ చెవులని మూడువేల రూపాయల కమ్మలు అలంకరించాలి!’ అని నేను అనుకున్నాను! అందుకే ఇలాగైంది!” అన్నాను.

“మావారి కన్ను ఏమీ చెయ్యలేదులెండి!” అని అంటూ శకుంతల నవ్వింది; ఆమె ఏం అంటుందో నాకు బోధపడలేదు.

“ఏం మందు వాడావ్?”

“Glycerin.”

“నువ్వే మందు వేసుకున్నావని విన్నాను. ఏం, మూర్తిని పిలవకపోయావా?”

“ఆహా, అతను వేస్తారు . . . ”

“ఏం, అతను వెయ్యరా?”

“ఆంటీ, నొప్పి రాగానే అతనికి చెప్పాను . . .  నిద్ర రాకుండా రాత్రంతా బాధ పడ్డాను . . .  అతను మందు వేస్తారేమో అని అనుకున్నాను . . . అతను మూలిగారు, గొణుక్కున్నారు . . . ఆఖరికి నేనే వేసుకున్నాను . . . ఇంటిలో ink filler ఉందిగా? . . . చాలా సులభం!”

"మందు వెయ్యడానికి అతను జంకారంటున్నావా? నిద్ర పూర్తిగా పోలేదేమో?"

"లేదు, ఆంటీ! అతను మెలుకువతోనే ఉన్నారు! అందుకే అతను తప్పకుండా మందు వెయ్యడానికి సాయం చేస్తారనుకున్నాను . . . ఆ సాయంకాలం ఆ చీర గురించి మేం మాటాడాం . . . అదే . . . ."

"ఓహో, . . . అదా సంగతి?" అని నేను ఆశ్చర్యపడుతూంటే శకుంతల మరేం అనక, మొహం ముడుచుకొని, రెండు చెవులనీ చేతులతో కప్పుకుంది.

"శక్కు, నా మాట విను! చీరలు కొనలేదని బాధ పడవద్దు! ఇలాగ మెల్లమెల్లగా డబ్బు కూడబెట్టావనుకో, ఆఖరికి, హాయిగా వజ్రం కమ్మలు కొనడానికి ప్రయత్నం చెయ్!" అని నేను అన్నాను. అవును. శకుంతల చెవుల్లో కమ్మలు లేకపోవడం నాకొక పెద్ద కొఱతగా ఉంది. ఆమె ఏమేమో కొంటోంది, అవన్నీ ఆమె సొగసుకి సరిగ్గానే ఉన్నాయి. కాని ఒక జత వజ్రం కమ్మలు తొడుక్కుంటే చాలు - ఒక శ్రీ చక్రం, పంచాక్షర చక్రం ధరించిన అంబిక లాగ శోభిస్తుంది! దేవీ స్తోత్రంలో పార్వతి చెవుల వర్ణన జ్ఞాపకం ఉందా? అటువంటివి శకుంతల చెవులు. ఆమెకి రకరకాల తమ్మట్లూ, కంఠమాలలూ అనవసరం అని నా ఉద్దేశం.

"నేనేమంటున్నానో బోధపడిందా?" అని నవ్వుతూ అడిగాను.

"అవును, అదొక్కటే తక్కువ! చెవిపోటుకి రెండు బొట్లు మందు వెయ్యడానికే మా ఆయనకి ఇబ్బందిగా ఉంది . . . ఇక వజ్రం కమ్మలు కొనడానికి మనసు రావడం ఏం అంత సులభం అంటున్నారా?" అని మారుమాట వినిపించింది.

ఇంతలో మైతిలి వచ్చింది; శకుంతల దాన్ని చూడగానే కనురెప్పలు పైకెత్తి నవ్వడానికి ప్రయత్నించింది.

"నాకు మాటాడానికే నొప్పిగా ఉంది," అని శకుంతల మొహం ముడుచుకుంది.

"అందువలనే మీ ఆయనతో మాటాడడం ఆపేసావా?" అని నేను అడిగేసాను.

"బాగుంది! మాట్లాడకుండా ఎలా ఉండగలరు?"

మైతిలి ఈ ప్రశ్న అడుగుతోంది! ఒకే ఇంటిలో చుట్టుతిరుగుతున్న దంపతులలో ఇది సహజమని మైతిలి ఎరుగదు. దంపతులలో ఘర్షణలు, అభిప్రాయ భేదాలు, మూకీ భావం సాధ్యం అనే ఆలోచనకూడా దానికి లేదేమో?

అంతకి మించి మరేం అడక్క నేను తిరిగివచ్చేసాను. దాంపత్యంలో, ఏ కారణమూ లేకుండా, ఏదో చిన్న కలహం అయివుంటుంది! ఏమో, ఎవరికి తెలుసు?

రెండు రోజుల తరువాత ఆ దంపతులమధ్య ఘర్షణ తగ్గిందా అని తెలుసుకోవాలని నేను మళ్లీ వెళ్ళాను. హాలులో ఏదో పుస్తకం చదువుకుంటున్న శకుంతల నన్ను చూడగానే లోపలికి రమ్మని పిలిచి కూర్చోమంది. దాని చెవిపోటు కొంచెం తగ్గిందని తెలుసుకున్న తరువాత "మూర్తి ఎక్కడ?" అని అడిగాను. చెయి ముడుచుకొని, బొటనవేలుతో సైగ చేస్తూ 'వసారాలో ఉన్నారు!' అని చెప్పింది.

"మూర్తినే అడగాలి. మా అల్లుడుగారికి కదరు పంచే కావాలట!  అదెక్కడ దొరుకుతుందో కనుక్కోవాలి!" అని అన్నాను. ఇదేం మా ఆయనకి తెలియని సంగతికాదు; ఏదో నెపంమీద మూర్తితో మాటాడాలని నా ప్లాను.

"మీ ఆయన్ని అడుగు!" అన్నాను.

"ఆంటీ, మీరే అడిగితే మంచిది" అని శకుంతల అంది.

ఇంతలో చెయిలో వార్తాపత్రికతో మూర్తి వసారానుంచి మా దగ్గరకి వచ్చాడు. "ఏమిటి సంగతి?" అని అడిగాడు. నా ప్రశ్న విని "అవన్నీ మీ ఆయనకి తెలుసే? అతనికి మీ సమర్థతలో నమ్మకం లేదన్నమాట!" అని నన్ను ఎత్తిపొడిచాడు.

"దీపావళికి బట్టలు కొనడం ఎంతవరకూ వచ్చింది?"  అని నేను అడిగాను.

"ఇంకా జగడంగానే ఉంది!" అని శకుంతల తనలో గొణుక్కుంది. "నిమ్మళంగానే ఉంది!" అని అంటూ మూర్తి నిష్క్రమించాడు. భార్యాభర్తలు ఒకరినొకరు సూటిగా చూడకుండా మాటాడుతుంటే నేను చేసేదేముంది?

ఇంతకీ ఈ దంపతులని హింసించే మానసిక వ్యధ ఏమిటి? చీరలు కొనడంలో ఆరంభించిన ఇక్కట్టు ద్రౌపతికి శ్రీకృష్ణుడు అందించిన చీరలాగ పొడుగుతూ వస్తున్నట్టుందే?

కాకపోతే వజ్రం కమ్మలు గురించి ఈ దంపతులు పోట్లాడుకుంటున్నారా? నాకు తెలిసినంతవరకూ శకుంతలకి దానిగురించి తీవ్రమైన ఆశ లేదు. కేవలం ఆలోచనే - కొన్ని రోజులుగా - ఉంది.

నాకు గుర్తుంది; ఒక శుభకార్యంలో శకుంతల తొమ్మిది గజాల చీరకట్టు మాలో చాలామందిని కనువిందు చేసింది. "ముప్పైయేళ్ళు దాటగానే సాంప్రదాయంగా ఇదే చీరకట్టు నేను వాడుతాను," అని ఆ రోజు శకుంతల అనగానే అక్కడున్న సీతాపతి భార్య "నీకు తెలుసా? కొరనాడు పట్టూ, వజ్రం కమ్మలూ, ఈ చీరకట్టు శోభకి ముఖ్యం!" అని అన్నారు. ఆవిడ పెద్ద చదువు చదువుకున్నవారు; మా ఉరు కార్యకలాపాల్లో ఆవిడకి మంచి పేరుంది. ఆవిడ సందేశం నిరాకరించడం ఎలా సాధ్యం? "ఆవిడ ఏమన్నారో విన్నావా?" అని నేను శకుంతలని అడిగాను. "సరేలేండి, నాలుగైదు సంవత్సరాల్లో నేనూ వజ్రం కమ్మలు కొంటాను," అని శకుంతల అంది.

నేనూ, శకుంతల ఈ కమ్మలు గురించి ఎన్నిసార్లు వాదించుకున్నామో ఎవరికి తెలుసు?

"మరేం నగలూ వద్దు. కమ్మలుంటే చాలు!" అని నేనంటే శకుంతల నవ్వేసి మరేం అనదు.

"ఒక అత్యవసర పరిస్థితి అని వచ్చిందనుకో; మనం నగలతో, చీరలతో సులభంగా తప్పించుకోవచ్చు! బీరువా, నిలువుటద్దం ఉంటే ఏం లాభం?" అని తరచుగా నేను అడుగుతాను.

"దొంగకి నగలతో పారిపోవడం చాలా సులభం!" అని శకుంతల వాదించేది.

"నగలుంటే రొక్కంగా మార్చడం సులభం. అది స్త్రీలకి పెద్ద వసతి," అని నేను అన్నాను.

"అసలు నగలన్నీ స్త్రీల అందానికే! మా అమ్మమ్మ కూడా నెలా ఐదో పదో కూడబెట్టి 'ఎప్పుడైనా సరే, జీవితంలో ఒక సారి వజ్రం కమ్మలు కొని తీరుతాను!' అని నేను శపథం చేసుకోవాలని అనేవారు. 'బాగుంది! బతికి బాగుంటే చిరకాలమూ అదే ధ్యానంలో ఉండాలంటున్నారా? అని నేను అమ్మమ్మని అడిగేదాన్ని!" అనేది శకుంతల.

మామూలుగా ఆడపిల్లలకి ప్లాస్టిక్ బొమ్మలంటే ఆశ; కొత్త కొత్తగా ఏ వస్తువు చూసినా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అటువంటి అమ్మాయికి కమ్మలంటే ఎటువంటి మోజు లేదే! . . . కాని, ఆ తరువాత గభీమని పిచ్చి పట్టుకుందా?

“ . . . చెవిపోటుకి రెండు బొట్లు మందు వెయ్యడానికే మా ఆయనకి ఇబ్బందిగా ఉంది . . . ఇక వజ్రం కమ్మలు కొనడానికి మనసు రావడం ఏం అంత సులభం అంటున్నారా?” అని శకుంతల అనలేదూ?

ఆ అలుకతో తనకి కమ్మల మీదున్న అభిలాష శకుంతల వొదులుకుందా? అలాగని నమ్మడానికి నాకు కష్టంగా ఉంది.

ఇంతలో మా అల్లుడుగారు వస్తున్నారన్న అనే వార్త ఖాయమైంది. నేను అందుకోసం కాచుకొనివుండలేదు. అవును మరి, భార్యని చూడాలని అతను ఆతురతతో ఉండరా? ఇదిగో, ఈ మూర్తి దంపతులని నేను చూస్తున్నానుగా?

ఆరేడు సంవత్సరాల ముందు . . .

దీపావళి పండుగకి - అల్లుడనే ధోరణిలో - అత్తగారింటికి వెళ్ళడానికి మూర్తి కాచుకొనివున్నారు. కాని ఏదో దుర్ఘటన వలన వాళ్ళు ఆ సంవత్సరం పండుగ ఆచరించలేదు. మూర్తికి అదొక పెద్ద నిరాశ.

“మా ఇంట్లో ఆ వేడుక జరగనీ! మీరిక్కడే గంగాస్నానం చెయ్యండి!” అని మేం మూర్తికి చెప్పాం. ‘అతను సమ్మతిస్తారా? అతనికి తృప్తిగా ఉంటుందా?’ అని మేం ఆలోచించాం.

ఆ సమయంలో మంచి చలి. పిల్లల్ని చలి తాకవద్దని ద్వారం మూసేసాను. మామూలుగా సంవత్సరంలో పదకొండు మాసాలు తంతి కిటికీలు మూడబడివుంటాయి. ఎవరో పిలిచారని ద్వారం తెరిచాను. మూర్తిని ఎదురుచూస్తున్నాను. పొద్దున్నే గంగాస్నానం చెయ్యాలనే కారణం వలన మా ఇంటిలేనే నిద్రపోవడానికి అతన్ని రమ్మన్నాం.

మూర్తి బయట నిలబడుతూ, భుజంమీదున్న తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ “అబ్బ, ఎంత ఉక్కగా ఉంది! . . . ఎక్కడైనా పారిపోవాలని ఉంది!” అని గొణుక్కోడం విని ఉలిక్కిపడ్డాను.

‘విరహతాపం’ అంటే ఇదేనా? ‘చంద్రుడు వేడిగా ఉన్నాడు’, ‘వెన్నెల వెచ్చగా ఉంది,’ అని ప్రియులు వాపోవడం గురించి కవులు రాసివున్నారుగా?

“పారిపోవాలనుకుంటున్నారు, అడ్డు వచ్చేసింది!” అని తలుపు తెరిచాను; అతను మరేం అనలేదు. లోపలకి వచ్చిన మూర్తి మొహం చూసాను; బాగా

కుంగిపోయింది. 'పాపం, అతను అత్తగారింటిలో వేడుకలు అనుభవించవలసిన సమయం!' అని గుర్తుచేసుకున్నాను.

ఆ మరుదినం మూర్తి స్నానం తరువాత కొత్తబట్టలు ధరించి మాకు నమస్కరించారు.

"మీరు మీ డబ్బుతో కొన్న బట్టలే ధరించారు, కాని ఈ పండుగని మాతో, మా కుటుంబంలో ఒకరుగా కొనియాడాలని వచ్చారని మాకు చాల సంతోషం," అని మైతిలి నాన్నగారు అన్నారు.

నేను కూడా "పాపం, మీ ఆవిడ ఈ  దీపావళి నిరాశ ఎలాగో భరించాలి. మీ తల్లిదండ్రులు కోడలికి ఒక  చీర కొని పంపితే సరిపోతుందా?" అని అన్నాను.

అప్పుడే మైతిలి గభీమని "అంకుల్, మీ శకుంతల ఆంటీని, మిమ్మల్నీ మీ ఇంటిలో దీపావళి పండుగకి ఎందుకు పిలవలేదు? మీ అత్తగారింటిలోనే కదా పండుగ లేదన్నారు?" అని ధైర్యంగా ఒక ప్రశ్న అడిగింది.

పన్నేండేళ్ళు నిండిన మైతిలి ఆ ప్రశ్న అడిగింది! ఆ వయసులో దాంపత్యంలోని తీయని కలలు దాని మనసులో తేలుతూ ఉంటాయని ఈ రోజుల్లో ఎవరికి తెలుసు? తెలిసినా ఏం లాభం? మా మైతిలికి పదిహేనేళ్ళు నిండగానే దాని వరుడుకోసం వెదికాం; మూడు సంవత్సరాల తరువాతే దానికి పెళ్ళి అయింది.

అదే ప్రశ్న మూర్తి తన అంతరంగిక, ప్రేమహృదయంలో ఎన్నిసార్లు వినివుంటారో? కాని అతనికి తన తల్లిదండ్రులని "మీరు ఈ సారి నా భార్యని పండుగకి పిలవండి, నేనూ వస్తాను! మా అత్తగారింటిలోనే మేం దీపావళి పండుగ పాటించాలని శాస్త్రం ఉందా ఏమిటి? ఏదో దుర్ఘటన వలన మా అత్తగారి కుటుంబానికేకదా మైల, మనకి కాదే?" అని అడగాలని తోచలేదు. నాకూ ఆ ఆలోచన రాలేదు; వచ్చివుంటే నేనూ అడిగివుంటాను.

ఆ దీపావళి పండుగ తరువాత, ఆరు మాసాల్లో, మూర్తి మా ఇంటిపొరుగుల్లో భార్య శకుంతలతో కాపురం ఆరంభించారు. అప్పటినుంచీ మా ఇద్దరి కుటుంబాలమధ్య, ఆత్మీయత బాగా వర్ధిల్లుతోనే ఉంది . . .

ఇప్పుడు, ఈ దిక్కుమాలిన సంగతి వలన ఈ దంపతులు అవన్నీ మరిచిపోయారు . . .

వాళ్ళిద్దరూ రాజీపడాలని నేను తొందరపటుతున్నాను; అదే నాకు కావాలి! వాళ్ల తల్లిదండ్రులో, పిల్లలో ఉన్నారంటే ఈ దంపతుల కలహం మా ఇంటివరకు వచ్చివుంటుందా?

నేను వెళ్ళినప్పుడు ఇద్దరూ తలా ఒక పుస్తకం చదువుకుంటూ ఒకే గదిలో మూలకొకరుగా కనిపించారు. "చెవిపోటు తగ్గిందా?" అని అడుగుతూ శకుంతల పక్క కూర్చున్నాను.

"బాగా తగ్గింది, . . " అని గంగానదిని చూడకుండానే గంగాస్నానం చేసిన ధోరణిలో శకుంతల జవాబు చెప్పింది.

"నాకూ ఇప్పుడు చెవిపోటు వచ్చేసింది!" అని మూర్తి ఉత్సాహంతో అనగానే "చెవిపోటు అంటురోగం కాదే?" అని నేను నవ్వాను. భార్యతో దెబ్బలాడినా దానితో కలిసి చెవిపోటులో వంతు తీసుకోవడం అతనికి ఎంత సంతోషంగా, తృప్తిగా ఉంది!

'మందు వెయ్యడానికికూడా అతను . . . ' అని శకుంతల గొణుక్కుంది.

"నా దిష్టివలనే నీకు చెవిపోటు వచ్చిందనుకున్నాను. మూర్తిమీద ఎవరి దిష్టి పడింది?"

"నాకతను మందు వెయ్యడానికి గొణుక్కున్నారకదా? అందుకు శిక్ష కాబోలు!"

ఇదేం మాట! నాలుగు రోజులుగా ఇదే తంతు అన్న మాట! ఇద్దరూ ఎంత పట్టుదలతో ఉన్నారు! ఒకరితో ఒకరు మాటాడకుండా, చెవిపోటుతో బాధ పడుతూ రోజులు లెక్కపెడుతున్నారు!

"ఊరుకో, మరేం అనవద్దు! మీ జగడం మందులగురించా లేక చీరలు, నగల గురించా? ఇంతకుముందు ఎప్పుడైనా దీపావళి పండుగలలో మీరిలా దెబ్బలాడుకున్నారా? 'చీరలని చూడడానికి మా ఇంటికి రా,' అని నేను నిన్ను పిలవడం నేను చేసిన పెద్ద పొరబాటు అని నాకు బాధగా ఉంది," అని నేను మందలించాను. ఆ రోజు చలిలో ఉక్కగా ఉందని అన్న మూర్తి ఇప్పుడూ అలాగే నాముందు కనిపించారు.

శకుంతల మెల్లగా హీన స్వరంతో మాటాడింది: "ఆంటీ, అతను నాకోసం ప్రత్యేకంగా ఏమీ చెయ్యాలని నేనడగను; చీర కొనవద్దు; నాకు మందు వెయ్యడానికి

తొందరపడవద్దు. ఐతే అతనికి మనసులో నాగురించి రవంతైనా ఆలోచన ఉందా? లేదు! అదే నాకు బాధగా ఉంది."

"అతనికి మనసులో లేదని నీకెలా తెలుసు?"

"అతని మాటల్లోనే తెలుసుకున్నాను . . . నేను చీరలు తీసుకొని రాగానే అతని మొహం ఎలా చిరచిరలాడిందో తెలుసా?"

"వెంటనే అతనితో మాటాడడం ఆపేసావన్నమాట! అబ్బా, నీకెంత తొందర!"

"నాకేం తొందర లేదు, ఆంటీ . . . ఇతనే మొహం ముడుచుకొని 'ఈ ఆడవాళ్ళకి ఎప్పుడూ తొందర, నిరాశ!' అని సర్వసాధారణంగా మాటాడుతున్నట్టు నన్ను తిట్టారు."

ఇప్పుడే మూర్తి గళం తేర్చుకొని మాటాడాడు: "ఆంటీ, మీరన్నది నిజం, దీనికి ఎప్పుడూ తొందరే! నేనుకూడా దయారాం షాపులో కొత్తచీరలు వచ్చాయని విన్నాను, వెళ్ళిచూసాను. హఠాత్తుగా, ఎవరికీ చెప్పకుండా చీరలు కొనాలని ఏర్పాటు చేసాను, డబ్బుకోసం కాచుకొనివున్నాను . . . ఇంతలో ఇది ఒక చీరల మూటతో ఇంటికి వస్తోంది! నాకెలా ఉంటుంది, చెప్పండి? 'మీ భార్య ఎదురుచూడని సమయంలో దానికి కానుకలిచ్చి మురిపించండి!' అని భర్తలకి ఉపదేశం ఇవ్వడం ఇప్పుడు అలవాటైపోయింది! వీళ్ళూ అది మనకి చదివి చూపిస్తారు, కాని ఆ అవకాశం భర్తకి ఇవ్వరు! వీళ్ళకి ఎప్పుడూ తొందరే!"

శకుంతల ఇప్పుడు మూర్తిని చూసిన చూపు ఎలా వర్ణించడం? తళతళమని మిరిసే ఆశాభావం మొహాన్ని కప్పేసింది. సిగ్గూ, సంతోషమూ, కలిసిరావడంతో, సర్దుకొని మెల్లగా, "ఆంటీ, నేను ఎదురుచూడనిది అతను నాకు కొనియివ్వాలంటే ఎలా సాధ్యం? నాకేం కావాలని అడిగితే నా మనసులో ఒక పెద్ద జాబితా ఉంది - అందులో అర్ధణా నుంచి వెయ్యిరూపాయల వరకూ ఎన్నో వస్తువులున్నాయి! అందులో అతను నాకని ఏది కొన్నా నాకు ఇష్టమే! ఆతనికీ ఆ ఆశ ఉందంటే నాకది చాలు, మరేం వద్దు!" అని తటాపటాయించుతూ మాటాడింది.

"మరేం అనవద్దు! మీ ఆయన మనసులో ఏముందో ఇప్పుడు తెలిసిపోయింది కదా? . . . నీ మనసుని కొంచెం మార్చుకొని ఆలోచించు . . . 'చెవిపోటుకి మందు వెయ్యడానికి జంకుతున్నారు, నాకితను కమ్మలు కొంటారా?' అని నువ్వు నన్ను

అడిగావుకదూ? కమ్మలు లేని నీ చెవులు చూసి విసుగ్గొనే అతను నీ చెవులకి మందు వెయ్యడానికి రాలేదని నా ఉద్దేశం! రెండువేల రూపాయల దుద్దులుకి బదులు రెండు బొట్టుల మందుతో నీకు మర్యాద చెయ్యాలంటే అతనికి బాధగా ఉండదా?" అని నేను ధైర్యంగా అదమాయించాను. దానితోబాటు, 'శకుంతలకి కమ్మలంటే ఆశ,' అనే సందేశం మూర్తి చెవులకి నిగూఢంగా తెలియజేసాను.

పాలు పొంగి పొయ్యిలో పడిపోతే ఆ వాసన వ్యాపించకూడదని వేడి బొగ్గులమీద ఉప్పు జల్లుతాం. అలాగ కొంచెం సేపు ఆ దంపతులతో మాటాడి 'పండుగకి చీరలు కొన్నప్పుడు ఇరుగుపొరుగులవారిని పిలవకుండా ఎలా సాధ్యం? అందుకే మీ శకుంతలని రమ్మన్నాను, అందువలనే ఈ గొడవంతా!' అని మూర్తికి సాకు చెప్పాలని నేను ఆలోచిస్తూంటే . . .

"అమ్మా, . . . అమ్మా!" అని ఎవరో పిలిచారు. మైతిలి పరుగెత్తుకొని వచ్చింది. "అతను వచ్చేసారు . . . " అని మెల్లగా అంది.

"ఎవరు? . . . అల్లుడుగారా?"

"అవును . . . గుమ్మం దగ్గర . . . "

"ఎంత సేపయింది?"

"ఇప్పుడే . . . నువ్వు వెళ్ళు . . . "

"నువ్వూ రా," అని చెప్పి అల్లుడుగారికి స్వాగతం చెప్పడానికి సిద్ధమైయ్యాను. గుండె కొట్టుకుంది; ఇంటిలో ఎవరూ లేరు: పిల్లలు స్కూలులో, మా ఆయన ఆఫీసులో . . .

"నేను రాను . . . నేనింకా జుత్తు అల్లుకోలేదు . . . " అని మైతిలి గొణుక్కుంది.

శకుంతల, మూర్తి నన్ను అర్థపుష్టితో చూసారు. నేనూ వాళ్ళని అర్థపుష్టితో చూసాను. శకుంతలతో "ఇదిగో, నువ్వు మైతిలిని చూసుకో . . . కొంచెం సేపు తరువాత దాన్ని ఇంటికి పంపించు!" అని చెప్పి కదిలాను. అల్లుడుగారు గుమ్మం దగ్గర కాచుకొని వుంటారని పరుగెత్తుకొని వచ్చాను.

"మీకేం తొందర వద్దు! Take it easy! నన్ను చూడగానే మైతిలి తొందరగా ఎక్కడికో పరుగెత్తుకొని వెళ్ళింది! మీరూ తొందరగా ఎక్కడినుంచో పరుగెత్తుకొని వస్తున్నారు! మీ అందరితో సహజంగా మెలగాలనే నాలుగు రోజులు ముందు నేను

వచ్చాను, మీరూ అలాగే సహజంగా మెలగాలి . . . లేకపోతే నేను తిరిగి వెళ్ళిపోతాను!" అని నకిలీ కోపంతో అతను నాకు స్వాగతం చెప్పారు.

"మైతిలి త్వరలో వచ్చేస్తుంది!" అని చెప్పి అతనికి భోజనం సిద్ధం చేసే పని ఆరంభించాను.

చాలాదూరం రైలు ప్రయాణం చేసిన అలసట తీర్చుకోవాలని అల్లుడుగారు స్నానం ముగించి, బట్టలు మార్చుకొనే వేళకి మైతిలి శకుంతల సాయంతో చక్కగా ముడికట్టుకొని, నిలువుటద్దంలో పాదాదికేశం తన్ను చూసుకొని, ధైర్యంగా వస్తుంది. ఆ తరువాత శకుంతల, మూర్తి మాటాడుకోనీ, వాదించుకోనీ! 'మగవారు ఎప్పుడూ తొందరపడరా?' అని శకుంతల తప్పకుండా మూర్తిని అడుగుతుంది! మైతిలి భర్తని నిదర్శనంగా చూపుతుంది.

** ** **

ఒక రాయబారిగా నేను చేసిన ఘనకార్యంకి నేను గర్వపడ్డాను. దానిగురించి మా ఆయనకి చెప్పాలని నాకు ఆతురత. ఆఖరికి దీపావళి సందడి తగ్గిన తరువాత అతనికి వివరించాను. దానికి ప్రతిఫలం ఏమిటో తెలుసా?

"సరేలే, అల్లుడుగారిని కుషీచేసే అత్తగారు నువ్వు అని ఖాయమైంది. కాని కొడుకూ, కోడలూ మధ్య జగడం వచ్చిందనుకో, అప్పుడేం చేస్తావ్? రాజీ చేస్తావా లేక దాన్ని ముచ్చటగా చూసి ఆనందిస్తావా?" అని అతను అడిగారు.

మా ఇంటికి కోడలు రావడానికి, నేను అత్తగారుగా అధికారం చెలాయించడానికి ఇంకా చాలా కాలముంది. కాని అంతలోనే మా ఆయన కల్పనాశక్తి ఎంత తొందరగా పని చేస్తుందో చూసారా? నాకెలా ఉంటుంది? కాని నా మనసులో చెలరేగిన ఉద్రేకంలో, మా బంధుత్వం ఎలా మారిందో తెలుసా? హోమాగ్నిలో సృజించిన భస్మం - విభూతి - లాగ కనిపిస్తోంది!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, నవంబర్ 11, 1956)**


ஒளிந்து பூ
விந்தியா

# దాగిన పుష్పం

లలిత కళ్ళు పదే పదే తడిసిపోయాయి.

కొన్నిసార్లు ఆమె మొహం వాడిన గులాబీ పువ్వులాగ ముడుచుకొనివుంటుంది; గులాబీ మొగ్గలాగ ముక్కు ఎఱ్ఱపాఱుగా కనిపిస్తుంది. వికసించిన పుష్పదళంలో మంచుబొట్లు లాగ కళ్ళలో నీరు నిలబడివుంటుంది. ఇలాగ తరచుగా ఆమె మొహంలో కనిపించే నిగూఢమైన అందాలు చూసి భర్త శేషగిరి ఆనందించలేదు.

ఇక భరించలేక లలిత జాడగా తన మనసు తెలియజేసింది; చమత్కారంగా మాటలాడింది; ఎత్తిపొడిచింది. శేషగిరి మండిపడ్డాడు. పువ్వులచెట్టులో పువ్వు ఉందని చూడకుండా ముళ్ళు ఉందని కోపించుకొని ఆ మొక్కని పీకిపారేయాలన్న ఆవేశంతో మాటాడాడు. "సరేలే, నీకు అనుమానం అంటే అలాగే కానీ! నాకూ మంచిదే!" అని అరిచాడు.

'నాకు అనుమానం అంటే అతనికి మంచిదా? అదెలాగ?' అని లలిత ఆలోచించింది. తరువాత హాయిగా తనలో నవ్వుకుంది: చెంతెనజేరకుండా, అదే సమయం దూరంగా ఉంచడానికి ఇష్టపడక భార్యని తన అదుపులో ఏలడానికి శేషగిరి పన్నుతున్న పథకం అది!

లలిత మనసు కుదుటపడింది. సంతోషించింది. చేతిబిడ్డని మమకారంతో చూసే తల్లిలాగ భర్తని చూసింది. చాలా రోజులు మనసుని దృఢపరచుకొని భర్తని అర్థించుకుంది. కాని ఆఖరికి శేషగిరి నిర్లక్ష్యమే మిగిలింది. "ముందు నువ్వు పిల్లల్ని చూసుకో! తల్లికి అదే ముఖ్యమైన బాధ్యత!" అని హెచ్చరించాడు.

"పిల్లల్ని చూసుకోవాలనే ఆతురతలో కొన్నిసార్లు నాకు మీ అవశ్యకతలు తెలియవు!" అని క్షమాపణ కోరుతున్నట్టు లలిత అనగానే శేషగిరి "నీ సంరక్షణ కావాలని నేను ఏడవలేదు!" అన్నాడు.

"మీ మనసులో అలావుందేమో?" అని లలిత అనగానే "అదేం మాట? వెళ్ళు, పిల్లల్ని చూసుకో, లేకపోతే నిద్రపో!" అని ఘాటుగా అన్నాడు.

మంచి పౌర్ణమి వెన్నెలలో,  పిల్ల గాలి వీస్తూంటే భర్తతో నాలుగు మాటలు పంచుకోవాలని లలితకి ఆశ. కాని ఉయ్యేలలో నిమ్మళంగా నిద్రపోతున్న పాపని కారణం చెప్పి భర్త "వెళ్ళు!" అని అంటే  లలిత ఏం చేస్తుంది?

శేషగిరి బాగా మారిపోయాడు. ముందున్న ఉత్సాహం ఇప్పుడు లేదు, ప్రేమానురాగాలు మాయమైపోయాయి. ప్రియమైన భార్య అనే భావన పూర్తిగా పోయింది. 'లలిత ఒక తల్లి!' అనే జ్ఞాపకం మాత్రం అతని మనసులో బాగా తచ్చలాడుతుంది; అదీ శాశ్వతమేనా?

రెండవ శిశువు కానుపు సమయంలో శేషగిరి బ్రహ్మాండంగా లలితకి అన్ని వసతులూ సమకూర్చాడు. పుట్టినిల్లుకు వెళ్ళవద్దని ఆమెని తన సంరక్షణలో ఉంచుకొని ప్రేమానురాగాలతోబాటు డబ్బుకూడా ఎక్కువగానే ఖర్చు చేసాడు. చాలా గర్వంతో ఇంటికీ, ఆసుపత్రికీ నడిచాడు. అలాంటి మనిషి  - లలిత ప్రసవించి ఇంటికి వచ్చి రెండు నెలలు కూడా అవలేదు -  బాగా మారిపోయాడు! లలితకి ఎలాగుంటుంది? దుఃఖం ఆవరించుకుంది.

లలిత సద్దుచెయ్యకుండా లేచింది; టార్చ్ లైట్ తో నిద్రపోతున్న భర్తని చూసింది. ఆ నిశ్చలమైన ముఖం, దివ్యమైన భంగిమ చూసి 'ఇందులో ఏదో ఒక రహస్యముంది; ఇతను మనసులో ఏమనుకుంటున్నారో?' అని ఆలోచించింది.

మొహంమీద వెలుతురు కొంచెం సేపు కొనసాగిందేమో, శేషగిరి లేచాడు; రెప్పలు ములుచుకొని కోపంతో లలితని చూసాడు. "నువ్వింకా నిద్ర పోలేదా? నీ ఒళ్ళు ఏమౌతుంది? ఇలాగుంటే పాపకీ మంచిదికాదు!" అన్నాడు.

"అబ్బోయ్, మీకు పెద్ద బెంగ పట్టుకుంది!"

"నీకు లేని బెంగ నాకెందుకు? . . . ఛీ. ఛీ  డబ్బిచ్చి తేలుని కొట్టమన్నట్టుంది!" అని విసుగ్గుంటూ దుప్పటిని బాగా లాగి కప్పుకొని శేషగిరి మళ్ళీ నిద్రపోయాడు.

"నాకూ అలాగే ఉంది. కొన్నిరోజులు అమ్మా, నాన్నకి సాయంచేస్తూ పుట్టిల్లులో హాయిగా ఉంటే బాగున్ను, అదీ చేతకాదు! ఇక్కడా మీ మాటలు వినాల్సిందే!" అని గొణుక్కొని లలిత, మనసు కృంగిపోయి, నిద్రపోతున్న ఇద్దరు పిల్లలమధ్యవెళ్ళి పడుక్కుంది.



కాని నిద్ర రాలేదు. ఆమె పడుతున్న బాధ పిల్లలికి తెలియదు; భర్తకీ తెలియదు. ఆఖరికి లలిత గడచిన రోజుల తీయని జ్ఞాపకాలు గుర్తుచేసుకొని తృప్తి పడింది. పుట్టిల్లులో మొదటి బిడ్డని ప్రసవించి ఆరు మాసాల తరువాత ఇంటికి వచ్చినప్పుడు శేషగిరి ఎంత వైభవంతో స్వాగతం చెప్పి తన్ను ముద్దులాడాడు, గౌరవించాడు! "మరెప్పుడూ మనలో ఎడబాటు రాకూడదు!" అని పదే పదే అనలేదూ? కాని, ఇప్పుడో?

'లలిత ఎంత అదృష్టవంతురాలు!' అని ఆ జానకికి ఒకటే ఆశ్చర్యం! జానకి లలిత స్నేహితురాలు. కాని, దానికేం తక్కువ? జానకి తన నాలుగవ కాన్పుకి పుట్టిల్లుకి వెళ్ళింది. కాని ఆమె భాగ్యవంతురాలు. మొదటి బిడ్డతో ఆమె ఇంటికి వచ్చినప్పుడు స్వాగతం గొప్పగా లేకపోయినా నాలుగవ బిడ్డతో వచ్చినప్పుడు అది అతిశయంగా కనిపించింది. అవును, భార్య కొఱత, ఇల్లాలి అవశ్యకత రోజూవారిగానే భర్తకి అర్థమౌతుంది. ఆ భాగ్యం తనకి లేదని లలిత నొచ్చుకుంది.

లలిత నిట్టూర్పు వదలడం జానకి గమనించింది. "కాన్పుకి పుట్టిల్లుకి వెళ్ళివచ్చిన భార్య అంటే గౌరవం ఎక్కువే!" అని లలిత అన్నప్పుడు జానకి ఆ విమర్శలో లలిత తన కొత్త పట్టుచీర గురించి ఎగతాళి చేస్తోందని అనుకుంది. కాని ఇంకొకరోజు లలిత కొంచెం అహంకారంతో "పుట్టిల్లంటే మనకి ఒక మంచి మార్పు అన్నమాట! భర్తకీ అది ఒక సదుపాయం. నేను ప్రసవంకి పుట్టిల్లుకి వెళ్ళకపోవడం నేను చేసిన పెద్ద పొరబాటు!" అని నొచ్చుకుంది; కళ్ళు తడిసిపోయాయి; అప్పుడుకూడా జానకి ఎక్కువగా పట్టించుకోలేదు.

ఆ తరువాతనే ఒక రోజు జానకికి లలిత మనసులోని భారం అర్థమైంది. లలిత ఇంట్లో కనిపించిన మార్పు చూడగానే జానకి నీరసంగా నవ్వుతూ "ఇదేం ఏర్పాటు?" అని అడిగింది. లలిత మొహం ఎలాగో ఐపోయింది. పక్కపక్కగా ఉన్నరెండు మంచాలు విడివడిగా వేరేవేరే గదుల్లో చోటుచేసుకున్నాయి. "అన్నయ్య, చెల్లెలు లాగ ఉంటున్నారా? కుటుంబ భారం పెరుగుతుందని భయమా?" అని అడిగేసింది జానకి.

"అలాగైతే నాకొక వదిన రాకుండా ఉంటే మంచిది!" అని అంటూ లలిత పళ్ళు కొఱకడంతో జానకి నోరు మూసుకుంది.

లలితకి తన దాంపత్యజీవితంకి హాని కలుగుతోందని భయమా? దానికి ఆధారం ఏమిటి? ఆధారం ఉన్నా ఆమె ఎలా చెప్తుంది? చాలామంది స్త్రీలు చదువుతున్న కాలేజీలో శేషగిరి ప్రొఫెసరుగా పనిచేస్తున్నాడు; పడుచు పిల్లలతో పరిచయంకి చాలా అవకాశాలున్నాయి.

ఉద్యోగం రీత్యా ఆమె భర్త నాలుగు చోటలకి వెళ్ళి ఇతరులతో మెలగాలి. అలాంటప్పుడు లలిత అతన్ని అనుమానించడంలో ఏమైనా న్యాయముందా? ఇదే లలితకి నాజూకుగా తెలియజేయాలని జానకి ఆలోచించింది. కాని ఆ తరువాత ఒక రోజు లలిత, శేషగిరి పిల్లలతో సినిమాకి వెళ్ళడం చూసిన తరువాత జానకి మనసు నిశ్చలపడింది. 'దాంపత్యంలో ప్రేమానురాగాలు అంత సులభంగా చెదరిపోవు!' అనే నమ్మకం కలిగింది.

కొన్నిరోజుల తరువాత జానకి లలితని చూడడానికి వెళ్ళింది. లలితని చూసి అదిరిపడింది; లలిత తారుమారుగా కనిపించింది. "ఏమిటీ మూటా, ముల్లే, అంతా? ఎక్కడకి ప్రయాణం?" అని అడిగింది.

"మరెక్కడికి? పుట్టిల్లుకే! ఇక ఇతనికి నా వలన ఏ బాధా ఉండదు! ఇతనే 'వెళ్ళు!' 'వెళ్ళు!' అని తరుముతున్న తరువాతకూడా నాకు రోసం లేదా?" అని లలిత ఏడ్చింది.

జానకి ఓదార్చింది: "అలాగేం అనకు! అప్పుడప్పుడు 'పుట్టిల్లుకి వెళ్లాలి,' అని నువ్వు నాకు చెప్తుంటావ్, నీకు గుర్తుందా? అదే మీ ఆయన ఊహించి ఇప్పుడు నిన్ను పంపుతున్నారు.  ఇప్పుడు నీ కొత్త బిడ్డని చూపించడానికి వెళ్ళవలసిందే! సంతోషంగా వెళ్ళి రా!"

లలిత కళ్ళు తుడుచుకుంది కాని ఆమె మనోవ్యధ తగ్గలేదు.

"నువ్వు తిరిగిరావడం ఎప్పుడు? రెండు నెలలు . . .?" అని జానకి అడిగింది.

"ఏమో? మూడు, నాలుగు నెలలు కూడా అవొచ్చు! నేను లేకుండా ఈ ఇంటిలోని అయోమయం అతను అనుభవించనీ!" అంది లలిత.

** ** **

'భార్యని పుట్టిల్లుకి పంపించిన తరువాత శేషగిరి ఎలాగున్నాడు?' అని తెలుసుకోవాలని జానకికి ఆకాంక్ష. కాని, తను ఆడది, తనకెలా సాధ్యం? తన భర్తని

అడిగింది. అతను ముందు సమ్మతించలేదు. "బాగుంది, నువ్వు నాకు మంచి పని అప్పగించావ్!" అని నవ్వేసాడు.

"ఏం, అదేం తప్పా? మీకు శేషగిరితో ఎక్కువగా పరిచయం లేకపోవచ్చు, కాని నాకు లలిత మంచి స్నేహితురాలు. ఎది ఏమైనా మనం ఆ దంపతులకి మంచిది చేస్తే తప్పా?" అని జానకి వాదించింది; భర్త సరేనన్నాడు.

ఆ తరువాత చాలా రోజులవరకూ జానకి భర్తని అడగలేదు; అతనూ చెప్పలేదు. జానకి లలితకి ఉత్తరాలు రాసింది. ఒకే ఒక ప్రత్యుత్తరం వచ్చింది. అంతే! ఆ తరువాత మరేం కబురు లేదు.

ఒక రోజు జానకికి భర్త చెప్పాడు: "శేషగిరికూడా ఊరుకి వెళ్ళారని విన్నాను. ఒక నెల సెలవు తీసుకున్నారు."

"అలాగైతే, అతను భార్యతో తిరిగివస్తారు!" అని జానకి అంది; లలిత పుట్టిల్లుకి వెళ్ళి రెండు నెలలింకా అవలేదని గుర్తు చేసుకుంది.

ఆ మరుసటి నెల, "శేషగిరి వచ్చేసారు, నేనివాళ అతన్ని కాలేజీలో చూసాను!" అని జానకి భర్త అన్నాడు.

అవాళ సాయంకాలమే తన నలుగురు పిల్లలతో లలితని చూడడానికి జానకి వెళ్ళింది. ఇంటిముందు కొత్తగా ముగ్గు వెయ్యలేదు అని గమనించక "లలితా!" అని పిలుస్తూ సూటిగా వంటగదికే నడిచింది. గభీమని ఆగి, వెనకాడింది: పాత పంచెతో, రొమ్ముమీద బట్టలేవీ లేకుండా, చింపిరి జుత్తుతో శేషగిరి ఒక చెయిలో గిన్నెతో పొయ్యిదగ్గర నిలబడివున్నాడు. "ఎందుకు, లలిత లేదా?" అని జానకి అడిగింది.

తలుపునుంచి వేలాడుతున్న తువ్వాలుని తొందర తొందరగా లాగ్గొని శేషగిరి తన భుజంమీద వేసుకున్నాడు. "లేదు . . . అందుకే . . . " అని నవ్వుతూనే అన్నాడు.

"ఏం, ఎందుకు? మీతో లలిత రాలేదా?"

"లేదు; రాలేదు."

"ఎప్పుడు వస్తుంది?. . "

"వస్తుంది . . . ఇప్పుడు దానికి అస్వస్థగా ఉంది . . . వస్తుంది."

“సరే, నేను వస్తాను . . . ” అని సెలవు పుచ్చుకొని జానకి ఇంటికి వచ్చేసింది. లలిత వచ్చేసిందన్న నమ్మకంతో తను పిల్లల గుంపుతో వెళ్ళినందుకు సిగ్గుపడింది; శేషగిరి వంటగదిలో తన్ను చూసి తత్తరబాటు పడిన దృశ్యమూ గుర్తుచేసుకొని తనలో నవ్వుకుంది.

ఇంతకీ శేషగిరిని చూస్తే లలిత భయపడడానికి కారణముందేమో అని జానకి ఆలోచించింది.

శరదృతువులో ప్రకృతి వివిధవర్ణశోభితమై అలరిస్తున్నట్టు రోజులు, మాసాలు, త్వర త్వరగా గడిచాయి. లలిత రాలేదు. ఎందుకు రాలేదు? ఊరులో ఉన్న కొందరు తమిళులు అదే అడిగారు. ఒక పుట్టినరోజు విందు, ఒక సీమంతం, ఒక పాట కచేరీ - ఎదైనా సరే - అందులో కలుసుకున్నవారందరూ “లలిత ఎందుకు రాలేదు?” అని అడిగిన ప్రశ్న, చాలా దూరంలో, చెట్టు కొమ్మలో చిక్కుకున్న ఒక గాలిపటంలాగ అనిపించింది.

కాన్పుకి లలితని పుట్టినిల్లుకి శేషగిరి పంపనేలేదు; కారణం అతనికి మెట్టినిల్లుమీద ఏదో కోపం. కాని లలితకి పుట్టిల్లంటే గారాబం. ఈ జగడం వలనే దంపతులమధ్య ఎడబాటు చోటుచేసుకుంది.  అది శాశ్వతమా? ఆ ప్రశ్నే ఆ గాలిపటం దారమని చూసినవారందరూ తమకు తామే చెప్పుకున్నారు.

శేషగిరి ప్రేమలో కొఱత ఉందనే కారణం వలనే లలిత పుట్టినిల్లుకి వెళ్ళిందని జానకికి తెలుసు; లలిత సూటిగా దానిగురించి జానకికి చెప్పలేదు. కాని లలిత తారుమారుగా అన్న కొన్ని మాటలే అగ్నికణంగా మారి ఇక రాబోయే పొగ గురించి జానకికి హెచ్చరిక చేసాయి.

ఆ పొగ వ్యాపించినట్టు ఒక వార్త జానకికి అందింది; కొన్నిమాసాలుగా లలిత కుట్టుపని చేసి సంపాదించుతోందని అందరూ మాటాడుకున్నారు.

అప్పుడప్పుడు జానకి  శేషగిరిని చూసినప్పుడు “లలిత రాలేదా??” అని అడిగితే “లేదు” అనే జవాబు వచ్చింది. జానకి లలితకి ఒక ఉత్తరం రాసింది. దానికీ ప్రత్యుత్తరం రాలేదు. ఒక వారం తరువాత జానకికి ఒక ఉపాయం తట్టింది. భర్తతో మాటాడి శేషగిరికి ఒక ఉత్తరం ఇవ్వమంది. “నాకీ అలవాటు లేదు!” అని అతను విసుగ్గున్నతరువాత తనే

రాసేసింది. “లలిత ఎప్పుడు వస్తుంది? నాకు మన ఊరునుంచి కొన్ని చిల్లరసామానులు కావాలి. ఆమెని కొని తెమ్మనాలి, నాకు ఆమె ఎడ్రసు ఇవ్వండి,” అని రాసి తన పెద్దకూతురుద్వారా పంపించింది.

శేషగిరి ఉత్తరం వచ్చింది. “నా స్నేహితుడు ఒకతను వచ్చే వారం వస్తున్నారు. అతను మీకు కావలసినవన్నీ కొనితెస్తారు. ఆ లిస్ట్ ఏదో నాకివ్వండి, నేను అతనికి పంపుతాను. లలిత ఇప్పుడు ఏదో ఒక Nursing Home లో ఉంది. దాని పేరు, ఎడ్రసు నాకు తెలీదు, క్షమించాలి” అని రాసాడు.

జానకికి హోరున ఏడవాలనిపించింది.

మరికొన్ని మాసాలు గడిచాయి. జానకికి లలితమీద కొంచెం అతృప్తి కలిగిందన్నమాట నిజం. లలితకి రోసం ఉండవచ్చు, కాని ఆమెలో స్త్రీకి తగిన ఘనత కనిపించదేం? ఎంత కోపమున్నా ఏ ఒక ఉత్తరంలోనూ “మా ఆయన ఎలా ఉన్నారు?” అని లలిత అడగదేం?

దాంపత్యంలో రాజీ పడాలంటే ఆఖరికి ఆడదే దిగి రావాలి; ఇది లలితకి తెలీదా?

ఒక రోజు, అరుదుగా, శేషగిరి జానకి ఇంటికి వచ్చేసాడు. వసారాలో అతను తన భర్తతో మాటాడడం జానకి గమనించింది, కాని ఏమీ బోధపడలేదు. శేషగిరి కంఠధ్వని హీనంగానే ఉంటుంది. అతనెలా ప్రొఫెసరుగా ఉద్యోగం చేస్తున్నారని జానకి ఆలోచించేదికూడా.

“నా భార్యకి అదేం పెద్దపని కాదు!” అని చెప్పి జానకి భర్త జానకిని వెతుక్కుంటూ వచ్చాడు. “అతని భార్య రేపు వస్తోందట. రేపు రాత్రివేళకి భోజనం చేసి పంపించడానికి నీకు వీలవుతుందా అని అతను అడుగుతున్నారు” అన్నాడు.

“దానికేం? అవుతుంది. రేపురాత్రి మనింటిలోనో భోజనం చెయ్యవచ్చుగా?” అని శేషగిరి చెవులకి వినబడేలాగ జానకి అడిగింది.

“వద్దండి. మీరు రాత్రి పదిగంటలవరకూ కాచుకొని ఉండాలి. ఇది చలికాలం కూడా. మీరు భోజనం పంపిస్తే మంచిది” అన్నాడు శేషగిరి. సరేనని జానకి ఒప్పుకుంది.

శేషగిరి వెళ్ళిన తరువాత జానకి మనసులో ఒక అనుమానం లేచింది. శేషగిరి సంభాషణలో తరచుగా My wife అనే పదం వాడారని గుర్తు చేసుకుంది. తటాలున

"అతను Wife  అన్నారు. అది లలిత గురించే కదా? మరేం కొత్త భార్య కాదుకదా?" అని అడిగింది.

"నువ్వెందుకు అతన్ని అడగలేదు?"

"ఏమో, నాకు భయంగా ఉందండి."

"పెర్రిదానా! నువ్వే లలితకి మంచి స్నేహితురాలు. లేకపోతే మరెందుకు నువ్వు భోజనం పంపించాలని అతను అడుగుతారు?"

"అవును! నిజం!" అని జానకి మనసు కుదుటబడింది.

ఇన్నాళ్ళు తను కాచుకున్న అత్యంత స్నేహితురాలికి జానకి శ్రద్ధతో, అభిరుచితో భోజనం వండింది. శేషగిరి పంపిన ఒక ముసలివాడు వచ్చి దాన్ని తీసుకొని వెళ్ళాడు. ఆ రాత్రి జానకి నిమ్మళంగా నిద్రపోయింది.

తెల్లవారగానే జానకి లలితని చూడడానికి సిద్ధమైంది. "ఇవాళ మీ మధ్యాహ్న భోజనం మా ఇంట్లోనే!" అని చెప్పాలని తొందరపడింది.

ముందులాగే, హాలులో,  పుట్టిల్లుకి వెళ్ళేముందు కనిపించినట్టే, ఒడిలో పాప, పక్కనే పిల్లతో లలిత కనిపించింది. ఆమెలో ఏమీ మార్పు కనిపించలేదు. కాని జానకిని చూడగానే లలితని ఏదో భయం ఆవరించుకున్నట్టు అనిపించింది. "జానకి, రండి!" అనే స్వాగతంలో అత్యుత్సాహం చోటుచేసుకుంది.

"లలితా, ఆఖరికి మమ్మల్ని చూడాలని నీకుందన్నమాట! నాకెంఎదుకు ఉత్తరాలు రాయలేదు?" అని జానకి సూటిగా అడిగేసింది. అలా అడగనంతవరకూ తమిద్దరి అన్యోన్యతకి అర్థం లేదని ఆమె ఉద్దేశం.

లలిత మరేం అనక నవ్వేసింది.

"మీ ఊరులో దర్జీగా అందరికీ దుస్తులు కుట్టావని విన్నాను. దానికి నీకు బోలెడు టైముంది. అందులో రాబడి వస్తుంది. ఉత్తరాలు రాయడమంటే ఖర్చు, అవునా?" అని జానకి నవ్వుతూనే అడిగింది.

కాని లలిత నవ్వలేదు. "ఈ కబురు ఎంత త్వరగా వ్యాపించిందో చూసావా? కుట్టుపని ఆరంభించిన తరువాత ఒత్తిడి భరించలేక నేను పని తగ్గించుకోవాలని కూలీకి

దుస్తులు కుట్టాను. అందుకే చాలామందికి నా మీద ద్వేషం వచ్చేసింది! నేను వేడుకగా ఆరంభించిన పని! . . . నా కర్మ” అని నెత్తిమీద మెల్లగా కొట్టుకుంది.

ఇప్పుడే జానకికి లలిత తత్తరపాటు బోధపడింది. “నేను రాగానే నీతో కటువుగా మాటాడేసాను . . . నీ గురించి నేను చాలా భయపడిపోయాను!” అని అంది.

“అమ్మా!” అని కేకతో ఒక అమ్మాయి పరుగెత్తుకొని వచ్చింది.

పట్టు చొక్కాయి, పరికిణీ ధరించి, చెయిలో ఫలహారం పొట్లంతో వచ్చిన బాలికని చూసి జానకి ఉలిక్కిపడింది.

“ఓ, మీరా?” అని కుశలప్రశ్న అడిగిన శేషగిరినికూడా జానకి గమనించలేదు.

“లలితా, ఈ పాప?” అని జానకి అడిగింది.

“నాలుగు మాసాలైంది” అని లలిత మెల్లగా చిరునవ్వు నవ్వింది.

“నాకు మందమతి! నీ ఒడిలో ఉన్నది కొత్త పాప అని నాకు తెలియలేదు. ఏం పేరు పెట్టావ్?”

“దీనికి పేరు లేదు!” అని అంటూనే లలిత, వొంగి, బిడ్డ మృదువైన చెంపలో ముద్దు పెట్టింది.

“ఏం, ఎందుకు? పిలవకుండా వచ్చిన పాపకి పేరు చెప్పి ముద్దాడడం తప్పా? పరిమళమైన పువ్వుని దాచడం ఎలా సాధ్యం? దాన్ని ‘పుష్పా’ అని పిలు!” అని జానకి అదమాయించింది. లలిత చిరునవ్వు నవ్వుతూ ‘పుష్పా’ అని భర్తని చూసింది.

********

**(మూలం ప్రచురణ దినమణి కదిర్, జూలై 7, 1955)**



# விழா மாண்பு

'விந்தியா'

திராக்ஷைபோல், கலந்தும், கலவாமலும் உறவாடின எங்களிடையே, முந்திரிப் பருப்புகள் (கொட்டையல்ல!) போல, சில வட இந்திய ,நண்பர்களும் இருந் தனர். இது எனக்குப் பெருமையா

# ఉత్సవ వైభవం

చాలా రోజులుగా నాకొక అభిలాష: మా దక్షిణ భారతీయుల సంఘం ఆరంభించి ఎనిమిది సంవత్సరాలైపోయాయి. నేను నాలుగు సంవత్సరాలుగా కార్యదర్శిగా ఉంటున్నాను. కాని ఇంతవరకూ నా గుండె గర్వంతో ఉప్పొంగినట్టు మేం ఒక సంగీత కచేరీకూడా ఏర్పాటు చెయ్యలేదు. దక్షిణ భారతీయులు ఆహ్లాదించినట్టూ, ఉత్తరదేశ స్నేహితులు శ్లాఘించినట్టూ, ఒక మంచి కర్ణాటక సంగీత కచేరీ నిర్వహించాలనే ఆలోచన నా మనసులో బాగా నాటుకుపోయింది. కాని అది సఫలమవడానికి డబ్బూ, వసతి కావాలిగా?

త్రోవన పోతున్న ఎవరో గాయకులు వస్తారు, “కచేరీకి నాకొక చాన్సు ఇవ్వండి, పాడతాను, ప్రయాణ ఖర్చులు మీరు ఇస్తే అది చాలు!” అని బతిమాలుతారు. ‘కనీసం నూరు రూపాయలు వసూలైనట్టు చూడండి!” అని ఆరంభించి ఇరవై రూపాయలతో తృప్తి పడి వాళ్ళ ప్రయాణం కొనసాగిస్తారు. అటువంటి గాయకుల కచేరీలు  ఏర్పాటు చేసే ఇంత కాలమూ నేను నా ఋణం తీర్చుకున్నాను.

‘ఒక పట్టుచీర ఎందుకు? ఆ డబ్బుతో ఎనిమిది నూలుచీరలు కొనవచ్చుకదా?’ అని అంటూ ఆరు నూలుచీరలు కొన్నతరువాత గభీమని ఒక పట్టుచీర కొనే నా భార్య కమల సమర్ధత నాకు రావడానికి కొంచెం సమయం పట్టింది.

“బాధ్యత అని ఒకటి ఉందికదా?” అని ఎవరో నా చెవిలో నొక్కిచెప్పారు. అప్పుడే ఒక శ్రేష్టమైన కచేరీ ఏర్పాటు చెయ్యవలసిన అగత్యమూ, నన్ను కార్యదర్శిగా నియమించిన సంఘంకి నేను తీర్చవలసిన ఋణమూ నేను గ్రహించాను.

కమల చెప్పిన ధోరణి ముఖ్యమని చెప్పాలి. “అవును, ఏ గొప్ప సంఘం మీది? మాటకి ఒక త్యాగరాజ ఉత్సవం కూడా మీరు ఏర్పాటుచెయ్యలేదు! మీ సంఘంగాని ప్రయాణ ఖర్చులు భరించడానికి ఒప్పుకుంటే  చాలామంది విద్వాంసులు తప్పకుండా వస్తారు! అదీ మీ సంఘంకి చేతకాదు!  నెలకొక tea party! భోజనం,  బాతాఖానీ - ఈ రెండూ తప్పిస్తే మీరేం సాధించారు? ఎవరికో

promotion వచ్చిందని గొప్పగా విందుకి పిలిచి గౌరవించారు. ఆ మరుదినం ‘అతనొక పెద్ద తాగుబోతు!’ అని ఇరుగుపొరుగుల్లో అందరూ మాటాడుకోడం నేను విన్నాను!” అని కమల నన్ను ఎగతాళి చేసేది. మా సంఘం సభ్యులలో చాలామంది ఆంధ్రులున్నారు. కలకండ, ద్రాక్ష లాగ కలిసీ, కలవకుండా మెలిగే మా మధ్య జీడిపప్పులాగ కొందరు ఉత్తర దేశీయులూ ఉన్నారు. ఇది నాకొక గర్వకారణంగా ఉండేది. కాని కమల “మీ పెదిమలు పలికేవి తీపి మాటలు, అంతే; ఆ వెనుకనే మనసులో నిత్యమూ పగ, ద్వేషం!” అని నన్ను పరిహాసం చేసేది. కమల ఆంధ్రదేశంలో పెరిగింది. దాన్ని పెళ్ళాడిన కొత్తలో వాళ్ల ఊరునీ, తెలుగు స్నేహితులనీ నేను ఎగతాళీ చేసానట. అందుకే ఆమె మనసును చేదు ఆవరించుకుంది.

ఇటీవల మన ఆంధ్రసహోదరులు ‘మద్రాసు మనదే!’ అని అన్యాయంగా వాదించినప్పుడు నేను మరేం అనక ఊరుకున్నాను. కాని తనకీ ఆంధ్రుల కలతలు, ఆందోళనలు అసహ్యంగా కనిపించడం వలన కమల కొన్ని సమయాలు నామీదకూడా మండిపడేది. “మీ అంచనా సరే అని మీకు గర్వంగా ఉందికదూ?” అని నన్ను ఎత్తిపొడిచేది.

మా సంఘంలో మేం రాజకీయ చర్చలేవీ మితిమీరి మాటాడుకోకుండా సామాన్యంగా చాలా విషయాలు సంప్రతించుకుంటాం. సంభాషణలు అనుచితంగా చెడిపోకుండా మమ్మల్ని కాపాడడానికి సంఘంలో పత్రికలూ, ఆటలూ అందుబాటులో ఉన్నాయని కమలకి తెలియదు.

అజ్ఞానంతో ఆమె పలికిన మాటలు, అభిమానంతో ఆమె ప్రయోగించిన తిట్లు విని నేను కోప్పడలేదు. నేనే ఒక మంచి కచేరీ ఏర్పాటు చెయ్యాలని నిశ్చయించాను; కమల అభిలాషతోబాటు తక్కిన సభ్యులందరూ ఏకీభవిస్తారని ఊహించాను.

“ఆ కళాకేంద్రం చూసారా? వాళ్ళది చిన్న బృందం, జాగా ఒక చిన్న గుడిసెలాగ ఉంది! వాళ్ల రాబడి అంతా సంగీత శిక్షణకి పిల్లలిచ్చే ఫీజు మాత్రమే; ఐనా వాళ్లు బ్రహ్మాండంగా ఒక మంచి హిందుస్తానీ సంగీత విద్వాంసుని కచేరీ ఏర్పాటు చేసారు!” అని ఆ సంఘంతో మేం పోటీపడాలని కమల నన్ను ప్రేరేపించింది.

** ** **

నేను కళాకేంద్రం వెళ్లి ఆ నిర్వాహకుల బృందం, దాని నాయకుడిని కలుసుకున్నాను. ఇంతకుముందే నేనూ, కమల కళాకేంద్రం సభ్యులం, వాళ్ళూ మా సంఘంలో సభ్యులు. తరచుగా కలుసుకోకపోయినా మా అందరిమధ్యా సానుభూతి, మంచి పరిచయం ఉంది. నేనిప్పుడు వాళ్ళతో కలిసి ఒక మంచి సంగీత ప్రదర్శన గురించి ఆలోచించాను.

కర్ణాటక సంగీతంలో హిందోళం, హిందూస్తానీ సంగీతంలో మాల్కోస్ రెండూ ఒకే రాగం అని నిరూపించడానికి, వేరే వేరే ధోరణిలో పాడి, వాటి పోలికని విమర్శించే ఒక హిందూస్తానీ గాయకుడి ప్రదర్శన చూసినవారు ఆ గాయకుని ప్రావీణ్యంతోబాటు మనదేశ సంగీతశాస్త్రంలోవున్న ఘనత, సమృద్ధి, గుర్తుచేసుకుంటారు; అదే నా ప్లాను.

ఈ మూడు రోజుల వేడుకలో మూడు సంగీత కచేరీలు; మూడురోజులూ పేరుమోసిన విద్వాంసులు పాల్గొనకపోయినా ఒకరోజైనా తప్పకుండా ఒక ప్రసిద్ధమైన సంగీతవేత్త, తక్కిన రెండురోజులూ ముందుకు వచ్చే గాయకులు పాడతారు. ఈ మూడు రోజులూ కళాకేంద్ర సంఘం విద్యార్థుల సంగీత, నాట్య ప్రదర్శనలుకూడా చూడవచ్చు. అక్కడున్న బోధకులు వివిధ వాద్యాలతో - సితార్, వయలిన్, ఎస్రాజ్ - తమ నైపుణ్యం - అర్థ గంటకి చూపిస్తారు. ఈ ఉత్సవం కళాకేంద్ర సంఘంకి మంచి ప్రచారం . అందువలన వాళ్లు ఖర్చుల్లో ఒక వంతు భరిస్తారు; ఊరులో ఉద్యమంలో కలుసుకొని డబ్బు వసూలుచేస్తారు. వెలితి అని వస్తే దాన్ని నింపుతారు. ఇదే స్నేహభావంతో బాధ్యతలని పంచుకోవాలని మా రెండు సంఘాలు చేసుకున్న ఒడంబడిక.

ఈ కచేరీ మేం దీపావళి సమయంలో ఏర్పాటు చేసాం. దేశమంతా కోలాహలంగా కొనియాడే దీపావళి పండుగే మంచి సమయం, మా ఇరుగుపొరుగులలోవున్న గుజరాతీ స్నేహితులని విందుకు పిలుద్దాం అని నిశ్చయించాం.

"దీపావళి సమయంలోనా? మన ఇంటిలో దీపాలు వెలిగించాలి; పిండివంటలు చేయాలి; మూడురోజులూ ఇల్లు తాళం వేసుకొని మనం వెళ్ళాలంటున్నారా?" అని కమల నన్ను అడిగింది.

"ఇదేం పెద్ద ప్రశ్న కాదు! ఒక స్వీట్, ఒక కారం చెయ్, చాలు. దీపావళికి దీపాలు వెలిగించడం మన తమిళుల ఆచారంలో లేదు. అలాగే మన ఇంటిలో ఈ పండుగ జరగనీ!" అని నేను అనేసాను.

కాని నేను ఆశతో  ఏర్పాటుచేసిన కచేరీ వర్ధిల్లే చంద్రుడులాగ కాకుండా పాలిపోయిన చంద్రుడులాగైపోయింది. మేం నియమించిన విద్వాంసుడు రారని మాకు వార్త అందింది. ఉత్తరాలు, టెలిగ్రాములూ పంపాను, లాభం లేదు. ఆ తరువాత రేడియోలో ఒక మంచి AIR A Class గాయకుడుగా పాడే ఒకతన్ని పిలుద్దామనుకున్నాను; మంచి వేళ, అతను వస్తానన్నారు.

కమల కచేరీ ఏర్పాట్ల వివరాలు అడిగింది; నేనూ చెప్పాను. సుమారు ఆరువందలు రూపాయలు వసూలవుతుందని నేను అనగానే ఆశ్చర్యపడింది. తమిళ కుటుంబాలు నలభైకూడా మా  ఊరులో లేరు; ఆరువందలు వసూలవడం ఎలా సాధ్యం?

"మూడురోజుల ముచ్చటకి ఆరువందలు సరిపోతుందా?" అని కమల అడిగింది. నేను చెప్పాను.

"ఆ AIR  గాయకుడు వేరే కచేరీకని విశాఖపట్ణం వస్తున్నారు. అక్కడనుంచి మన ఊరుకి రావడానికీ, అతనికి మామూలుగా ఇవ్వవలసిన  ఫీజులో సగం ఇస్తే చాలు  అని ఒప్పుకున్నారు. రెండోరోజే దీపావళి. ఆ రోజే ఆ AIR artist కచేరీ. దానికి ముందురోజు కలకత్తానుంచి ఒక యువకుడు  వస్తున్నాడు. దీపావళికి మరుదినం ఒక solo violin కచేరీ. ఆ విద్వాంసుడు విజయనగరం సంగీత కళాశాలలో పట్టభద్రుడు."

"ఓ, అలాగా? అంటే తెలుగు విద్వాంసుడూ ఉన్నాడన్నమాట . . . అవును, అందరినీ మద్రాసునించి పిలవాలంటే డబ్బు చాలదే?" అని కమల కొంటెగా అడిగింది.

నేను చెప్పాను:

"అదేం పెద్ద ప్రశ్న కాదు. కలకత్తానుంచి వస్తున్న గాయకుడు మంచి వయలిన్ విద్వాంసుడు కూడాను. అతనే ఒక రోజు solo కచేరీ చెయ్యమని అడక్కూడదా? కాని ఖర్చులు లెక్కచెయ్యకుండా ఇంకొకరిని పిలవాలని నిశ్చయించాను."

"అదీ మంచిదే! దీపావళి రోజు పాడబోయే ఆ పేరుమోసిన గాయకుడుకి పక్కవాయిద్యంగా ఎవరూ లేరుగా? అతనికి ఇతను వయలిన్ వాయించుతారనుకుంటాను. మొదటిరోజు మృదంగం వాయించే విద్వాంసుడే తక్కిన రోజుల్లోనూ . . . " అని నేను చెప్తూంటే ఒక కుర్రవాడు సైకులులో వచ్చి మా ఇంటిముందు ఆగాడు. ఒక సంచినిండా కాగిత కట్టలు తీసుకొని వచ్చాడు.

"చూసావా, ఇవన్నీ నోటీసులు, ఆహ్వాన పత్రికలు!" అని అంటూ ఒక కట్ట విప్పాను.

"ఇదేంటి? . . . ఇన్ని రోజుల ముందే . . . ? అని హీనస్వరంలో సాగదీస్తూ, లేచి కమల ఇంట్లోకి వెళ్ళింది. దీపావళికి రెండు మాసాలముందే తనకు ఏం చీర కావాలని అన్న కమలలో కనిపించిన నిదానం గర్తు చేసుకొని నాలో నేనే నవ్వుకున్నాను. టపాకాయలు మోసుతున్న కుర్రవాడిలాగ ఇంటిలోకి ప్రవేశించాను.

"అంటే కచేరీ ఖాయమన్నమాట!" అని కమల తుంటరిగా అన్న మాటలు వినగానే 'ఇప్పుడే దీనికి నమ్మకం కలిగిందా?' అని నాకు కొంచెం విచారమూ కలిగింది.

** ** **

"రండి! రండి! చూడండి, దక్షిణ భారతీయుల సంఘం, కళాకేంద్రం ఏకంగా సమర్పించే ఉత్సవంకి ఆహ్వానం!" అని స్థానిక దిన వార్తా పత్రికలలో ప్రకటనలు వచ్చాయి.

ఆ కబురు వెలుబడిన తరువాత ఊరులో ఉత్సవంకి విరాళం వసూలు చెయ్యాలని బయలుదేరాం. మా ఇరుగుపొరుగుల్లో ఉన్న గుజరాతీయులు తోడ్పడతారని నమ్మకంతో కలుసుకున్నాను. "మేం ఆ మూడురోజులూ రావడం ఎలాగ? మా గుజరాతీ స్కూల్లో ఒక నాటకం చూడాలే?" అని అడిగారు. ఒకరోజుకూడా ఉత్సవంకి రానివాళ్ళ దగ్గర విరాళం ఎలా వసూలు చెయ్యడం?

ఐనప్పటికీ, విసుగ్గోకుండా, నా వాటాకి కొందరిని కలుసుకొని చందాలు పోగుచేసాను; చీటీలమూలంగా కాకుండా ప్రజల బహుమానం, కానుకలు ద్వారా డబ్బు సేకరించాలని నా ప్లాను.

దీపావళికి రెండురోజులముందే గుజరాతీలు పొద్దున్నే ప్రమిదెలు వెలిగించి, కొన్ని టపాకీలు కాల్చారు. "సాయంకాలం చేతకాదు, మనం వెళ్ళాలి, ఇప్పుడే వెలిగిస్తాను!" అని కమల తొందరగా ప్రమిదెలు వెదికింది; కాని వెలిగించడానికి దూది వత్తులు లేవని విసుగ్గొని ప్రమిదెలు వెతకడం మానుకుంది.

ఆ సాయంకాలం ఉత్సవం ఆరంభం. కలకత్కానుంచి వచ్చిన నారాయణ భాగవతర్ చక్కగా పాడారు. ఇంకా కొంచెం సేపు పాడాలని అతనికీ మనసులో ఉందేమో, కాని సమయం దొరకలేదు. అతను రెండున్నర గంటలే పాడినా, వేళ గడించిపోతున్నట్టు అనిపించనేలేదు, పదిగంటలైపోయింది. కచేరీ ఐదుగంటలకే ప్రారంభమైనా సంఘం అధ్యక్షుడు ప్రసంగం; కళాకేంద్ర అధ్యక్షుడు తరపున మరొక ప్రసంగం; ఆ తరువాత కొంచెం అమితంగానే కళాకేంద్ర విద్యార్థుల 'చిల్లర' ప్రదర్శనలు - ఇవన్నీ తప్పనిసరిగా చోటుచేసుకున్నాయి. ఈ మళ్ళింపులు పూర్తవకముందే దక్షిణ భారతీయ శ్రోతలకి విసుగు వచ్చేసింది. ఆఖరికి నారాయణ భాగవతర్ కచేరీ ఘనంగా ఆరంభమవగానే 'ఇదే ఇవాళ మొదటి ప్రదర్శనగా ఉండవలసింది!' అని నాకు కూడా అనిపించింది. కాని కావాలనేకదా నేను కార్యక్రమ ప్రోగ్రాం ఇలాగ తయారుజేసాను? తమ తమ పిల్లల ఆటల, పాటల ప్రదర్శనలు చూసిన తరువాత ఉత్తర భారత శ్రోతలు కొందరు లేచి వెళ్ళిపోయారు. కాని కొంతమంది గానంలో పరవశమై, ఆఖరి వరకూ విన్నారు.

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు కమల "కళాకేంద్ర ప్రదర్శనలు ఏం అంత గొప్పగా లేవు. నాకు బాగా చికాకు పట్టేసింది!" అంది. నేను సరి అని ఒప్పుకోలేదు. "ఇది వాళ్ళ స్కూలుకు మంచి ప్రచారం. అందుకే ఈ ప్రోగ్రాంకి వాళ్ళూ బాధ్యత వహించారు" అని అన్నాను. "ఔను, నిజం. కాని నారాయణ భాగవతర్ కచేరీ ఇంకొక గంట పొడిగించి ఉండాలి. అతను ఘన రాగాల్లో కీర్తనలు, అష్టపదులు పాడారు" అని కమల అతన్ని దారంతా పొగడుతూ వచ్చింది.

ఇంటికి రాగానే గంగా స్నానంకి అన్ని ఏర్పాట్లు చేసిన తరువాతే కమల నిద్రపోయింది. ఆ ఆలస్యం వలనే మేం గంగా స్నానంకి సిద్ధమవుబోతుంటే మా స్నేహితులు కొందరు "గంగా స్నానం అయిందా?"[1] అని అడుగుతూ మా ఇంటికి వచ్చేసారు.

"ఇవాళనైనా కొన్ని ప్రదిమెలు వెలిగించాలనుకుంటున్నాను!" అని ఒక నిట్టూర్పు వదులుతూ కమల ఎదుటింటిలో మినుకుమినుకుతున్న దీపాలని చూసింది. ఇంటిలో పెద్దవాళ్ళని ఎవరైనా ఉంటే స్నానంకి సకాలంలో సరిగ్గా లేపుతారు; చిన్నపిల్లలు ఉంటే టపాకాయల సందడి వినగానే అదిరిపడి లేస్తారు; మా ఇంటిలో ఉండేది మేం ఇద్దరం మాత్రమే; మేమే పెద్దలం, మేమే పిల్లలం.

"మాకూ పాటకచేరీలంటే చాలా ఇష్టం!" అని విర్రవీగుతూ కొందరు స్నేహితులు మాకు చెప్పి వెళ్ళిన తరువాత కమల నాకు చెప్పింది: "వీళ్ళందరికీ మనసులో దీపావళిగురించే ఆలోచన! మనకి రెండు వారాలుగా దీపావళికంటే పాటకచేరీలగురించే బెంగ!" ఆమె సూర్యరశ్మిలో వెలిగించిన దీపంలాగ ఆమె మొహం మాసిపోయింది

** ** **

ఆ సాయంకాలం జరగబోయే కచేరీ గురించి మాకు చాలా ఉత్సాహం. ఆత్మతృప్తికోసం పొద్దున్న ధరించిన బట్టలే సాయంకాలమూ ఇతరుల దిష్టికోసం ధరించాం. కమల ఎదురింటి నౌకరిని పిలిచింది. అతనికి ఒక కట్ట మైనపు వత్తులు అందించింది. "అందరూ తమ తమ ఇల్లల్లో దీపాలు వెలిగించినప్పుడు మా ఇంట్లోనూ వెలిగించు నాయనా!" అని చెప్పి నిండు హృదయంతో బయలుదేరింది.

వచ్చినది ఒక అపూర్వమైన విద్వాంసుడు కదా? కళాకేంద్ర సభ్యులు కూడా ఆ విషయం గ్రహించి తమ విద్యార్థుల ప్రదర్శనలలో అభిమానం అణచుకొని, ఏవో రెండు మూడు 'చిల్లర' వేడుకల తరువాత మిగతా సమయమంతా ఆ విద్వాంసుడికే వదిలేసారు.

"ఈ రోజు ప్రోగ్రాంలో ఒక చిన్న మార్పు!" అని మేం ప్రకటించాం.

[1] తమిళులు సంప్రదాయంగా ఈ వాక్యం దీపావళి దినం సంప్రదించుకుంటారు

“నిన్న పాడిన గాయకుడు ఇవాళ పక్కవాయిద్యంగా వయలిన్ వాయించరు. అతనికి బదులు సూర్యారావుగారు పాల్గొంటున్నారు.”

సుమధుర స్వరం, స్పష్టమైన భావ వ్యక్తీకరణ, ఆలాపనల్లో తనదైన శైలి ప్రదర్శించడం, సృజనాత్మకమైన సంగతులు వేయడం - ఇవన్నీ ఆ ప్రసిద్ధ గాయకుడి ప్రత్యేకతలు. కాని అతనికి తగినట్టుగా వయలిన్ పక్కవాయిద్యకారుడు రాణించలేదని తమిళ శ్రోతలు ఏకీభవించారు.

ఇంటికి మేం తిరిగివెళ్ళినప్పుడు కమల ఇదే ప్రస్తావించింది.

“అవును. వయలిన్ రాణించలేదు. అతను solo కచేరీలే చేసారనిపిస్తోంది; పక్కవాయిద్యం అలవాటు చేసుకోలేదు” అని నేను అన్నాను.

“ఐతే అతన్నెందుకు ఏర్పాటు చేసారు? ప్రోగ్రాంలో మార్పులు చేసారెందుకు?”

“కొందరు సభ్యలు - ఆంధ్రులు - ఆ మార్పు కావాలన్నారు. సూర్యారావు ఒకరోజు ముందుగానే వచ్చేసారు. అతన్ని పక్కవాయిద్యంకి ఛాన్సు ఇచ్చి ఆర్థిక సాయం చెయ్యాలని ఆ సభ్యుల కోరిక” అన్నాను.

“ఓ, అలాగా? ‘తమిళ విద్వాంసులకి సమానంగా తెలుగు విద్వాంసులు వాయించగలరా?’ అని మీరే ఆ మార్పు చేసారేమో అని నాకనిపించింది” అని కమల నవ్వకుండానే చెప్పింది.

ఆ సవాలుని తీసుకున్న ఆంధ్రులే తమ కీర్తిని పాడుచేసుకున్నారని నేను కమలకి చెప్పలేదు. ఆమెకే అది తెలియదా? గానంకి అనుసరణగా వాద్యం వాయించడం అసాధ్యం అనికాదు. పాటని మించి వాయించాలనే తీవ్రమైన ఆతురత; ‘అసలు నేనెందుకు ఈ గాయకుడిని అనుసరించాలి?’ అనే గర్వం - ఇవే అడ్డులు. ‘భర్తకి విరుద్ధంగా ఏదైనా చేస్తే నేను ధర్మపత్ని కాదేమో?’ అని ఒక స్త్రీ కంపించినట్టు ఒక వ్యర్థమైన మనోభావం తెలుగు వయలిన్ విద్వాంసుల మనసులని ఆక్రమించేసింది. ఇంతకీ ఆ వయలిన్ విద్వాంసుడు ఏం గొప్ప అజేయుడు కాదు. ‘నువ్వు ఎలా పాడినా సరే, నాకేం పోయింది?’ అనే ధోరణిలో మొండిగా ఉన్నట్టు కనిపించాడు.

ఇల్లు చేరుకున్నప్పుడు ఆ నౌకరీ వెలిగించిన మైనపు వత్తుల్లో సగంకి పైగా జ్వాల లేదు. “చూసారా? మన ఇంటిని చీకటి పూర్తిగా కప్పేసింది!” అని కమల

వాపోయింది. "విను, వాడి మనసులో తన బాధ్యత వత్తులని వెలిగించడంతో ఐపోయింది అని ఉంది!" అని నేను కమలని ఊరడించాను.

'వయలిన్ చేతుల్లోకి తీసుకున్నవెంటనే తన బాధ్యత తీరిందని నీ తెలుగు విద్వాంసుడు నిశ్చయించాడు!' అని నేనూ నా మనస్సులో అనుకున్నాను.

** ** **

మూడవరోజు సాయంకాలం కార్యక్రమంలో కళాకేంద్రం ప్రదర్శనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. 'ఒక పిచ్చుక, ఒక ధాన్యం గింజ తీసుకొని వచ్చింది', 'రెండు పిచ్చుకలు రెండు ధాన్యం గింజలు తీసుకొని వచ్చాయి," అని సాగే పిల్లల కధలాగ సాగింది: ఒక అమ్మాయి మీరా భజన్ పాడింది;ఇంకొక అమ్మాయి సూర్ దాసు భజను; మరొక అమ్మాయి కబీర్ దాసు భజను. ఇలా పాడుతున్న అమ్మాయిలకెవరికీ విపులంగా అభ్యాసం, అవగాహన ఉన్నట్టు గురుతులు లేవు. అందరూ బాలికలే, ఈ మధ్యనే నోరెత్తడం అలవాటు చేసుకున్నారు. ఆ తరువాతి గ్రామీణ నాట్యప్రదర్శనలు - సంతాల్, కథక్ - అన్నీ ఒకే పద్ధతిలో సాగాయి. దుస్తుల్లో మాత్రం భేదం. ఇంతకీ కళాకేంద్రం సంగీత విద్వాంసులు ఆటితేరినవారు. వారి వ్యక్తిగత ప్రదర్శనలేవీ ఆ సూర్యారావు solo వయలిన్ ప్రదర్శనకి తక్కువకాదని నాకు తెలుసు. సూర్యారావు బాగానే వయలిన్ వాయించారు కాని సంచార స్థాయిలో అతను తోవతప్పారు. దాన్ని మినహాయిస్తే మరేం లోపం అతని ప్రదర్శనలో లేదు.

మేం ఇంటికి తిరిగివస్తున్నప్పుడు కమల ఎక్కువగా ఏమీ మాటాడలేదు.

ఆఖరికి "ఈ ఉత్సవం ఎలాగో అంతమైంది!" అని నేను అన్నాను. అప్పుడే కమల "ఏం ఉత్సవమో, ఏం గొడవో? ఒక్కొక్కరోజూ ఒక్కొక్క ప్రశ్న!" అంది.

"అవన్నీ అనివార్యమైన ప్రశ్నలు!" అన్నాను.

"ఎందుకలా అంటున్నారు? కళాకేంద్రం సంఘంన్ని చేర్చుకోడం పెద్ద పొరబాటు; అనావశ్యకమైన ఖర్చులు పెరిగిపోయాయ్."

"ఆ సంబంధం వలనే అదనంగా డబ్బు వచ్చింది. వయలిన్ విద్వాంసుడుకి ఇంకా యాభై రూపాయలిమ్మని అడిగారు. నేను ఇవ్వను అనేసాను."

"ఏం, తెలుగు విద్వాంసులకి ఇవ్వడానికి డబ్బు లేదా?"

"పిచ్చిమాటలాడకు! అసలు మొత్తం వసూలైనదే నాలుగువందల రూపాయలు. కళాకేంద్రం నూరు రూపాయలు అదనంగా ఇచ్చింది."

"ఎందుకిలా ఐంది?"

"హరిహరన్ 'రెండువందలు రూపాయలు వసూలుచేసి ఇస్తాను!' అని అనగానే మేం నమ్మేసాం. ఉత్తి మాటలే! . . . ఆఖరికి అతను ఏమీ చెయ్యలేదు."

"ఎవరా హరిహరన్?"

"నారాయణ భాగవతర్ కలకత్తానుంచి రావడానికి అతనే బాధ్యత వహించారు. అతనికి ఈ ఊరులో మంచి పేరూ, పలుకుబడి ఉంది. కాని వర్తకులతో . . . " అని నేను లాగాను.

"అలాగైతే కష్టమే . . . వయలిన్ బాగా రాణించవలసింది, కాని దురదృష్టవశంగా అతని సంచారంలో అపస్వరాలు చోటుచేసుకున్నాయి! కొత్త ఊళ్ళకి పాడడానికి వచ్చిన గాయకులు వాతావరణంకి సవరించుకోలేక చలి, దగ్గుతో బాధ పడితే మనం ఏమీ అనలేం . . . పాపం, వయలిన్ విద్వాంసుడు! తనకి తనే పాడుచేసుకున్నారు!" అని కమల వేధించుకుంది.

** ** **

అలసట, మనశ్శాంతితో ఆ రాత్రి మేం నిద్రపోయాం. మరుదినం లేచినప్పుడు బాగా తెల్లవారిపోయింది. గుమ్మంలో గుజరాతీయులు - ఆడ, మగవారూ, పిల్లలూ, కొత్త బట్టలు ధరించి, 'రామ్!', 'రామ్!' అని చేతులు కలుపుకొని ఒకరకొకరు పలుకరించుకుంటున్నారు. బయటకి వెళ్ళి ముగ్గులు వెయ్యడానికి కమల జంకింది; తన నిద్రగురించి సిగ్గుపడింది.

"మాకు దీపావళి పండుగ చాలా ముఖ్యం!" అని అన్న గుజరాతీయులకి కమల "మాకు కూడాను!" అని తను చెప్పినది గుర్తుచేసుకుంది. 'మీ ఇల్లు చూడడానికి అధ్వానంగా ఉంది. ఇదేనా మీ పండుగ?' అనే చులకతనం గత మూడురోజులూ వాళ్ళ మనసులో ఉందేమో?

"దీపావళి సమయంలో ఈ ఉత్సవం జరపడం పెద్ద పొరబాటు. ఆ పండుగ ఈ ఊరుకి తగినట్టుగా మనం కొనియాడలేకపోయాం! మన సంప్రదాయం ప్రకారం పొద్దున్నే దీపాలు వెలిగించలేదు . . . ఇదేం పండుగ!" అని కమల సణుక్కుంది.

నేను మరేం అనక ఊరుకున్నాను. పనికిరాని మాటలవలన ఎవరికి లాభం?

ఆ మధ్యాహ్నం నాకొక వార్త ఫోను మూలం అందింది. నారాయణ భాగవతర్ హరిహరన్ ఇంటిలో వయలిన్ వాయించుతున్నారట; కొన్ని పాటలు పాడతారని విన్నాను. నేనూ, కమల తప్పక రావాలని హరిహరన్ అన్నారని ఆ స్నేహితుడు నాకు చెప్పారు.

"వెళ్దామా?" అని నేను అడిగాను.

"నేను రాను; మూడు రోజులు కూర్చొని, కూర్చొని, నాకు నడుం పట్టేసింది. రిక్షాలో నాలుగు మైళ్ళు ప్రయాణం చెయ్యడం నావల్ల కాదు" అని అంది కమల.

నాకూ అలసటగా ఉంది; వెళ్ళలేదు.

ఫోను మూలంగా నాకు వార్త అందించిన స్నేహితుడుని రెండురోజుల తరువాత ఒక సినిమా హాలుముందు కలుసుకున్నాం.

"మీరెందుకు రాలేదు? కచేరీ చాలా బాగా జరిగింది. ఒక హాలులో ఏర్పాటు చేసారు. మైక్ లేకపోయినా రాణించింది. మీరు విని తప్పక ఆనందించివుంటారు" అన్నారు ఆ స్నేహితుడు.

"ఏ కీర్తనలు పాడారు?" అని అడిగింది కమల.

"మూడే మూడు కీర్తనలు పాడారు. అందులో ఒకటి 'చక్కని రాజమార్గము'. దానికే రెండు వందలు ఇవ్వవచ్చు."

నేను ఉలికిపడ్డాను. "రెండు వందలా?" అని అడిగాను.

"అవును సార్! హరిహరన్కి ఇదేం పెద్ద పని కాదు. ఊరులోవున్న మార్వారీలు వచ్చారు, బాగా తలలూపి వెళ్ళారు!" అని అంటూ అతను నవ్వారు. మార్వారీలు కర్ణాటక సంగీతం విని ఆనందించిన సొగసుని అతను గుర్తుచేసుకున్నారనిపించింది.

ఇంటికి తిరిగివస్తున్నప్పుడు కమల సినిమా గురించి విమర్శన చెయ్యక దీనిగురించే మాటాడింది:

"ఆఖరికి హరిహరన్ తన సొంత డబ్బు ఖర్చు చేసారన్నమాట!"

"నారాయణ భాగవతర్ తనలాగే పాలఘాట్ నివాసి అని అతను ఆలోచించారు కాబోలు!" అని నేను గొణుక్కున్నాను.

“’కాబోలు’ అని ఎందుకు అంటున్నారు? అదే కారణం. అతనుగాని ఈ వసూలు మీకు ముందు ఇచ్చివుంటే మీరూ పెద్దమనిషితనంగా అందరికీ ఇచ్చివుంటారు. పాపం, కళాకేంద్రం తనంతట తానే రొక్కం ఇచ్చింది, ఆ వ్యవహారంలో మీరొక తోడుదొంగ అని వాళ్ళు అనిమానించరా? అసలేం జరిగిందని తెలుస్తే మీకేకదా అవమానం?” అని కమల తన వేధన ఒలకబోసుకుంది.

“నాకా భయం లేదు; సమయం వస్తే ఏం జరిగిందో చెప్తాను” అన్నాను.

“మనం ఏక్యత కావాలన్నా ఘర్షణలు తప్పవు. మీరు ‘ఆంధ్రులు వేరే’ అని ఆలోచిస్తే హరిహరన్ తానొక పాలఘాట్ తమిళుడు అనే ఉద్దేశంతో మిమ్మల్ని పక్కకి పెట్టేసారు; ఉత్సవంకి డబ్బు వసూలు చేస్తానన్నారు; కాని ఆ బాధ్యతని అతను కాపాడుకోలేదు. అందరికీ వాళ్ళ, వాళ్ళ, మనసులో భాషాభిమానం ఉంది. మీ దక్షిణ భారత సంఘంలోనే ఎన్ని విభజనలు! మీ ఏక్యత అందరూ చూడాలనేకాబోలు మీరు కళాకేంద్రంని చేర్చుకున్నారు!” అని కమల నన్ను ఎత్తిపొడిచింది.

“ఎది ఎలాగైనా ఆఖరికి ఉత్సవం జరిగింది కదా? అదే మనకి కావాలి, దానివలనే మనకి గౌరవం! నలుగురు కలిసి ఒక పని చెయ్యాలని పూనుకుంటే అన్ని విధాల చిక్కులు తప్పనిసరిగా వచ్చితీరుతాయి. మనం మన లక్ష్యం సాధించామా లేదా, అదే ముఖ్యం!” అని నేను ఘోషించాను.

భేద భావాలు, భాషాంతరభావాలు ఉన్నా కూలిపోకుండా సఖ్యతతో మన భారతదేశం వర్ధిల్లుతోంది. అలాగే ఈ ఉత్సవం వైభవం కూడా! అది ఏనాడూ క్షీణించిపోదు!

స్థానిక పత్రికలలో ప్రచురమైన విమర్శన ఇది:

“మన దేశంలో అందరూ కొనియాడే పండుగ దీపావళి. ఈ పండుగ వైభవంకి తగినట్టుగా మన ఊరులో ఒక ఉత్సవం జరిగింది. దాన్ని హిందుస్తానీ సంగీతం బోధించే కళాకేంద్రమూ, దక్షిణ భారతీయుల సంఘమూ కలిసి నిర్వహించాయి. ఈ ఉత్సవంలో కర్ణాటక సంగీత విద్వాంసులూ, మన ఊరు పిల్లలు పాల్గొన్న విధం గమనార్హం. ఈ ఉత్సవం సందేశం ఏమిటి? “కళ అన్నది మన శాశ్వత విలువలకి

అద్దం పట్టే ఒక వైభవం; దానికి మనందరినీ ఏకీకృతం చేసే శక్తి ఉందని మనం గ్రహించాలి!"

అది చదివి కమల ఆహ్లాదపడింది. "మీరనుకున్నది సాధించేసారు!" అని నన్ను పొగడింది.

ఆ తరువాత ఒక రోజు కమల ఎదురింటి మణిభాయ్ తో మాటాడడం గమనించాను.

"కమలా, మీరెందుకు మీ ఇంట్లో దీపాలు వెలిగించలేదు?"

"సరిపడని సమయం; మేం మూడురోజులూ పాటకచేరి వినడానికి వెళ్ళిపోయాం."

"దీపాలు వెలిగించకపోవడం పెద్ద పొరబాటు కాదా?"

"మాకు దీపాలంకారం అలవాటు లేదు."

"ఓ, అలాగా? . . . ఐనా ఊరుకి తగ్గినట్టుగా వెలిగించితే తప్పా? ఆ రోజు మీ ఇంటిని పూర్తిగా చీకటి కప్పేసింది."

కమల ఇక తాళలేక పోయింది.

"కార్తికమాసం మేం దీపాలు వెలిగిస్తాం. మీరు వెలిగిస్తారా?"

మణిభాయ్ "మేం వెలిగించం!" అని చెప్పింది.

నిర్దాక్షిణ్యంగా ఇంటిలోకి వెళ్ళిన కమల నాకు విచారంతో చెప్పింది: "మనసులో ఐకమత్యం కాలాలని గుర్తు చేసుకున్నా చర్చ, వాదం  అని వస్తే అది మరిచిపోతున్నాను."

"మనసులో ఏముందో అదే ముఖ్యం. అలా చూస్తే నీకంటే నేనే . . . అంత ఎందుకు?  స్త్రీలకంటే మాలో - మనసులో, మాటల్లో - ఐకమత్యం ఉంది!" అని చెప్పి నేను నవ్వేసాను.

********

(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, 12/5/54)


ARUN

# పక్కబలం

'దేహాభివృద్ధికి ఇదే మంచి ఉపాయం!' అనే నమ్మకంతో, ఓర్పుగా, సరసు తన ఇంటిపనులన్నీ పనిమనిషి సాయం లేకుండా తనే చెయ్యాలని నిశ్చయించింది. ఇక పనిమనిషిని వెతికే ప్రయాస విడచిపెట్టింది. మరేం దారి? చాలామంది దగ్గర తన కొఱత తెలియజేసింది: " బాలిక, బాలకుడు, పడుచు, ముసలమ్మ- ఎవరైనా సరే, నాకు కావాలి!" అని. కాని ఎవరూ రాలేదు. 'సరే, ఇక నేనెవరినీ పిలవను!" అని శపథం చేసుకొని, అన్ని పనులూ తనే చేసుకుంది. ఇవాళ నుయ్యినుంచి నీళ్ళు తోడుకోడానికి భర్త కృష్ణన్ సాయం చేసాడు.

కుడిచెయిలో బిగువుగా ఉన్న రెండు బంగారు గాజులు తీసి సరసు ఎడం చెయికి మార్చింది. పొరుగు వీధిలోని అవ్వ అడిగినప్పుడు "ఈ చెయి యజమాని, ఇది నౌకరీ!" అని చెప్పి, నవ్వింది. "బాగుంది నీ వాలకం!" అని ఆవిడ కూడా నవ్వారు, మెచ్చుకున్నారు.

కాని కొన్నిరోజుల తరువాత సరసుకి ఒక భయం పట్టుకుంది. తనకని ధైర్యంగా ఒక మార్గంలో నడుస్తున్నప్పుడు తన నీడని చూసే దిగులుపడినట్టు భ్రమ కలిగింది.

"అంట్లు తోముతూ, గిన్నెలు శుభ్రం చేస్తూ, కాలం గడుపుతే మరి నా పాట, చదువు, కుట్టుపని ఏంకాను? వాటిని పోషించకుండా ఉంటే ఎలాగ? మెదడుకి సంబంధించని పనుల్లోనే నేను మునిగిపోతానేమో?" అనే ఆలోచన రాగానే భర్తకి చెప్పాలనుకుంది. 'నాకు పనిమనిషి వద్దు!' అని తను సాహసంతో అన్న మాటలు గుర్తుచేసుకొని కొంచెం సిగ్గుపడినా భర్తని అడిగింది; అతను హేళన చెయ్యలేదు. "నేనూ కొందరికి చెప్పాను. చూద్దాం, ఏమౌతుందో" అన్నాడు. అతనికీ తన అవస్థ తెలిసిందని సరసు సంతోషించింది.

వీధిలో బిచ్చకత్తె కూత వినిపించింది. సరసు మండిపడింది. ముందటిరోజు వచ్చివెళ్ళిన ఒక అతిథి సత్కారంకి ఆనవాలుగా అంటు గిన్నెలు బాగా పెరిగిపోయాయి. బిచ్చకత్తెని వెళ్ళగొట్టి ఇంట్లోకి వచ్చిన సరసు మిగిలిపోయిన అన్నం, పులుసు చూసి నాలిక కఱచుకుంది. 'లోపలకి వచ్చి గిన్నెలు తోమేసి

భోంచేసి వెళ్ళు!' అని దానికి చెప్పివుంటే? కాని దాన్నిచూస్తే బిచ్చకత్తెలాగ కనిపించలేదు. 'మరేం పని దొరక్క బిచ్చమెత్తడం అలవాటు చేసుకుందేమో?' అనే ఆలోచన సరసుకి తట్టింది.

సరసు అంట్లు తోమి లేచే వేళ "అమ్మా, తాయి . . . " అనే పిలుపు వినిపించింది. తమిళంలో ఎవరో పిలుస్తున్నారని ఆహ్లాదపడుతూ సరసు గబ గబమని గుమ్మం చేరుకుంది.

నలిగిన బట్టలతో కాకుండా, మర్యాదగా, ఒకలాగ దువ్వుకున్న చింపిరి జుత్తుతో ఒక బాలిక నిలబడివుంది.

"ఎందుకే ఇలా ముష్టి అడుక్కొని తిరుగుతావ్?" అని అడిగింది సరసు.

"మరెలా బతకడం? ఆకలేస్తుందే?"

"ఏదైనా పని చేసి బతకవచ్చుగా?

"ఎవరిస్తారు పని?"

"ఇస్తే చేస్తావా? మా ఇంట్లో పని చేస్తావా?"

"హూం."

"ఇంతకు ముందు పని చేసావా?"

"పట్టంలో అయ్యర్ గారింట్లో పనిచేసాను."

"మరెందుకు మీరు ఇక్కడికి వచ్చారు? గుంపులు గుంపులుగా తమిళులు వస్తున్నారే?"

"అక్కడ మాకు బియ్యం దొరకదు!"

పదేళ్ళ బాలిక మాటలు విని సరసు నవ్వింది.

"సరే, ఇప్పుడు నీకు అన్నం, పులుసు ఇస్తాను. సాయంకాలం మా ఇంట్లో పనికి చేస్తావా?"

"సరే, వస్తాను."

"నీ పేరు?"

"కణ్ణమ్మా,"

"సరే, కొంచెం ఆగు!" అని చెప్పి, సరసు లోపలికి వెళ్ళబోతుంటే బాలిక "అంటే బియ్యం ఇవ్వరా?" అని అడిగింది.



"బియ్యం ఇవ్వను. అన్నం చాలా ఉంది. అదే ఇస్తాను. వద్దా?"

"సరే, అదే ఇవ్వండి."

'ఇదెందుకు బియ్యం కావాలంటోంది? నిన్న రాత్రి వండిన పులుసు వాసనతో ఘుమఘుమలాడుతుందే?' అని సరసు ఆలోచించింది.

"సాయంకాలం రా!" అని మళ్ళీ చెప్పింది.

'సరే!' అని చెప్పి వెళ్ళిన కణ్ణమ్మా ఆ తరువాత ఆ సందులో కనిపించనేలేదు.

** ** **

కోపం, నిరాశ, విచారం ఒకేసారి భార్యని ఆకట్టుకున్నాయని కృష్ణన్ గమనించాడు. "ముష్టెత్తుకొని బతకడమే వాళ్ళకి ఇష్టం!" అన్నాడు.

"పని దొరకడం కష్టం అని ఆ పిల్ల నాతో అంది. 'మా ఊరులో బియ్యం దొరకడంలేదని వచ్చాసాం!' అని చెప్పిందే?"

"అది కూడా అబద్ధం! ఇప్పుడు బియ్యంకి గవర్ణమెంటు అదుపు లేదే? అక్కడ సారాయి దొరకదు, అందుకే మగవాళ్ళందరూ ఇక్కడికి వచ్చేసారు కాబోలు! రిక్షాలు లాగి బతుకుతున్నారు, సారాయీ తాగుతున్నారు! వాళ్ళ కుటుంబమూ వచ్చేస్తుంది, ముష్టెత్తుకొని బతుకుతోంది! ఒడలు వొంచి ఏ పనీ చెయ్యకుండా డబ్బు సంపాదించడానికి యాచకం తప్పిస్తే మరేం వీళ్ళకి తెలియదు!" అని కోపంతో గర్జించిన కృష్ణన్ నవ్వుతూ ముగించాడు: "ఇక్కడకూడా త్వరలో prohibition రాబోతుంది."

అతని మాటలు విని సరసుకి ఆశ్చర్యంతోబాటు కోపమూ కలిగింది. 'అంటే వీళ్ళు వలస రావడానికి బియ్యమో, నిరుద్యోగమో కారణం కాదు!' అని మండిపడింది. ఆ బాలిక కణ్ణమ్మా పేరూ, మొహం గుర్తుచేసుకొని తనలో నవ్వుకున్న సరసు ఇప్పుడు ఆ పేరు జ్ఞాపకం రాగానే విసుగ్గుంది; ఆ తరువాత తలని సరిగ్గా దువ్వుకోకుండా వేసిన సిగతో వచ్చిన బిచ్చగత్తెలని చూడగానే ద్వారం మూసేసింది. తమిళనాడులో సంగీతాభిమానంతో పాడుకుంటూ వచ్చే యాచకలూ ఉన్నారు; చెవులు మూసుకొని సరసు వాళ్ళని వెళ్ళగొట్టింది.

** ** **

"పాపం, నువ్వే గిన్నెలు తోముకుంటున్నావన్న మాట!" అని పొరుగు వీధి అవ్వ మళ్ళీ జాలితో అడిగారు.

"ఒడలు వంచి పని చేస్తే మంచిదే! చూడండి, మన దేశంనుంచి మన పరువు తీయడానికి  ఈ గుంపులు వచ్చేసాయి!" అని సరసు చెప్పింది. తను కణ్ణమ్మాని పనికి రమ్మని చెప్పినది కొంచెం నవ్వుతూనే చెప్పింది.

"వద్దమ్మా, వద్దు! అలాంటివాళ్ళని పిలవకు. ఎవరికి తెలుసు, ఇంటిలో ఉన్నదేదో దోచుకొని పోతారు!" అని ఆవిడ అనగానే సరసు నివ్వెఱపోయింది.

కొన్నిరోజుల తరువాత అవ్వ మళ్ళీ అడిగారు: "నౌకరీకి నీకెవరూ దొరకలేదా?"

"లేదండీ. నేనూ ఎవరినీ వెదకలేదు. మీరే నాకొక మంచి నౌకరుని పంపిస్తారని నా ఆశ. నా కంటే మీరే ఎక్కువగా బాధ పడుతున్నారు!" అని సరసు నవ్వుతూ, విసుగ్గుంది.

"ఇక్కడ ఒక తమిళ పిల్ల ఉంది. మా వీధిలో ఇద్దరు గుజరాతీయుల ఇళ్ళల్లో పని చేస్తోంది. దాన్ని అడిగాను. 'మదరాసీ ఇళ్ళల్లో పని చెయ్యను!' అంటోంది; నేనేం చేస్తాను, చెప్పు" అన్నారు ఆవిడ.

"బాగుంది! మనకి వాళ్ళని చూస్తే కోపం, అలాగే వాళ్ళకి మనమంటే కోపం అన్నమాట! సరేలేండి, అది మనకి వద్దు!"

"ఎందుకైనా, ఇంకొకసారి అడిగి చూస్తాను!" అని అవ్వ అన్నప్పుడు సరసు ఆక్షేపించలేదు.

ఆ మరుదినం మధ్యాహ్నం ఒక పడుచుపిల్ల "మీరు పిలిచారట!" అని గుమ్మం దగ్గర వచ్చి నిలబడింది.

"నువ్వేనా చిన్ని? 'మదరాసీ ఇళ్ళల్లో పని చెయ్యను' - అని అన్నావని విన్నాను . . . " అని సరసు అడిగేసింది.

"అవునండీ . . . అదే నాకు భయం . . . ఎవరు ఏదైనా అంటే నేను భరించలేను!"

ఈ పడుచు చూడడానికి చక్కగా జడ వేసుకొని ఉంది. అందువలనే సరసు మనస్సులో మార్పు కలిగిందేమో? తనకి నౌకరీ తప్పకుండా కావాలని గుర్తుచేసుకుంది.

"ఇష్టముంటే రా . . . నేను మరేం చెప్పి నీ మనసు నొప్పించను . . . " అని సరసు పని, జీతం గురించి వివరాలన్నీ చెప్పింది.

"సరే, వస్తాను" అని చిన్ని చెప్పి వెళ్ళింది.

నౌకిరీ దొరికిందని సరసు సంతోషించలేదు. "బాగా పనిచేస్తోందా?" అని అవ్వ అడిగినప్పుడు "ఏమో, మీరన్నది నేను మరిచిపోలేను! దొంగతనం గురించి నాకు దిగిలుగా ఉంది!" అని మనసు విప్పి చెప్పింది.

"అవునమ్మా, అదీ నువ్వు చూసుకోవాలి!" అని ఆవిడ సరసుకి బాధ్యత మళ్ళీ గుర్తుచేసారు.

కొత్తగా వచ్చిన పనిమనిషి వచ్చినరోజునుంచి తన లేమి గురించే పాట: "తినడానికి తిండి కొంటే తొడుక్కోడానికి బట్టలు లేవు! బట్టలు కొంటే తిండికి డబ్బు చాలదు!" ఇలాగే రోజూవారీ రెండుసార్లు చిన్ని చెప్పుతూ వచ్చింది. సరసుకి బెంగ పట్టుకుంది. తను ధరించిన చీర, ఇంటిలోని గిన్నెలూ, వస్తువులూ చూసి చిన్నికి కడుపుమంటగా ఉందేమో అని అనుమానం కలిగింది.

"నీ మొగుడుకి ఏం పని?" అని సరసు అడిగింది.

"సిమెంటు కంపెనీలో నీళ్ళు తోడేపని; చాలా కష్టమైన పని."

"మీకంటే కష్టపడుతున్నవాళ్ళు ఎంతమంది ఉన్నారు? అది తలచుకొని మీరు తృప్తి పడాలి. రిక్షా లాగి డబ్బు సంపాదించి సారాయి తాగుతున్నారు. ఆడవాళ్లు బిచ్చమెత్తడానికి తయారవుతున్నారు. అవన్నీ మీ ఇంట్లో లేవుకదా?" అని అంది సరసు; చిన్ని మొగుడు తాగుబోతా అని తెలుసుకోవాలని నాజూకుగా అలాగ అడిగింది.

"అవునమ్మా, నిజం! జనులు చాలా కష్టపడుతున్నారు. మాకూ చెప్పలేనన్ని కష్టాలు, అవన్నీ తలచుకుంటే  భయంగా ఉంది!" అంది చిన్ని.

"ఏం కష్టాలు?" అని సరసు అడగలేదు.

ఒకరోజు సరసు పొరుగింటిలోని తెలుగుపిల్ల తను అరువుగా తీసుకొనివెళ్ళిన జంతికల గొట్టం తిరిగి ఇచ్చింది. సరసు దాన్ని అందుకొని లోపలికి వెళ్తుంటే చిన్ని "నాదగ్గరకూడా ఒకటి ఉంది. కాని బజారులో ఎవరూ తీసుకోరు" అంది.

'అదేమో దొంగలాడిన వస్తువేమో?' అనే అనుమానంతో "ఏం, ఎందుకు తీసుకోరు?" అని సరసు అడిగింది.

“ఏమో, ఎవరికి తెలుసు? వాళ్ళకి వద్దట! మాకూ పనికి రాదు, ఇంట్లో ఉత్తికే ఉంది!” అంది చిన్ని.

తత్తరపాటులో సరసు మరేం అడగలేదు.

కొంచెసేపు తరువాత “సరే, నువ్వు త్వరగా నీ పనులు పూర్తిచేసుకొని వెళ్లు! నేను తలుపేసుకొని స్నానంకి వెళ్ళాలి!” అని చిన్నిని తొందరబెట్టి, పంపించేసి, సరసు నిట్టూర్పు వదిలింది.

కాని తన అనుమానం భర్తకి చెప్పడానికి సరసు జంకింది. ఎందుకు? అది ఆమెకే బోధపడలేదు.

ఇంకోక రోజు పాలు ఒలకబోవడంతో, సరసు దాన్ని ఒక వెండి గ్లాసులో పోసి, “చూడు, దీనికి పంచదార కలిపాను. నువ్వు ఆ గిన్నెలో తీసుకొనిపో!” అని చెప్పి ఆ వెండి గిన్నెతో కాఫీ డికాక్షన్ చిన్నికి అందించింది. చిన్ని మామూలుగా ఆ ఇంట్లో రోజు తాగే కాఫీకి - పాలు, పంచదారకి - నెలకి కనీసం మూడు రాపాయలైనా - ఖర్చవుతుందని దానికి తెలియాలి అని సరసు ఉద్దేశం.

“ఇలాగే తీసుకువెళ్ళాను” అంది చిన్ని.

“వద్దు! గ్లాసుని తోమిపెట్టు! పాలు గిన్నెలో పోసుకో!” అంది సరసు.

“ఇలాగే తీసుకొనివెళ్ళకూడదా? సాయంకాలం తిరిగి ఇచ్చేస్తాను” అని చిన్ని అనగానే సరసు కోపంతో “విను, వెండి గ్లాసు ఇంటికి ఇవ్వను! నేను చెప్పినట్టు చెయ్!” అని గద్దించింది.

చిన్ని అలాగే చేసి వెళ్ళింది.

“దీన్ని ఏమనడం - బోళాతనమా లేక గడుసుతనమా? ఆ వెండి గ్లాసుని తనింటికి తీసుకొనివెళ్ళి ‘అదెక్కడో పోయిందమ్మా!’ అని అది ఏడుస్తే మనం చేసేదేముంది?” అని పొరుగింటి తెలుగు మహిళకి సరసు చెప్పింది. మాటవరుసలో “చిన్ని తన దగ్గర ఒక జంతికల గొట్టం ఉందని చెప్పింది. కావాలంటే మీరు కొంటారని దాని ఉద్దేశం కాబోలు!” అని చెప్పింది.

“నేను నాకు కావలసినప్పుడల్లా మీదే వాడుతున్నాను. అది మీకు బాధగా లేదుకదా?” అని ఆవిడ నవ్వుతూ అడిగారు.

“అలాగేం లేదండి,” అని సరసు నవ్వుతూ చెప్పింది.

“ధర కనుక్కో. కావాలంటే కొందాం!” అన్నారు ఆవిడ.

మరుదినం సరసు దాని గురించి చిన్నిని అడిగింది.

“మా ఆయన ఐదు రూపాయలిచ్చి కొన్నారు. ఇదే గొట్టం మన ఊరులో ఇత్తడిలో దొరుకుతుంది. ఇది ఇనుము గొట్టం, దీనికే ఐదు రూపాయలు తగలబెట్టారు! వృధాగా ఇంట్లో ఉంది!” అంది చిన్ని.

‘ఎందుకు అతను అలాగ కొన్నారు?’ అని సరసు అడగాలనుకుంది. “అంత ధర ఇచ్చి ఎవరూ కొనరు; నా దగ్గరవున్నదేమో రెండు రూపాయలకే కొన్నాను” అని మాత్రం చెప్పి ఊరుకుంది.

సరసు మనసుని రకరకాల ఆలోచనలు ఆక్రమించుకున్నాయి. బెంగతోబాటు కోపమూ పెరిగింది. నడిదారిలో దుష్టుడులాగ కనిపించే మనిషి మనకి తోడుగా వస్తే మనం అనుభవించేది ధైర్యమా లేక ఓదార్పా?

రెండురోజులముందు సరసు పొంగలి చేసినప్పుడు చిన్నికి వడ్డించింది. ఇంటిలో చుంటెలుకల బాధ ఎక్కువైపోయిందని, బియ్యంకి ఒక డబ్బా కావాలని చిన్ని అడిగింది. సరసు కిరసెనునూనె డబ్బా ఇవ్వబోతుంటే దానికంటే ఇంకా పెద్ద డబ్బా అడిగి తీసుకొని వెళ్ళింది.

ఇవన్నీ సరసు మనసుని ఆకట్టుకున్నాయి.

‘బట్టలు కొనాలంటే డబ్బు ఎక్కడనుంచి వస్తుంది? తనకి చీర కావాలని నాకు జాడగా చెప్తోందా? ఐదు రూపాయలకి దాని మొగుడు ఆ జంతికల గొట్టం కొన్నాడట!’ అని లోలోపల సరసు నసుక్కుంది.

‘దీనికీ, నాకూ పొత్తు లేదు!” అనే భావన సరసు మనసులో లేచింది. ఇలాగే మరికొన్ని రోజులు గడిచాయి.

** ** **

ఒక రోజు చిన్ని ఆలస్యంగా వచ్చింది. ఒక క్షణం ‘ఎందుకు ఆలస్యం? ఇక నువ్వు రావొద్దు!’ అని దాన్ని వెళ్ళగొట్టాలని సరసుకు తోచింది.

“ఇంత ఆలస్యం చేస్తే ఎలాగమ్మా? ఇల్లంతా ఎంత అధ్వానంగా ఉందో చూసావా?” అని అడిగింది.

"అమ్మా, నేనేం చేస్తాను చెప్పండి? మేం కొంచెం నియమం తప్పినా మీరు నా మీద దయ చూపాలి. ఇతరులకి మా కష్టాలు తెలియవు . . . ఇవాళ ఆలస్యం ఐపోయింది" అని చిన్ని మర్యాదగా అంది.

సరసు మరేం అనలేదు. పని చేస్తూ చిన్నికూడా చాలా సేపు మాటాడలేదు. సరసు చిన్నికి కాఫీ అందించినప్పుడు చిన్ని "నేను కాఫీ తాగుతున్నాను. అతను మాత్రం 'టీ' తాగుతారు!" అని అంది.

'దీనికి పెద్ద నోరు!' అని సరసు తనలో చెప్పుకుంది.

"నిన్నరాత్రి నేనూ అతనూ దెబ్బలాడుకున్నాం!" అంది చిన్ని.

"ఏం, ఎందుకు?"

"ఈ నెల నా రెండు నెలల జీతం కలిపి చీర, రవికలు కొనాలన్నాను. వెంటనే దెబ్బలాటకి వచ్చేసారు. 'నాకు చొక్కాయి లేదు, పంచె లేదు. నీకు చీర కావాలా?' అని అడిగారు. నేను ఏదో అన్నాను, అతనేదో అన్నారు, అంతే ఒక పెద్ద దెబ్బలాట! ఇద్దరం నోరు పారేసుకున్నాం . . . ఇవాళ పొద్దున్న 'టీ' చేసి ఇచ్చాను. 'తాగను' అని పట్టుపట్టారు. ఆఖరికి తాగారు. అందుకే ఆలస్యమయింది.'

"ఓహో, అంత కోపం అన్నమాట! ఇంతకీ నీ జీతమే కదా?"

"అదే అడిగాను, అందుకే కోపం! ఆ జంతికల గొట్టంకి తను ఐదు రూపాయలు పాడు చేసానని అతనికి బాధగా ఉంది . . . "

"సరేలే, నువ్వు చీర కొనవద్దు. దానికి బదులు పావు కిలో నూనె కొని, జంతికలు చేసి అమ్ము!"

సరసు మాటల్లోని తాత్పర్యం చిన్నికి బోధపడలేదు; అది వివరించడం అసాధ్యం.

"నేను ముగ్గురు ఇళ్ళల్లో పని చేస్తున్నాను; రెండు పూట్లా వస్తున్నాను. ఆ తరువాత నాకు ఇంటిలో పని; పొద్దున్న టీ చెయ్యడానికే తొందరపడాలి. మరి జంతికలు చెయ్యడం ఎలాగ? ఏ పనీ దొరకలేదంటే, జంతికలు, చేకోడీలు, వేరుసెనగ, జొన్న - ఏదో ఒకటి - మాకు సాయం చేస్తుంది."

"అవును, అవును" అని సరసు తలూపింది.

'ఒడలు వంచి, ఏదో పని చేసి, పరువుతో బతుకుతాం!' అనే ఆ మాటల్లోని ధ్వని సరసుని పులకరించింది.

** ** **

సరసుకి చిన్నిమీద నమ్మకం కలిగింది. నిమ్మళంగా ఒక యజమాని స్థానంలో తన బాధ్యతలు స్వీకరించింది, అందుకు చిన్ని తోడ్పడింది. ఇంతలో ఒక శోధన లేచింది. పనులు ముగించి, మెట్లు దిగి పోతున్న చిన్నిని చూస్తూ ఒక స్త్రీ సరసు ఇంటి గుమ్మం ఎక్కి వచ్చారు.

"అది మీ ఇంటి పనిమనిషా?" అని సరసుని అడిగారు.

"అవును. ఇన్నిరోజుల తరువాత ఒక తమిళ అమ్మాయి మా ఇంటిలో పనిచేస్తోంది!" అని అంటూ సరసు నవ్వింది.

"ఇది నీకెక్కడ దొరికింది? ఇంతకు ముందు బిచ్చమెత్తుకొని తిరిగినట్టుంది. ఒక కుంటివాడుతో దీన్ని నయాబజార్ లో నేను చూసాను."

సరసు అదిరిపడింది, కాని వెంటనే సర్దుకుంది. "'పని చెయ్, బిచ్చమెత్తకు!' అని మనం వీళ్ళని వెళ్ళగొడ్తాం. 'నౌకరీ ఇవ్వను, బిచ్చమెత్తుకొని బతుకు!' అని అంటే అదేం న్యాయం?" అని అడిగింది.

"నాకు తెలిసినదేదో నీకు చెప్పడం నా బాధ్యత . . . తరువాత నీ ఇష్టం!" అని శ్రమతో నవ్వుతూ ఆ స్త్రీ అన్నారు.

సరసుకి మనశ్శాంతి పోయింది. చిన్నిగురించి తనకి కలిగిన అనుమానం, అది ఎలాగ తొలగిందని నవ్వుతూ భర్తకి చెప్పిన విధం గుర్తుచేసుకుంది. 'దేవుడా, నేనిప్పుడు ఏం చెయ్యాలి?' అని నివ్వెఱపోయింది.

'జంతికలు, చేకోడీలు, వేరుసెనగ, జొన్న - ఏదో ఒకటి - మాకు సాయం చేస్తుంది' అని ఆ రోజు చిన్ని అనలేదూ? "'నువ్వొక కుంటివాడితో బిచ్చమెత్తుకొని తిరుగుతున్నావా? నీ పరువూ, ప్రతిష్ట ఎక్కడ దాంకున్నాయ్?' అని దాన్ని ఎలా అడగడం?" అని సరసు ఆయాసపడింది.

మరేం దారి తెలియలేదు. చిన్నితో చనువుగా మాటాడి అసలు నిజమేమిటే తెలుసుకోవాలని సరసు ఆలోచించింది. ప్రేమతో ప్రశ్నలడిగింది. యజమాని

మొహం చూసి చిన్నికి ఉత్సాహం కలిగింది. పాత కథలు పంచుకుంది. కాని కుంటివాడితో తిరిగిన ఘటనగురించి ఏమీ అనలేదు.

"ఇన్నిరోజులూ నిన్నడగని ప్రశ్న ఇప్పుడు అడుగుతాను. నాకు జవాబు కావాలి!" అంది సరసు.

"ఏమిటది?"

"'మదరాసీల ఇళ్ళల్లో నౌకరీ చెయ్యను!' అని ఎందుకు నీకు మొండితనం?"

"ఓ, అదా? ఎందుకని చెప్తే మీరు నవ్వరమ్మా. గొడ్డలి కాలు మీద పడి మా ఆయన పెద్ద గాయంతో ఆసుపత్రిలో రెండు నెలలున్నారు. పని లేదు, రాబడి లేదు. ఆ కష్టంలో నా పెద్దకొడుకు ప్రాణమూ పోయింది. నా మనసు బాగాలేదు. బిచ్చమెంతుకుంటూ మన తమిళులు ఎవరైనా కనిపిస్తే వాళ్ళదగ్గర పని ఏదైనా అడుగుదాం, సాయం చేస్తారేమో అని మేం తిరిగాం. వాళ్లకేం? మమ్మల్ని చూడగానే తరుముతారు. 'జావ్ జావ్, చలే జావ్!' అని కేక పెడ్తారు; మన భాషలో కూడా మాటాడరు! మేమేదో చుట్టరికం కావాలని తొందరపడుతున్నామని అని భయం! మేం ఇంటిముందున్న ముగ్గులు చూసే మన దేశపు మనుషులని ఆతురతతో అడుగుతాం. కాని వాళ్ళకి మేం పరాయి మనుషులుగా కనిపిస్తాం; గభీమని వెంటనే తలుపు మూసేస్తారు! అబ్బబ్బా, ఈ సిమెంటు కంపెనీలో పనికి మేం ఎన్ని కష్టాలు పడ్డాం! మంచిపేళ, అతనికి కాలు దక్కింది. మేం ఎలాగో కడుపు నింపుకొంటున్నాం."

'ఓ, అదా కారణం?' అని సరసు ఆశ్చర్యపడింది. కాని ఒక అనుమానం కూడా లేచింది.

"కాని, ఎందుకు బిచ్చమెత్తాలి? జంతికలు చేసి అమ్మవచ్చు కదా?"

"నేనూ అదే చెప్పాను. నలుగురు ఇళ్ళల్లో పనిచేసి బతకాలని ఊరంతా తిరిగి తిరిగి నా కాళ్ళలో చెప్పలేని పోటు. అప్పుడు జంతికలు చెయ్యడానికి జాగా లేదు, సమయమూ లేదు. నాకూ ఇష్టం లేదు. నేను చెప్పానుగా నా కొడుకు పోయాడని? వాడున్నప్పుడు నేను తినుబండారాలు చేసే, డబ్బు సంపాదించి మా ఆయన్ని ఆసుపత్రిలో చేర్చాను. నా కొడుకు జంతికలు కావాలని అడుగుతూవుంటాడు. నేనూ ఇస్తాను; కాని ఎల్లప్పుడూ ఇవ్వగలనా? ఒక రోజు జ్వరం వచ్చింది.

జంతికలు అడిగాడు. ఇవ్వలేదు. ఆ తరువాత చచ్చిపోయాడు. అందువలనే జంతికలంటేనే నాకిప్పుడు మనసు రాదు. ఇప్పుడుకూడా మా ఆయన అంటున్నారు . . . .” గభీమని చిన్ని మొహంలో చిరునవ్వు మెరుపులా కనిపించి మాయమైంది.

“అతను ఏమంటున్నారు?” అని సరసు కొంటెగా అడిగింది.

“‘ఇంకా రెండు మూడు నెలల తరువాత గుజరాతీ ఇళ్ళల్లో పని మానేయ్! మన అమ్మగారింట్లో మాత్రం పని చేసి ఒక తినుబండారాల దుకాణం ముందు కూర్చో!’ అని అంటున్నారు. నాకది ఇష్టం లేదమ్మా! ఇప్పుడున్న పిల్లవాడిని చూస్తే నాకు ఆ కొడుకు గుర్తుకి వస్తున్నాడు. జంతికల వ్యాపారం ఆరంభిస్తే నా బాధ ఇంకా ఎక్కువ అవుతుంది . . . మగవాళ్ళకి ఇవేం బోధపడవు!” అని చిన్ని అంగలార్చుకుంది.

** ** **

‘నాదీ ఆడ జన్మే! నేనూ ఒక భార్యనే!’ నాకూ ఇవన్నీ అర్థం కావడం లేదు!’ అని సరసు నొచ్చుకుంది.

తమ దాంపత్య మార్గంలో సంతతి సహవాసం, అనురాగం తప్పక కావాలనే భావన ఇప్పుడే మొట్టమొదట సరసు మనసులో చోటుచేసుకుంది.

పాప తోడు కావాలంటే కృష్ణన్ నవ్వుతాడు!

ఆ నవ్వుకి నెమ్మదిగా వీచే గాలి లాగ మనసుని ఆహ్లాదించే గుణముంది. కాని సంతతి అనురాగం ఆ మందమారుతంలో కలిసి వచ్చి మనసుని మైమరపించే ఒక పూలగుత్తి లాగ కదా?

తన మనసులోని ఆరాటం సరసు భర్తకి చెప్పింది.

“చిన్ని తన జీవితంలో చాలా కష్టాలు అనుభవించింది. అందువలనే నాకు దానిమీద అనుమానం కలిగింది!” అని నొచ్చుకుంది.

“కష్టాలు అనుభవించినవారు ముక్కుసూటిగా మాటాడతారు!” అని కృష్ణన్ సహజంగా అన్నాడు.

"అవును, నిజం. బాగా చెప్పారు!  నేనుగాని ఇంతకుముందు మీరన్నది వినివుంటే ఎంత బాగున్ను! ఇటుపైని నామనసులో ఆరాటం అని వస్తే నేను మిమ్మల్నే  అడుగుతాను!" అని సరసు ఒప్పుకుంది.

చిన్ని సేవకి Electric Fan గాలి లాగ చెల్లించాలి. ఆ విద్యుత్ గాలి మూలంగానే పువ్వులతోట గాలి ఘనత తనకి అర్థమైందని సరసు నోరు విప్పి అన లేదు; తన ఓరకంటి చూపుని చిన్ని మీద మళ్ళీ మళ్ళీ  పోనిచ్చింది.

********

(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, అక్టోబర్ 10, 1954)

# ఏండీ సుందరేశన్

## (అనువాదకుడు)

జననం 1939, బరంపురం, ఒడిషా రాష్ట్రం, గంజాం జిల్లాలో. ఇంజనీయరుగా తమిళనాడులో కృషిచేసి, ఆ తరువాత అమెరికాకి M.B.A., చదువుకని వచ్చి, 1977లో అమెరికాలోనే స్థిరపడిపోయారు. ఉద్యోగ విరమణ తరువాత, గత ఇరవై ఆరు సంవత్సరాలుగా తమిళ కథలు, నవలలు ఆంగ్ల, తెలుగు భాషలలో అనువాదం చేస్తున్నారు. 2013లో ఇతను అనువదించిన నీల పద్మనాభన్ తమిళ నవలని Autumn Reveries అనే పేరుతో కేంద్ర సాహిత్య అకాడమీ డెల్లీలో ప్రచురించింది; దానికి 2016లో ***నల్లి చెన్నై దిశై ఎట్టు*** సంస్థ పురస్కారం లభించింది.

వివరాలకి http://kurinjipubs.com/ website చూడండి.

ఇటీవల ఇంకొక నీల పద్మనాభన్ తమిళ నవలని సుందరేశన్ అనువదించారు. అది Chariot Path అనే పేరులో త్వరలో రాబోతుంది.

తన అక్కయ్య రచయత్రి వింధియా రాసిన తమిళ కథలన్నీ తెలుగులో అనువదించాలని సుందరేశన్ పూనుకున్నారు. అతనితోబాటు కొన్ని కథలు అతని విజయనగరం మిత్రులు శ్రీ K. V. శేషారావుగారు అనువదించారు.

ఇంతవరకూ ఐదు e-books గా వచ్చాయి;

ప్రేమ హృదయం (విందియా కథలు - సంపుటం 1)

పార్వతి(విందియా కథలు - సంపుటం 2)

మొలకెత్తిన ముత్యం(విందియా కథలు - సంపుటం 3)

తీయని చుట్టరికం(విందియా కథలు - సంపుటం 4)

ఇదొక శుభవేళ! (విందియా కథలు - సంపుటం 5)

********




(రచయిత్రి వింధియా భర్త Prof. V. సుబ్రహ్మణ్యంతో)